# రాజ్యాంగాన్ని ఎలా చూడాలి?

కె. బాలగోపాల్

HRF




# రాజ్యాంగాన్ని
## ఎలా చూడాలి?

కె. బాలగోపాల్

మానవహక్కుల వేదిక ప్రచురణ
**Human Rights Forum (HRF)**

# రాజ్యాంగాన్ని ఎలా చూడాలి?

కె. బాలగోపాల్

మానవహక్కుల వేదిక ప్రచురణ

**A Human Rights Forum Publication**

ప్రచురణ సంఖ్య: 66
మొదటి ముద్రణ : అక్టోబర్ 2025

వెల : రూ. 50/-

**ముద్రణ :**
అనుపమ ప్రింటర్స్, గ్రీన్ వ్యూ,
126 శాంతినగర్, హైదరాబాద్ - 28
ఫోన్ : 23391364, 233041941
Email: anupamaprinters@yahoo.co.in

**ప్రతులకు:**
వి. వసంతలక్ష్మి 99854 11455
కె. అనురాధ 97019 24796
నవ తెలంగాణ, నవోదయ బుక్ హౌస్‌లు, హైదరాబాద్.

మా వెబ్‌సైట్: www.humanrightsforum.org
బాలగోపాల్ రచనల కోసం: www.balagopal.org

“రాజ్యాంగానికి ఉన్న పరిమితులలోనే మనం జీవించాలి నిజమే కాని రాజ్యాంగంలో అంతర్లీనంగా ఉన్న ఉత్తమ ఆకాంక్షలను ఇముడ్చుకోవడానికి దాని పరిధిని వీలైన మేరకు విస్తరించాల్సిన బాధ్యత కూడ మనపై వుంది. ఇది కోర్టులకూ వర్తిస్తుంది. వారికే కాదు, రాజ్యాంగబద్ధంగా పని చేయాల్సిన వారందరికీ వర్తిస్తుంది. ఆ దిశలో 25 సంవత్సరాల క్రితం ఒక బలహీనమైన ప్రయత్నం మొదలై చాలా కొద్దికాలంలోనే ఆగిపోయింది. ఈ రోజు 'మితవాద శక్తులు' 'ప్రయత్నపూర్వకంగా అధికారాన్ని చేజిక్కించుకున్నారు'. ఈ మాట నేను కేవలం బిజెపిని మాత్రమే ఉద్దేశించి అనడం లేదు. అంతే కాదు, వాళ్ళు కోర్టులను కూడ గణనీయంగానే తమ అధీనంలోకి తెచ్చుకున్నారు. అయితే పూర్తిగా కాదు, సుప్రీంకోర్టుతో సహా అన్ని కోర్టుల నుంచి ఇంకా అప్పుడప్పుడూ భిన్న స్వరాలు వినిపిస్తూనే ఉన్నాయి. కాని అప్పుడప్పుడూ మాత్రమే.

ఇతర రాజ్య విభాగాలపైన ఎంత తీవ్రమైన, రాజీలేని విమర్శ చేస్తున్నామో, కోర్టులను కూడ అలాగే నిరంతరం విమర్శనాత్మకంగా చూడడం తప్ప ఈ పరిస్థితిని చక్కదిద్దే వేరే పరిష్కారాలు ఏవీ మన దగ్గర లేవు. కోర్టులను విమర్శించాలంటే భయపడే వాళ్ళకి ఊరటగా ఒక మాట: కోర్టులపై చేసే విమర్శ అంతా కోర్టు ధిక్కరణ కాదు. ఒకవేళ కోర్టు ధిక్కారంగా పరిగణించినా, అందుకు గరిష్టంగా విధించే శిక్ష కేవలం ఆరు నెలల సాధారణ జైలు శిక్ష మాత్రమే.”

# మా మాట

**భా**రత రాజ్యాంగాన్ని మార్చాలా వద్దా అనే చర్చ పాతికేళ్ళ క్రితం మన దేశంలో విస్తృతంగా జరిగింది. ఎటువంటి మార్పులు తీసుకొస్తున్నారు, వాటి వల్ల ఎవరికి లాభం, కొత్త హక్కులు వస్తే మంచిదే గాని ఉన్న హక్కులు కూడా పోతే ఎలా?, ఆదేశిక సూత్రాలను మొత్తంగా తీసేస్తే అణగారిన వర్గాల పరిస్థితి ఏమిటి? వంటి ప్రశ్నలు చాలానే ముందుకొచ్చాయి అప్పుడు. రాజ్యాంగాన్ని మార్చే అవకాశం హిందుత్వవాదులకు ఇస్తే మనం ఇన్నాళ్ళూ గర్వంగా చెప్పుకుంటూ సంతోషపడుతున్న 'సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యం'లో కొన్ని పదాలు ఎగిరిపోతాయి కాబట్టి దాన్ని అసలే ముట్టుకోవద్దనే వాళ్లకూ, ఆర్థిక విధానాల ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రభుత్వ విధానాలకు అడ్డం రాకుండా ఉండేలా రాజ్యాంగాన్ని మార్చాలని కోరుకుంటున్న వాళ్ళకూ మధ్య ఈ సంవాదం ప్రధానంగా నడిచింది. బాలగోపాల్ మొదటి వాదన వైపు ఉంటూనే ఇప్పుడున్న రాజ్యాంగంలోనూ కొన్ని లోపాలు ఉన్నాయని, ముఖ్యంగా రాజ్యాంగ లక్ష్యాలకు అనుగుణంగా తమ జీవితాలను మెరుగుపరుచుకునే సాధనాలను రాజ్యాంగం వారికి తగినంతగా ఇవ్వలేదని, మార్చడమంటూ జరిగితే అటువంటి లోటుపాట్లు పూరించేలా జరగాలని ఈ వ్యాసాలలో పేర్కొన్నారు. ఇవన్నీ సుమారు 2000–2004 మధ్య రాసిన వ్యాసాలు.

అయితే రాజ్యాంగం గురించి బాలగోపాల్ ఈ ఒక్క సందర్భంలో మాత్రమే కాదు, అనేక సందర్భాలలో అనేక వ్యాసాలు రాశారు. రాజ్యాంగంలోని సంక్షేమ బాధ్యతల గురించి, ఆదివాసుల హక్కులు, దళిత, మైనారిటీ రిజర్వేషన్లు, రాజ్యం ఎప్పటికప్పుడు తీసుకొస్తున్న అణచివేత చట్టాలు, మైనారిటీల పట్ల వివక్ష, కోర్టులు, ఇతర రాజ్యాంగ సంస్థలు ప్రజల పట్ల చూపించే బాధ్యతారాహిత్యం తదితర అనేక సందర్భాలలో ఆయన ఇంగ్లీష్, తెలుగు రెండిట్లోనూ ఎన్నో వ్యాసాలు రాశారు. అయితే అవన్నీ ఇప్పటికే 'రాజ్యం సంక్షేమం', 'దళిత', 'రిజర్వేషన్లు', 'ఆదివాసులు: వైద్యం, సంస్కృతి, అణచివేత', 'కోర్టు తీర్పులు–సామాజిక న్యాయం' మొదలైన పుస్తకాలలో వచ్చాయి. అయితే ఇందులో ప్రధానంగా రాజ్యాంగ సమీక్షపై రాసిన వ్యాసాలను, రాజ్యాంగాన్ని ఎలా చూడాలి? అని

చెప్పిన వ్యాసాలను మాత్రమే చేర్చాం. సామాజిక ఉద్యమాలకు రాజ్యాంగంతో ఉన్న ఇబ్బంది ఏమిటో, అలాగే రాజ్యాంగం వారిపై పెట్టిన బాధ్యతలను నెరవేర్చడంలో కోర్టులు ఎలా నిరాశపరుస్తూ వస్తున్నాయో వివరించే మరో రెండు పెద్ద ఇంగ్లీష్ వ్యాసాలను కూడా అనువాదం చేసి ఇందులో చేర్చాం. రాజ్యాంగంపై మనం పెట్టుకున్న ఆశలు, దానికున్న పరిమితులు మరింత సమగ్రంగా అర్థం కావడానికి ఇవి ఎంతో ఉపయోగపడతాయి. తెలుగు వ్యాసాలలో ఎక్కువ భాగం ఒకే సంవత్సరం (2000) లో రాసినవి. ఆ సంవత్సరంలో ఈ చర్చ ఎక్కువగా జరగడమే దానికి కారణం.

ఆ తర్వాత కాలంలో ఈ చర్చ ఎందుకో గాని కొంత తగ్గుముఖం పట్టింది. ఎందుకు తగ్గుముఖం పట్టిందనేది ఇప్పుడిప్పుడే మనకు స్పష్టంగా అర్థమవుతోంది. రాజ్యాంగాన్ని మార్చకుండానే రాజ్యాంగ సంస్థల్ని గుప్పెట్లో పెట్టుకుని తమకు కావాల్సిన మార్పులన్నీ సాధించుకునే విద్య ఒకటి ఇప్పుడు పాలకులు నేర్చుకున్నారు. కాగితం మీదిది కాగితం మీద ఉంటూనే 'కాగల కార్యాన్ని గంధర్వులు' నిర్వర్తించినట్టు వారికి కావాల్సింది వారు చేసుకుపోతున్నారు. ఇది ఇంకా ప్రమాదకరం. మరి ఇప్పుడు మనం చేయాల్సిందేమిటి?

మన దేశంలో మెజారిటీ ప్రజలకు ఇప్పటికీ రాజ్యాంగం అంటే ఏమిటో తెలియదు. తెలిసిన కోర్టులు ఎక్కువసార్లు కులీన, సంపన్న వర్గాల ఆలోచనల వైపే మొగ్గు చూపుతున్నాయి. ఇప్పుడున్న మంచి చట్టాలను రద్దు చేయడానికి శాసనకర్తలైనా వెనకాడుతున్నారేమో గాని కోర్టులు మాత్రం అడగకుండానే ఒక అడుగు ముందుకు వేసి వాళ్ళ పనిని సులభతరం చేస్తున్నారని బాలగోపాల్ ఒక వ్యాసంలో ఘాటుగా విమర్శించారు కూడా.

హిందుత్వవాదుల అసలు లక్ష్యం రాజకీయ, సాంఘిక, ఆర్థిక సమానత్వ విలువల్ని రాజ్యాంగం నుండి తొలగించడమే. ఆ పనిని వెంటనే చేయకపోయినా, రాజకీయ వాతావరణం అనుకూలంగా ఉన్నపుడు రాజ్యాంగ సమీక్ష పేరుతో చేసి తీరతారు. అప్పటిదాకా అన్ని రాజ్యాంగ సంస్థలను తమ ఆధీనంలోకి తీసుకొని రాజ్యాంగాన్ని కొద్దికొద్దిగా మారుస్తూ, అందులోని సమానతా విలువల్ని నీరుకార్చే ప్రయత్నం చేస్తారు. ఈ రెండు చర్యలనూ అడ్డుకోవడానికి మనకు రాజ్యాంగం పట్ల సరైన అవగాహన ఉండడం అవసరం. ఈ వ్యాసాలు ఆ అవగాహనను ఇస్తాయని నమ్ముతున్నాం.

**మానవహక్కుల వేదిక**

2 అక్టోబర్ 2025

## ఇందులో...


సమీక్ష పేరుతో రాజ్యాంగ దుర్వినియోగం – బిజెపి ఎత్తుగడ 9

రాజ్యాంగంలోని సమానతా విలువల్ని కాపాడుకోవాలి 16

ఎన్నికల సంస్కరణలు – రాజ్యాంగ సమీక్ష ఎందుకోసం? 20

రాజ్యాంగాన్ని ఎందుకు సమీక్షించాలి? 25

రాజ్యాంగ సమీక్ష అవసరమే కాని...
ఎవరికోసం? ఎందుకోసం? 30

రాజ్యాంగం – సామాజిక ఉద్యమాలు 35

ప్రపంచీకరణ – రాజ్యాంగం – కోర్టులు 46

# సమీక్ష పేరుతో రాజ్యాంగ దుర్వినియోగం – బిజెపి ఎత్తుగడ

21 మే 1998, వార్త

రాజ్యాంగాన్ని ఎందుకు సమీక్షించాలో చెప్పకుండా సమీక్షించాలి, సమీక్షించాలి అని భారతీయ జనతా పార్టీ కొంతకాలంగా అంటున్నది. సమీక్షించడంలో తప్పేముంది అని ఎదురుప్రశ్న వేస్తూ ఉంది. తప్పేముంది? ఏమీ లేదు. ఏదీ శాశ్వతం కాని ఈ ప్రపంచంలో ప్రస్తుత భారత రాజ్యాంగం మాత్రం శాశ్వతమని ఎందుకు అనుకోవాలి? కాని ఎందుకు మారాలి, ఏ దిశగా మారాలి అన్న ప్రశ్నలు వేసుకోవాలి. ఆ ప్రశ్నలకు తమ జవాబేమిటో చెప్పకుండా 'సమీక్షించాలి, మార్చాలి' అని బిజెపి వాళ్ళు అనడంలో ఏదో దురుద్దేశం దాగి ఉందని అనుమానించేవారిని అభిశంసించవలసిన పని లేదు. అన్ని విషయాలలో లాగ ఈ విషయంలో కూడ వారి 'హిడెన్ ఎజెండా' ఏమిటి, అది రాజ్యాంగాన్ని ముందుకు తీసుకుపోతుందా లేక వెనక్కి తీసుకుపోతుందా? అంటే ప్రజలకు మరింత ప్రజాస్వామ్యం, మరిన్ని సమానత్వపు హక్కులు కల్పిస్తుందా, లేక ఉన్నవి తీసేస్తుందా? ఇదీ మనం ఆలోచించాల్సింది.

మొత్తంగా సమాజాన్ని అస్థిరతలో పడేసే ప్రమాదం లేకుండా రాజ్యాంగ సవరణలకు పరిమితులు పెట్టాలనేది సర్వత్రా కనిపించే ఒక ఆదుర్దా. రాజ్యాంగాన్ని సులభంగా సవరించే అవకాశం ఏ రాజ్యాంగమూ అనుమతించదు. ఉన్నంతలో భారత రాజ్యాంగమే కొంత సులభమైన అధికారాన్ని ఇస్తుంది. కేవలం అప్పుడు అధికారంలో ఉన్న వారి ఇష్టాయిష్టాల ప్రకారం మార్పులు జరగకూడదని, సమాజంలో మెజారిటీ ప్రజల ప్రత్యక్ష సమ్మతి ఉన్న రాజ్యాంగ సవరణలను మాత్రమే అనుమతించాలని ఒక అభిప్రాయం ఉంది. కొన్ని దేశాల్లోనైతే రాజ్యాంగాలు రెఫరెండం లేకుండా రాజ్యాంగ సవరణలను అనుమతించవు.

కాని అన్ని అభ్యుదయకరమైన మార్పులకు మెజారిటీ మద్దతు ఉండకపోవచ్చును కాబట్టి ఇది సర్వత్రా కాంక్షనీయమైన పరిమితి కాకపోవచ్చు. పద్ధతి సంగతి అటుంచి లక్ష్యానికొస్తే రాజ్యాంగాన్ని ముందుకు తీసుకుపోయే మార్పులే తప్ప వెనక్కి తీసుకుపోయే సవరణలు అనుమతించకూడదనేది మరొక సహేతుకమైన ఆత్రుత. ఏది పురోగమనం, ఏది తిరోగమనం అనే విషయంలో ఏకాభిప్రాయం ఉండకపోవచ్చునన్న సంగతి అటుంచి, మెజారిటీ కోరుకున్నా తిరోగమనమని భావించిన దానిని అనుమతించకూడదనడంలో ఆచరణాత్మకమైన ఇబ్బందులు ఉండక తప్పదు. అప్పుడా సమస్య రాజకీయంగా పరిష్కారం కాగలదే  తప్ప రాజ్యాంగ శాస్త్రం దానిని పరిష్కరించలేదు. పెద్ద సంఖ్యలో సామాజిక మద్దతు ఉన్న మతవాదుల నుండి రాజ్యాంగ లౌకికసూత్రాన్ని నిషేధాలు, నిర్బంధాల ద్వారా కాపాడాలని ప్రయత్నం చేస్తున్న అల్జీరియా, టర్కీ వంటి దేశాలు ఈ సమస్యను ఎదుర్కొంటున్నాయి.

భారత సుప్రీంకోర్టు ఈ క్లిష్టతరమైన సమస్యకు ఒక జవాబు చెప్పింది. భారత రాజ్యాంగం ప్రకారం రాజ్యాంగంలో సవరణలు తీసుకొచ్చే హక్కు పార్లమెంటుకు మాత్రమే ఉంది. (కేంద్ర, రాష్ట్ర సంబంధాలకు వర్తించే విషయమైతే అసెంబ్లీలు కూడ తగు సంఖ్యలో ఆమోదించవలసి ఉంటుంది.) అంటే ప్రజలు చట్టసభల ద్వారా మాత్రమే రాజ్యాంగాన్ని మార్చవచ్చునని భారత రాజ్యాంగం అంటుంది. చట్టసభలు ప్రజాభిప్రాయానికి ఒక మేరకు ప్రాతినిధ్యం వహిస్తాయి కాబట్టి ఇది అహేతుకమైన నియమం కాదు కాని సవరణ పద్ధతి ఇట్లాగే ఉండవలసిన అవసరమేమీ లేదు. ఇంతకంటే ప్రజాస్వామికమైన ఏర్పాట్లు ఉండగలవు. అయితే చట్టసభలు రాజ్యాంగాన్ని తమ ఇష్టానుసారం మార్చేయవచ్చునా? ప్రజలు ఎన్నుకున్న మెజారిటీ ప్రతినిధులం కదా అని పాలక పక్షం రాజ్యాంగాన్ని ఏమైనా చేసేయవచ్చునా? దీనికి మన రాజ్యాంగంలో ఏ జవాబూ లేదు. సవరించే పద్ధతి మీదే తప్ప దిశ మీద రాజ్యాంగం ఏ పరిమితీ పెట్టలేదు. దానికి సుప్రీంకోర్టు జవాబు చెప్పవలసి వచ్చింది. మొదట్లో రాజ్యాంగంలోని ఏ విషయాన్నయినా (రాజ్యాంగం నిర్దేశించిన పద్ధతిలో) పార్లమెంటు సవరించవచ్చును, తొలగించవచ్చును అని సుప్రీంకోర్టు అన్నది. తరువాత గోలఖ్ నాథ్ కేసులో (1964) పార్లమెంటు రాజ్యాంగంలో ఏ విషయాన్నయినా సవరించవచ్చును కాని ప్రాథమిక హక్కులను మాత్రం ముట్టుకోవడానికి వీలు లేదన్నది. దీని మీద చాలా వివాదం చెలరేగిన తరువాత కేశవానంద భారతి కేసులో (1973) సుప్రీంకోర్టు తన అభిప్రాయాన్ని పాక్షికంగా సవరించుకొని పార్లమెంటు రాజ్యాంగంలోని

ప్రాథమిక హక్కులతో సహా ఏ విషయాన్నయినా ఏ మేరకయినా సవరించవచ్చును గాని మౌలిక నిర్మాణం మాత్రం దెబ్బ తినకూడదని, దెబ్బ తిన్నట్టయితే ఆ సవరణ చెల్లదని చెప్పింది.

ఇప్పటివరకు రాజ్యాంగ సవరణల విషయంలో ఇదే సుప్రీంకోర్టు అభిప్రాయంగా ఉంది. మళ్ళీ సుప్రీంకోర్టే తిరగదోడేంత వరకూ ఇదే ఈ విషయంలో ప్రమాణంగా ఉంటుంది. అంటే ఇంతకు మించి వేరే పరిష్కారం మనం ఆలోచించకూడదని కాదు. ఆ మాట కొస్తే సుప్రీంకోర్టు కూడ తన అభిప్రాయం (మంచికైనా, చెడుకైనా) మార్చుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వం మాత్రం ప్రస్తుతానికి ఈ పరిధిలోనే వ్యవహరించక తప్పదు.

**మౌలిక స్వరూపమంటే...**

ఇక్కడున్న అస్పష్టమైన విషయమేమిటంటే రాజ్యాంగం మౌలిక స్వరూపం లేక మౌలిక నిర్మాణం ఏమిటి అనేది. దానిని సుప్రీంకోర్టు ఎక్కడా ఒక చోట సమగ్రంగా నిర్వచించలేదు. కాని కేశవానంద భారతి కేసులో మొదలుపెట్టి వివిధ తీర్పులలో వివిధ మౌలిక అంశాలను సూచించింది. ఆ తీర్పుల ప్రకారం కూడ బిజెపి తమ మనసులో ఉన్న మార్పులను తీసుకురాలేకపోవచ్చు. ప్రజాస్వామ్య పాలనా వ్యవస్థ, రాజ్యాంగానికి ఉండే ఫెడరల్, లౌకిక స్వభావం, సంక్షేమ రాజ్యాన్ని నిర్మించాలన్న రాజ్యాంగ ఆదేశం, చట్టసభలకూ కార్యనిర్వాహక శాఖకూ న్యాయవ్యవస్థకూ మధ్య ఉన్న అధికార విభజన, దేశ సమగ్రత సమైక్యత సార్వభౌమత్వాలు, ప్రాథమిక హక్కులు పౌరులకు కల్పించే గౌరవప్రదమైన అస్తిత్వం, చట్టబద్ధ పాలన, ప్రాథమిక హక్కులకూ ఆదేశిక సూత్రాలకూ మధ్య సమతుల్యం, న్యాయ వ్యవస్థకు ఉండే స్వతంత్రత, సమీక్షా అధికారం మొదలైనవి ఇప్పటిదాకా వివిధ తీర్పులలో సుప్రీంకోర్టు గుర్తించిన రాజ్యాంగ మౌలిక నిర్మాణానికి సంబంధించిన అంశాలు. ఈ మౌలిక నిర్మాణానికి భంగం వాటిల్లనంత కాలం పార్లమెంటు రాజ్యాంగాన్ని ఎంతగానయినా సవరించవచ్చుననేది ప్రస్తుత చట్టం.

వలస పాలన కాలంలో ముందుకొచ్చిన సాంఘిక ఆర్థిక రాజకీయ ఉద్యమాలలో పుట్టి రాజ్యాంగంలోకి ఏదో ఒక రూపంలో వచ్చి చేరిన ప్రజాస్వామిక ఆదర్శాలను ఆధారం చేసుకొన్నదే ప్రస్తుత చట్టం. ఆ ఆదర్శాలలో ఎన్నిటితో బిజెపికి ఏకీభావం ఉంది? బిజెపి ఏ సంఘ్ పరివార్‌లో భాగమో ఆ సంఘ్ పరివార్ జాతీయోద్యమ కాలం నాటి రాజకీయ ఉద్యమంలో గాని, సంఘ సంస్కరణోద్యమాలలో గాని, రైతాంగ పోరాటాలలో గాని, ఆదివాసీ తిరుగుబాట్లలో గాని పాల్గొనలేదు. గాంధీ తన చివరి

రోజులలో తన శక్తియుక్తులన్నీ ఒడ్డి చేపట్టిన మత సామరస్య కృషిలో భాగం కాలేదు. అద్వానీకీ, వాజ్‌పేయికీ మాతృ సంస్థ అయిన ఆర్.ఎస్.ఎస్. ఈ ఉద్యమాల ఆదర్శాలలో ఏ ఒక్కదానినీ స్వీకరించకపోగా వీటిలో చాలావాటికి అది ఆనాడు వ్యతిరేకం. పైగా మత సామరస్యానికి, లౌకికతకు అది బద్ధ శత్రువు.

నిజమే, ఆనాటికీ ఈనాటికీ వీరిలో మార్పేమీ రాలేదనలేము, వర్ణాశ్రమ ధర్మాన్ని, స్త్రీల వంటింటి ధర్మాన్ని ఆదర్శాలుగా ప్రకటించుకునే స్థితిలో బిజెపి ఇప్పుడు లేదు. సమానత్వ హక్కులు అడగడం అంటేనే జాతిని బలహీన పరచటం అనే గోల్వాల్కర్ అభిప్రాయాన్ని ఈ రోజు బిజెపి బహిరంగంగా చెప్పుకునే స్థితిలో లేదు. ఇప్పుడు బిజెపికి అనుబంధంగా కూడ హక్కులడిగే కార్మిక సంఘాలూ, విద్యార్థి సంఘాలూ, మహిళా మోర్చా, దళిత మోర్చా ఉన్నాయి. మైనారిటీ అనే భావనే అనవసరమనీ, మైనారిటీ అయినా మెజారిటీ అయినా అందరూ భారతీయులేననీ, మైనారిటీ కమిషన్ రద్దు చేసి దేశ పౌరులందరికీ వర్తించే మానవ హక్కుల కమిషన్ నెలకొల్పాలనీ కొన్ని సంవత్సరాల కిందటి దాకా మాట్లాడిన బిజెపి ఈ రోజు తాను ఎంత మంది ముస్లింలకు పార్లమెంటు టిక్కెట్లు ఇచ్చిందీ లెక్కగట్టి చెప్తూ ఉంది. కేంద్ర క్యాబినెట్లో ఎంత మంది ముస్లింలకు పదవులిచ్చిందీ చెప్తూ ఉంది. అయితే ఇది నిజమైన మార్పేనా? లేకపోతే కొంచెమైనా మారినట్టు కనిపించాలన్న గుర్తింపు తెచ్చిపెట్టిన ప్రదర్శనా? సమ్మెలతో ఆందోళనలతో జాతి ఆర్థిక ప్రగతిని కార్మికులు ధ్వంసం చేస్తున్నారని, కుల వ్యతిరేకత పేరిట దళితులు, బహుజనులు అంటూ సమాజాన్ని విభజించి శాంతి లేకుండా చేస్తున్నారనీ, పాలనా వ్యవస్థలోనూ ఆర్థిక వ్యవస్థలోనూ ప్రతిభకూ, యోగ్యతకూ చోటు లేకుండా చేస్తున్నారనీ, స్త్రీల వ్యక్తిగత స్వేచ్ఛా కాంక్ష కుటుంబ విలువలను ధ్వంసం చేస్తున్నదనీ, ఆదివాసులు ఆకాశం నుండి ఊడి పడినట్టు అడవంతా మాదే అంటున్నారనీ, మైనారిటీ మైనారిటీ అంటూ ఈ గడ్డ మీద హిందువుగా పుట్టడమే నేరమయినట్టు మాట్లాడుతున్నారనీ, సంక్షేమం, సంక్షేమ రాజ్యం అంటూ దేశ ఆర్థిక పురోగతికి అడుగడుగునా అడ్డంకులు కల్పిస్తున్నారనీ ఈ రకమైన నిరసన, అసహనం ఉన్న పార్టీ బిజెపి. అలాంటి అభిప్రాయాలున్న వారు మన సమాజంలో చాలా మంది ఉన్నారు. బిజెపి వోట్ల పునాది ఈ నిరసన నుండి వచ్చినదే. ఆ పార్టీ కార్యకర్తల, నాయకుల ఆలోచనల పూర్వరంగం ఇదే. పైకి ఆ మాటలు ప్రకటించుకోవటం రాజకీయంగా ఇబ్బందికరమని వేరే మాటలు మాట్లాడితే మాట్లాడవచ్చుగాక!

వారి ఇటువంటి సామాజిక పునాది మీద నిలబడి చేసే రాజ్యాంగ సమీక్ష ఏ విధంగా ఉండబోతోందో ఊహించడం కష్టం కాదు. జాతీయోద్యమ కాలం నాటి ఆకాంక్షలు భారత రాజకీయాలకు ఒక సామాన్య నుడికారాన్ని అందిచ్చాయి. ప్రజాస్వామ్యం, సంక్షేమం, సమానత్వం ఈ నుడికారంలోని ప్రధాన అంశాలు. రాజకీయ పార్టీల ఉద్దేశాలలో ఇందుకు భిన్నమైన అంశాలు అనేకం ఉన్నా ఈ నుడికారంలోనే మాట్లాడటం, ప్రజలు ఒత్తిడి పెట్టిన మేరకు తద్భిన్నమైన పాలసీలను ఈ ఆకాంక్షలతో సమన్వయపరిచే ప్రయత్నం చేయడం లేదా చేసినట్టు కనిపించడం అన్ని రాజకీయ పక్షాలకూ ఉన్న అలవాటు. ఇవి ఒట్టి బూటకం అనుకోనక్కరలేదు. రాజకీయాలలో వ్యక్తం అయ్యేది కేవలం బలవంతుల ప్రయోజనాలు కాదు. వారి ప్రయోజనాలకు, బలహీనుల అవసరాలకు మధ్యనున్న సంఘర్షణ వ్యక్తమవుతుంది. సంఘర్షణాత్మక సమతుల్యం వ్యక్తం అవుతుంది. అప్పటికి ఆ సమాజం సాధించి స్థాపించుకున్న నాగరికతా ప్రమాణాల వెలుగులో ఇవి వ్యక్తం అవుతాయి. 1990 వరకు భారత రాజకీయాలకు అలవాటయిన సమతాసంక్షేమాలు ఆర్థిక సాంఘిక రంగాలలో బలహీనులయినవారికి కొన్ని వాస్తవికమైన ప్రయోజనాలు కల్పించింది. 1990 లో మొదలయిన ఆర్థిక పునర్వ్యవస్థీకరణ ఈ నుడికారాన్ని మొట్టమొదటిసారిగా దెబ్బతీసింది. దాని స్థానంలో సమతకూ సంక్షేమానికీ తావులేని కార్పొరేట్ పరిభాష భారత రాజకీయాల భాష అవుతున్నది.

అయితే తొలినాడు కూడ భారత రాజకీయలలో సామాన్య పరిభాష అయిన ప్రజాస్వామ్యం, సమత, సంక్షేమాలకు దూరం ఉన్న ఒకే ఒక రాజకీయ పక్షం భారతీయ జనతాపార్టీ, దాని పూర్వరూపమైన భారతీయ జన సంఘ్. అందుకే బహుశా ఈ కొత్త రుతువులో ఆ పార్టీ చాలా వేగంగా పాలక పార్టీ కాగలిగింది. సమతా సంక్షేమాల పరిభాష పట్ల సమాజంలో వివిధ స్థాయిలలో పేరుకొని పోయిన నిరసనను తనవైపు ఆకర్షించగలిగింది. ఇవన్నీ దృష్టిలో ఉంచుకుంటేనే ఈ రోజు వీళ్ళు చేపట్టబోయే రాజ్యాంగ సమీక్ష ఏ కోణం నుండి ఉండబోతుందో మనకు అర్థం అవుతుంది. అందుకే బహుశా నేడు ఏ రకమైన మార్పులు కోరుకుంటున్నదీ బయటికి చెప్పకుండా కేవలం సమీక్షిద్దాం, సమీక్షిద్దాం అని బిజెపి వారు అంటున్నారని కూడ మనకు అర్థం అవుతుంది.

## బి.జె.పికి ఏం కావాలి?

వీళ్ళకేం కావాలి? మైనారిటీలకు మతం, సంస్కృతి, విద్యారంగాలలో ప్రత్యేక రక్షణ కల్పించే ప్రాథమిక హక్కులయిన ఆర్టికల్స్‌ను, పోలీసులయినా వేరే ఏ ఇతర

రాజ్యాంగ యంత్ర విభాగమైనా పౌరుల స్వేచ్ఛకు, జీవించే హక్కుకు ఆటంకం కలిగించే చర్యలకు పాల్పడినప్పుడు న్యాయంగా, నిష్పాక్షికంగా, హేతుబద్ధంగా వ్యవహరించాలంటూ సుప్రీంకోర్టు ఆర్టికల్ 21కి ఇచ్చిన వివరణను తొలగించడమా? రిజర్వేషన్లు మొత్తంగా 50 శాతం మించడానికి వీలు లేదని అదే సుప్రీంకోర్టు ఏ తర్కం లేకుండా చేసిన సూచనలకు రాజ్యాంగబద్ధత కల్పించడమా? వీళ్ళకేం కావాలి? ఒక్క విషయం మాత్రం మొన్న అద్వానీ బయటపెట్టాడు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం స్థానంలో అధ్యక్షతరహా పాలనను నెలకొల్పడం ఉచితమా కాదా అనే చర్చ తాము చేపట్టదలచిన రాజ్యాంగ సమీక్షలో ఒక ముఖ్య అంశం అని ఆయన అన్నాడు. సుప్రీంకోర్టు ప్రజాస్వామ్యం రాజ్యాంగ మౌలిక స్వరూపంలో భాగమని అన్నది కానీ పార్లమెంటరీ ప్రజాస్వామ్యం రూపంలోనే ఉండాలని అనలేదనీ, అధ్యక్ష తరహా పాలన కూడ ఒక ప్రజాస్వామ్య రూపమే కాబట్టి ఆ సవరణ రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని ఉల్లంఘించదనీ అన్నాడు. అందరు జడ్జీలు అనలేదు గానీ కేశవానంద భారతి కేసులో జస్టిస్ జగన్మోహన రెడ్డి పార్లమెంటరీ ప్రజాస్వామ్యం రాజ్యాంగ మౌలిక స్వరూపంలో భాగమనే అన్నారు. అద్వానీ న్యాయ సలహాదారులెవ్వరో గానీ వారు ఆయనకు ఈ సంగతి చెప్పినట్టు లేరు.

కోర్టు సంగతి అలా ఉంచి భారత దేశ పరిస్థితులకు ఏది తగినదో కొంచెం ఆలోచిద్దాం. మన దేశంలో సామాజికంగానూ భౌగోళికంగానూ చాలా వైవిధ్యం ఉంది. వివిధ ప్రాంతాల, ప్రజాశ్రేణుల ప్రయోజనాలనూ ఆకాంక్షలనూ ఇముడ్చుకోగల పాలనావ్యవస్థ ఈ దేశానికి అవసరం. సామాజిక ఆర్థిక అసమానతల వల్ల ప్రజా శ్రేణులన్నిటికీ ఈ విషయంలో ఒకే సామర్థ్యం ఉండదు. బలం, అధికారం, డబ్బు ఉన్న వారి ప్రయోజనాలకు దొరికినంత సులభంగా అవి లేని వారి ప్రయోజనాలకు గుర్తింపు దొరకదు. తమ అవసరాల మేరకు ప్రభుత్వం పైన ఒత్తిడి పెట్టే అవకాశం అది ఉద్యమాల ద్వారా కావొచ్చు, ఎన్నికల ద్వారా కావొచ్చు పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఉన్నంతగా అధ్యక్ష తరహా పాలనలో బలహీన వర్గాలకూ, ప్రాంతాలకూ అవకాశం ఉండదు. స్థిరత్వం ప్రధానం అనుకునే వారికిది జాతి ప్రయోజనాలకు భంగకరమైన విషయంగా కనిపించవచ్చు. కాని ఒక్కసారి నేరుగా ఎన్నికయి అయిదేళ్ళు పార్లమెంటుకు పరోక్షంగా మాత్రమే జవాబుదారు అయి పరిపాలించే అధ్యక్షుడి ప్రభుత్వంపై ఒత్తిడిపెట్టే అవకాశం ధనవంతులకూ బలవంతులకూ ఉన్నంతగా బలహీనులకు ఉండదు.

బిజెపి తన ప్రతిపాదనలకు ఎరగా చూపిస్తున్న స్థిరత్వానికి పోటీ అస్థిరత కాదు, సంక్షేమం, సమత అని గుర్తిస్తే తప్ప అధ్యక్ష తరహా పాలనను ఎందుకు వ్యతిరేకించాలో అర్థం కాదు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం వాటికి భరోసా ఇస్తుందని కాదు. నిజానికి ఏ రాజకీయ రూపమూ సామాజిక ఆర్థిక సమానత్వానికి తనంతట తాను భరోసా ఇవ్వలేదు. హెచ్చు తగ్గులలో అవకాశం మాత్రమే కల్పించగలదు. ఆ అర్థంలో అధ్యక్ష తరహా పాలన కంటే ఇప్పుడున్న పార్లమెంటరీ ప్రజాస్వామ్యమే మెరుగైనది. దీనికి ప్రజల పట్ల మరింత జవాబుదారీతనాన్ని కల్పించే రీతిలో వేరే సవరణలు చేయడాన్ని గురించి ఆలోచించవలసిందే గానీ ఈ మాత్రం కూడ జవాబుదారీతనం లేని పాలనావ్యవస్థ వద్దు. అది రాజ్యాంగ మౌలిక స్వరూపానికి విఘాతం కలిగిస్తుందని సుప్రీంకోర్టు అన్నా అనకున్నా రాజకీయంగా ఈ నిర్ణయం ప్రజలు తీసుకోవడం అవసరం.

# రాజ్యాంగంలోని సమానతా విలువల్ని కాపాడుకోవాలి

జనవరి 2000, నీహార్ ఆన్‌లైన్.కామ్

రాజ్యాంగం రచించిన యాభై ఏళ్ల సందర్భంగా దానిని పునఃపరిశీలించాలన్న సూచనలు, డిమాండ్లు వినవస్తున్నాయి. ఈ డిమాండు పెట్టేవారు బహుశా నిజంగా కోరుకునేది రాజ్యాంగాన్ని తిరగరాయాలని. ఆ డిమాండుకు భయపడనక్కరలేదు. ఎందుకంటే రాజ్యాంగాలను రాసుకునేది మనం, మార్చుకునేదీ మనమే.

అయితే రాజ్యాంగ సమీక్ష మొదలు కావలసింది దాని పనితీరుతోనే తప్ప రాజ్యాంగ పాఠంతో కాదు. రాజ్యాంగం పనితీరు న్యాయ సిద్ధాంత సంబంధమయిన విషయం మాత్రమే కాదు, అందుకు సమానంగా అది రాజకీయ విషయం. దానిని సమీక్షించాలన్న డిమాండు, తిరగరాయాలన్న డిమాండు కూడ అంతే. కాబట్టి మనం వేసుకోవాల్సిన ప్రశ్నలు. రాజ్యాంగం పనితీరుకు సంబంధించిన రాజకీయాన్ని గురించి; దానిని సమీక్షించాలి లేక తిరగరాయాలి అన్న డిమాండుకు సంబంధించిన రాజకీయాన్ని గురించి.

భారత రాజ్యాంగం ప్రవేశికలో రాజకీయ, సామాజిక, ఆర్థిక న్యాయం ప్రాతిపదికగా గల సమాజాన్ని నిర్మించడం కోసం ఈ రాజ్యాంగాన్ని దేశ ప్రజలు తమకు తాము అర్పించుకున్నారని ప్రకటించబడింది. ఆ తరువాత ప్రజలకుండే హక్కుల గురించి, ప్రవేశికలో చెప్పిన సామాజిక, రాజకీయ, ఆర్థిక న్యాయాన్ని సాధించడం కోసం ప్రభుత్వం అనుసరించాల్సిన పాలనా విధాన ప్రమాణాల గురించి చెప్పే రెండు అధ్యాయాలున్నాయి. తక్కిన రాజ్యాంగమంతా – షెడ్యుల్డు కులాల, తెగల రక్షణకు సంబంధించిన కొన్ని విషయాలను మినహాయించి – రాజ్యాంగ యంత్రానికి సంబంధించిన వివిధ విభాగాల అధికారాలను, బాధ్యతలను, వాటి మధ్యనున్న అధికార విభజనను వివరించే విషయాలే.

దీని పని తీరు ఆచరణలో ఏ విధంగా ఉండింది?

భారత రాజ్యాంగం ఇచ్చే పాలనా విధాన సూత్రాలు సమత, సంక్షేమాల ప్రాతిపదికన ఉన్నాయి. కానీ మన దేశ పాలకుల విధానాలు ఎల్లవేళలా అట్లా లేవు. దీనికి కారణం ఆర్థికరంగంలో వారు పెట్టుబడిదారీ అభివృద్ధి విధానాన్ని అనుసరించడం. దేశ దీర్ఘకాల ప్రయోజనాలనూ, బలహీన వర్గాల ప్రయోజనాలనూ దృష్టిలో ఉంచుకొని దానిపైన కొన్ని ఆంక్షలు పెడితే పెట్టి ఉండవచ్చును గాక. ఈ ఆంక్షలన్నీ కేవలం అధికారగణం అక్రమార్జనకు సాధనాలు తప్ప వేరే ఏమీ కాదని ప్రైవేట్ పెట్టుబడిదారీ రంగం నిర్విచక్షణగా తిట్టి పోసుకొంటున్నప్పటికీ వాటిలో కనీసం కొన్నిటికి సంక్షేమ లక్ష్యం ఉండింది. అయినప్పటికీ దేశ ఆర్థిక నమూనాను మొత్తంగా తీసుకున్నప్పుడు అది పెట్టుబడిదారీ నమూనాయేనని చెప్పక తప్పదు. దీని ఫలితంగా కాలక్రమంలో రాజ్యాంగానికి ఉండే సమానతా ఆదర్శాలకూ వాస్తవ పరిస్థితులకూ మధ్య అగాధం పెరిగింది.

ఈ నేపథ్యంలో చూసినప్పుడు రాజ్యాంగాన్ని సమీక్షించడానికి రెండు కారణాలు ఉండగలవు. ఒకటి, వాస్తవ పరిస్థితులను రాజ్యాంగ ఆదేశిక సూత్రాలకు దగ్గర తేవడానికి ఆ ఆదేశాలకు కొంత బలం కల్పించడం. రెండు, రాజ్యాంగాన్ని తిరగరాసి దానిని వాస్తవ పరిస్థితులకు దగ్గర తీసుకురావడం. ఈ రోజు బలంగా ఉన్నది రెండవ వైఖరే.

పునఃపరిశీలన జరగాలన్న ఆరాటం ఇప్పటికే న్యాయస్థానాల దృక్కోణం మీద ప్రభావం వేసింది. సంక్షేమాన్నీ హక్కులనూ అభివృద్ధికి ఆటంకంగా చూసే వైఖరి మొదలయ్యింది. వాటిని దళితులు, కార్మికులు, మురికివాడలవాసులు, మైనారిటీలు దేశ విధాన నిర్ణేతలపైన పెట్టే అహేతుకమైన బ్లాక్ మెయిల్‌గా చూస్తున్నారు. కేరళ రాష్ట్రంలోని వెనుకబడిన కులాలలో 'క్రీమీలేయర్' లేదని ఆ రాష్ట్ర ప్రభుత్వం అనడానికి వీలు లేదనీ, ఉందని గుర్తించాల్సిందేననీ, వారందరికీ రిజర్వేషన్ పొందే హక్కు తొలగించవలసిందేననీ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు దీనికొక ఉదాహరణ. న్యాయస్థానాలు ఈ విషయంలో ఆధిపత్య వర్గాల ఆలోచనా రీతినే అనుసరిస్తున్నాయి. పీడితులు, తాడితులు, వెనుకబడినవారు మొదలయిన పేర్లతో పిలువబడే ప్రజలు అహేతుకమైన ఒత్తిడి పెట్టకపోయినట్టయితే భారత దేశానికి అగ్రరాజ్యం కాగల సత్తా ఉండేదనే అభిప్రాయం దేశంలో విస్తృతంగా ప్రాచుర్యం పొందుతున్నది.

ఈ అభిప్రాయానికి అనుగుణంగా తిరగరాయడం కోసం రాజ్యాంగాన్ని సమీక్షించాలా? లేకపోతే రాజ్యాంగాన్ని దాని స్ఫూర్తికి తగినట్టు పని చేయించే మార్గాలు వెతుకుదామా?

అయితే రాజ్యాంగాన్ని దాని స్ఫూర్తికి తగినట్టు పని చేయించడానికి ఏ మార్పులు చేయనక్కరలేదని అనుకోనక్కరలేదు. భారత రాజ్యాంగంలో కేంద్రీకరణ చాలా ఎక్కువ. నిర్ణయాధికారాన్ని గ్రామస్థాయి దాకా వికేంద్రీకరించవలసిన అవసరం ఉంది. ఏదో ఒక రూపంలో పని లేక ఉపాధి అనే దానిని ఒక ప్రాథమిక హక్కు చేయాలి. 14 సంవత్సరాల దాకా పిల్లలకు విద్య ఒక ప్రాథమిక హక్కన్న గుర్తింపు ఉండాలి. సుప్రీంకోర్టు ఈ విషయం ఇప్పటికే చెప్పి ఉంది.

అయితే అన్నిటికంటే బహుశా ముఖ్యమైనది ఈ రాజ్యాంగం కలలు గనే కొత్త సమాజాన్ని నిర్మించడానికి వ్యక్తులుగానూ, సమష్టిగానూ కృషి చేసే అవకాశం ప్రజలకు రాజ్యాంగ వ్యవస్థ ఎంత మాత్రం ఇస్తుందనేది. సంఘటితమయ్యే హక్కు, రాజకీయాలలో పాల్గొనే హక్కు ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ రాజ్యాంగంలో ఒక సార్వత్రిక హక్కే అయినప్పటికీ భారత రాజ్యాంగ యంత్రానికి ఉండే పోలీసు అధికారాలు దానిని తరచుగా నిరాకరిస్తాయి. ఒక నిర్దిష్టమైన పరిధిలో వ్యక్తమయ్యే రాజకీయ స్వేచ్ఛను మాత్రమే సహించడం జరుగుతున్నది. ఆ పరిమితికి వెలుపల ఏ రాజ్యాంగ పరిమితులూ వర్తించని పోలీసు పెత్తనానిదే రాజ్యం. చట్టాన్ని రక్షించేవాళ్ళు భక్షకులుగా మారకుండా ఉండేటట్టు రాజ్యాంగానికి ఏ విధంగా బలం చేకూర్చగలం?

అయితే రాజ్యాంగాన్ని సమీక్షించాలని కోరుతున్నవారు బహుశా పోలీసు పెత్తనం మరింత పెరగాలని కోరుకుంటున్నారు. లేదా పౌరహక్కుల పైన పెట్టగల 'పరిమితుల' హేతుబద్ధతను మరికొంత 'ఉదారంగా' వ్యాఖ్యానించాలని కోరుకుంటున్నారు.

రాజ్యాంగం కల్పించిన అవకాశాలు వినియోగించుకొని అధికారానికి వచ్చే రాజకీయ నాయకులు ఆ రాజ్యాంగం ఆదేశించే న్యాయబద్ధమైన సమాజ నిర్మాణంలో నిమగ్నం కావాలని ఒత్తిడి పెట్టగల మార్గాలను అన్వేషించాలి. ప్రజల మేలు కోసం చట్టం ఇచ్చిన అధికారాలను ప్రభుత్వం వినియోగించాలే తప్ప భద్రంగా దాచి ఉంచడానికి వీలు లేదని సుప్రీంకోర్టు అని ఉంది. సమసమాజాన్ని, లేక సంక్షేమ రాజ్యాన్ని నిర్మించడానికి రాజ్యాంగం ప్రభుత్వానికిచ్చిన అధికారాలకు ఇది మరింతగా వర్తిస్తుంది. అయితే ఈ నియమాన్ని అమలు చేయగల సూత్రమేదీ రాజ్యాంగంలో లేదు. బహుశా ఈ దిశగా కొంచెం ఆలోచించవచ్చునేమో.

యాభై ఏళ్ల కింద రాజ్యాంగంలో రాసుకున్నది సెంటిమెంటల్ చెత్త అనే అభిప్రాయం ఈ రోజు దేశంలోని పెత్తందారీ వర్గాలలో బలంగా ఉందనేది వాస్తవం. ఇప్పటికే

అవకాశాలున్న వారికి మరిన్ని అవకాశాలు ఇవ్వడం ద్వారా వారి సంపదను వారు పెంచుకొని దేశ ఆర్థిక పెరుగుదల రేటును మరింత వేగంగా పెంచే మార్గాన్ని ప్రోత్సహించాలని వారి అభిప్రాయం. ఆ అభివృద్ధి నుండి కిందికి జారిపడే నాలుగు చుక్కలు మిగిలిన వారికి దొరికితే దొరుకుతాయి అని వారి ఆలోచన. ఏ జాతీయ ఉద్యమం నుండయితే రాజ్యాంగం పుట్టిందో దాని విలువలకది విరుద్ధం. రాజ్యాంగంలోని సమానతా విలువలను ఈ రకమయిన పునర్వ్యాఖ్యానాల నుండి కాపాడుకోవడం ఈనాటి అవసరం. రాజ్యాంగ సమీక్షను ఈ కోణం నుండి అర్థం చేసుకోవాలి.

# ఎన్నికల సంస్కరణలు-
# రాజ్యాంగ సమీక్ష ఎందుకోసం?

14 ఫిబ్రవరి 2000; మానవహక్కుల వేదిక కరపత్రం

**మ**న దేశ రాజకీయ, ఆర్థిక వ్యవస్థలలో మార్పులు తీసుకొచ్చే ప్రయత్నం చాలా వేగంగా జరుగుతున్నది. ప్రతి మార్పూ చాలా అవసరమనీ, ఇన్నాళ్లూ అది లేకపోవడం వల్లనే మనం వెనుకబడి ఉండిపోయామనీ అంటున్నారు.

మనల్నీ నమ్మమంటున్నారు.

అయితే అంత గుడ్డిగా అన్ని మార్పులూ మన మంచికేనని నమ్మేవారెవరూ లేరు.

ఎన్నికల వ్యవస్థలో సంస్కరణలు, రాజ్యాంగ సమీక్ష ఇప్పుడు వార్తలలో నలుగుతున్నాయి. నిజానికి ఎన్నికల వ్యవస్థ ప్రజల అభీష్టానికి మరింత బాగా అద్దం పట్టేటట్టు సంస్కరించడం అవసరమనీ, రాజ్యాంగం పని హక్కుతో సహా అనేక ఇతర మౌలిక హక్కులను ప్రాథమిక హక్కులుగా కల్పించేటట్టు సవరించడం అవసరమనీ దేశంలోని ప్రజాతంత్రవాదులు చాలా కాలంగా కోరుకుంటున్నారు. అనేక ప్రతిపాదనలు చేశారు.

కానీ ఇప్పుడు అధికారికంగా వస్తున్న ప్రతిపాదనల లక్ష్యం అదేనా?

రాజ్యాంగ సమీక్ష కోసం 11 మంది పెద్దమనుషుల కమిటీ ఒకటి వేస్తున్నారు. వాళ్లు ఎంత పెద్దమనుషులయినా కావచ్చును గానీ 'రాజ్యాంగాన్ని సమీక్షించి పెట్టండి' అని ప్రజలు ఎన్నుకున్న వారు కారు. అంతే కాదు, వేరే ఏ అర్థంలోనూ ఇంత వైవిధ్యం ఉన్న ఈ దేశంలోని భిన్న ఆకాంక్షల ప్రతినిధులు కారు. యాభై ఏళ్ల అనుభవం తరువాత ఈ దేశంలోని 'పెద్దమనుషులు' అంతా ప్రజాస్వామ్యం, సమత, సంక్షేమాల పట్ల చెందుతున్న

విసుగుకు వారు ప్రతినిధులు కావచ్చు. ఆ విసుగు నుండే ఎక్కువ ప్రతిపాదనలు రాబోతాయి. అందుకే ప్రజాస్వామ్య పురోభివృద్ధి కోరుకునేవారు 'రాజ్యాంగ సమీక్ష' అవసరమన్న ప్రతిపాదన గురించి ఆందోళన చెందుతున్నారు. ఈ రాజ్యాంగంలో మార్చవలసిందేమీ లేదన్న భావన వల్ల కాదు. ఎన్నికల సంస్కరణలకు కొత్త కమిషన్‌ను వేయవలసిన అవసరం లేకుండా ప్రభుత్వం లా కమిషన్‌కే ఆ బాధ్యత అప్పగించింది. లా కమిషన్ దాదాపు అయిదేళ్ల పాటు శ్రమించి కొన్ని నిర్దిష్టమైన ప్రతిపాదనలను ఆమోదించింది. అందులో కొన్ని మంచి ప్రతిపాదనలున్నాయి గానీ లా కమిషన్ అనుసరించిన మౌలిక వైఖరిలోనే అభ్యంతరకరమైన విషయాలున్నాయి.

ఎన్నికల సంస్కరణలంటూ చేపడితే, అది ఎన్నికల ప్రక్రియను మరింత ప్రజాస్వామికం చేయడం కోసమే – దాని ప్రాతినిధ్య స్వభావాన్ని మరింత పెంచడం కోసమే – కావాలి. అంతే తప్ప ప్రభుత్వాల స్థిరత్వాన్ని పెంచడం కోసం, ఎన్నికల నిర్వహణ ఖర్చు తగ్గించడం కోసం, బహుళపార్టీ వ్యవస్థ స్థానంలో రెండు మూడు పార్టీల వ్యవస్థను సాధించడం కోసం, చిన్న చిన్న పార్టీలు లేకుండా చేయడం కోసం, ఎన్నికల రంగం మీద 'కులం', 'ప్రాంతం' మొదలయిన ప్రభావాలు లేకుండా చేయడం కోసం ఎన్నికల సంస్కరణలు చేపడితే ఎన్నికల వ్యవస్థ ప్రజాస్వామ్య స్వభావం పెరిగే బదులు తగ్గే ప్రమాదం ఉంది.

లా కమిషన్ ప్రతిపాదించిన సంస్కరణలలో ఎన్నికల వ్యవస్థను ప్రజలకు మరింత దగ్గరకు తీసుకొచ్చే ప్రతిపాదన ఏదీ లేదనే చెప్పాలి. కానీ ఎన్నికల రాజకీయాలలో అవినీతినీ, అవకాశవాదాన్నీ తగ్గించే ప్రతిపాదనలు కొన్ని ఉన్నాయి. బహుశా అన్నిటి కంటే ముఖ్యమైనది పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని చట్టరీత్యా తప్పనిసరి చేయడం. ఇది కమ్యూనిస్టు పార్టీలతో సహా అన్ని పార్టీలనూ ఇబ్బందిపెట్టే విషయమే కాబట్టి ఈ సవరణను పార్లమెంటు చేపడుతుందో లేదో గానీ చేపడితే మంచిదే. ఎన్నికల వ్యయాన్ని తగ్గించడానికి చేసిన ప్రతిపాదనలు కూడ ఉన్నాయి. నల్లధనం విపరీతంగా ఉన్న మన సమాజంలో ఈ సవరణలు ఎంత మేరకు అమలవుతాయని అనుమానించేందుకు ఆస్కారం ఉంది. అయినప్పటికీ ఎంత జరిగితే అంతవరకు మేలే ననుకుంటే అవి ఉపయోగకరమైన ప్రతిపాదనలే.

కానీ లా కమిషన్ ప్రతిపాదనల లక్ష్యాలలో పైన పేర్కొన్న రెండవ కోవకు చెందిన వైఖరి చాలా బలంగా ఉంది. రెండు మూడు పార్టీలే ఉంటే పరిపాలనలో స్థిరత్వం

ఉంటుంది కాబట్టి చిన్న చిన్న పార్టీలకు మనుగడ లేకుండా చేయాలంట. దీనికి జర్మనీనీ ఇంగ్లండ్‌నూ అమెరికానూ ఉదాహరణగా చూపిస్తుంది లా కమిషన్. కానీ ప్రపంచంలో వేరే ఏ దేశంలోనూ లేనంత వైవిధ్యం ఉన్న మన దేశంలో రెండు పార్టీల వ్యవస్థ కంటే బహుళ పార్టీ వ్యవస్థే సహజం కావచ్చు. అది అసహజం అని ముందుగానే ఒక నిర్ణయానికొచ్చి దానిని నిర్బంధంగా అమలు చేస్తే ఉన్న కాస్త ప్రజాస్వామ్యం కూడ పోవచ్చు.

చిన్నపార్టీలు లేకుండా చేయడానికి లా కమిషన్ చేస్తున్న ప్రతిపాదన చాలా అభ్యంతరకరమైనది. ఏదైనా ఒక పార్టీకి ఒకటి రెండు నియోజకవర్గాలలో బలముందనుకోండి. అక్కడ అభ్యర్థులను నిలబెట్టి ఒకరిద్దరు ఎం.ఎల్.ఏలను గెలిపించుకుందామంటే కుదరదంట. ఆ పార్టీ ఎంపిక చేసుకున్న నియోజకవర్గాలలో మాత్రమే పోటీ చేసినా, దాని అభ్యర్థులకు వచ్చే వోట్లు రాష్ట్రం మొత్తం మీద పోల్ అయిన వోట్లలో కనీసం 5 శాతం ఉండాలంట. లేకపోతే ఆ పార్టీ గెలుచుకున్న ఒకటి రెండు సీట్లు  కూడ రద్దు చేసేయాలంట.

ఒక చిన్న ప్రాంతానికి, లేకపోతే ఒక అల్ప సంఖ్యాక ప్రజావర్గానికి పరిమితమయి పని చేసే పార్టీలను లేకుండా చేయడం దీని లక్ష్యం అనే విషయం స్పష్టమే. ఎన్నికలలో పోటీ చేసే పార్టీ అభ్యర్థులందరికీ వచ్చే వోట్లు కలుపుకుంటే రాష్ట్రం మొత్తం మీద పోల్ అయిన వోట్లలో అయిదు శాతం మించి ఉంటేనే ఆ పార్టీ గెలుచుకున్న సీట్లు దక్కుతాయి లేకపోతే ఆ నియోజకవర్గాలలో రెండవ స్థానంలో ఉన్న అభ్యర్థికి ఎం.ఎల్.ఏ పట్టం కట్టబెడతారనేది చాలా అన్యాయమైన వైఖరే కాక అవాస్తవికమైన వైఖరి కూడ. మన రాష్ట్రంలో ఆదివాసులు 6 శాతం ఉన్నారు. ఆదివాసులలో మాత్రమే పని చేసే, ఇతర ప్రాంతాలలో వోట్లు సంపాదించలేని ఒక ఆదివాసీ పార్టీ ఉందనుకోండి. ఆ పార్టీ ఒక వేళ ఏజెన్సీలోని అన్ని నియోజకవర్గాలలో గెలిచినా, బయట ఎక్కడా దానికి ఓట్లు రావు కాబట్టి దానికొచ్చే మొత్తం ఓట్లు '5 శాతం'  నియమానికి తక్కువే ఉండవచ్చు. అప్పుడు గెలిచిన ఆ ఆదివాసీ పార్టీ అభ్యర్థులందరూ ఓడినట్లే. రెండవ స్థానంలో నిలిచిన 'జాతీయపార్టీ' అభ్యర్థిదే గెలుపు అవుతుంది.

అప్పుడు ఒక ప్రత్యేకమైన ప్రజావర్గం సమస్యల గురించి ప్రత్యేకంగా ఆలోచించి అందుకోసమే పని చేసే వాళ్లు ఆ ప్రజలు మెచ్చినా వారి ప్రతినిధులు కాలేరు. బలవంతంగా

ఏదైనా ప్రధానస్రవంతి పార్టీలో గానీ ఐక్య సంఘటనలో గానీ భాగం కావలసిందే. ఇంత బలవంతంగా 'రెండు పార్టీల' (లేక 'రెండు కూటముల') వ్యవస్థను తయారు చేయాలని పూనుకోవడం ప్రజాస్వామ్యాన్ని పెంపొందించే సూచనా లేక దిగజార్చే సూచనా? దీని వల్ల చిన్న సంఖ్యలో ఉన్న ఆదివాసీ, దళిత, మైనారిటీ ప్రజలకు నష్టం కాదా? ఏదైనా 'ప్రధాన స్రవంతి' పార్టీ లేక కూటమితో రాజీపడకపోతే వారికి రాజకీయ మనుగడ ఉండదని చట్టం చేయడం ఏ రకమైన ప్రజాస్వామ్యం?

దీనికి తోడుపోయే మరొక సూచన, స్వతంత్ర అభ్యర్థులు పోటీ చేయడానికి వీలు లేదనేది. స్వతంత్ర అభ్యర్థులు 'నాన్–సీరియస్'గానే పోటీ చేస్తారంట. చాలా అరుదుగా తప్ప డిపాజిట్ కూడ దక్కించుకోరంట. కాబట్టి కేవలం రాజకీయపార్టీల అభ్యర్థులు మాత్రమే పోటీ చేసేటట్టు చట్టాన్ని సవరిస్తారంట. నిజానికి ఏ పార్టీకి చెందని ప్రజా ఉద్యమకారులు ఎన్నికలలో పాల్గొని – గెలిచినా గెలవకున్నా – సమస్యలను సమర్థంగా ప్రజలలో చర్చకు పెట్టడంలో సఫలమయిన ఉదంతాలెన్నో ఉన్నాయి. అది ప్రజాస్వామ్యానికి మేలు చేసిందే తప్ప నష్టం చేయలేదు. ఈ అవకాశం లేకుండా ఎందుకు చేయాలి?

ప్రజాస్వామ్యమంటే లా కమిషన్ సభ్యుల వంటి పెద్దమనుషులకు ఎంత విసుగుగా ఉందో ఈ ప్రతిపాదనలు సూచిస్తాయి. ఎవరు పడితే వాళ్లు పార్టీలు పెడతారు, ప్రతీ వెధవా పోటీ చేసి పెద్ద పెద్ద పార్టీలను వెక్కిరిస్తాడు అనే విసుగు, ఇంతింత పొడవు బ్యాలట్ పేపర్లు అచ్చు వేయాలి అనే విసుగు ఇందులో ధ్వనిస్తాయి.

రాజ్యాంగ సమీక్ష చివరికి ఏ రూపం తీసుకుంటుందో గానీ ఆ ప్రతిపాదన వెనక ఉన్న ఆరాటం కూడ ఈ కోవకు చెందినదే. రాజ్యాంగాన్ని సమీక్షించి ఇంకిన్ని ఎక్కువ హక్కులు కల్పిస్తామంటే ఎవరూ కాదనరు. రాజ్యాంగంలోని సంక్షేమ రాజ్యభావనకు పటిష్టమైన రూపం ఇచ్చి గ్లోబలైజేషన్ పేరు మీద తీసుకొస్తున్న మార్పులకు అడ్డుకట్ట వేద్దామన్న ప్రతిపాదన ఎవరైనా పెడితే కూడ ఎవరూ కాదనరు. కాని ఇప్పుడు వస్తున్న ప్రతిపాదన ఇందుకు పూర్తిగా విరుద్ధమైన కోణం నుండి వస్తున్నదన్న సహేతుకమైన సందేహం ఉండబట్టే చాలామంది అభ్యంతరం చెప్తున్నారు.

రాజ్యాంగ సమీక్ష జరగాలని పట్టుబడుతున్న హిందుత్వవాదులకు ఈ రాజ్యాంగంలోని ప్రజాతంత్ర అంశాల పట్ల, సంక్షేమ అంశాల పట్ల అభిమానం ఏ రోజూ లేదు. వాటికి దారి తీసిన స్వాతంత్రపూర్వకాలపు ప్రజా ఉద్యమాలలో గానీ సంస్కరణలలో గానీ

వాళ్లు ఎన్నడూ పాల్గొనకపోగా, చాలా సందర్భాలలో వ్యతిరేకించారు కూడ. ఇవ్వాళ వాళ్లు రాజ్యాంగాన్ని సమీక్షించాలి అని పట్టుబడితే మనకు ఆందోళన కలగడం సహజం. అయినప్పటికీ చర్చను వ్యతిరేకించడం కంటే పెరుగుతున్న గ్లోబలైజేషన్ ప్రభావాన్నీ, హిందుత్వవాద ఉన్మాదం ప్రభావాన్నీ ఎదుర్కోవడంలో ఒక సాధనంగా ఉపయోగపడేటట్టు రాజ్యాంగంలోని ప్రజాతంత్ర విలువలను పటిష్టపరచే లక్ష్యంతో చర్చలో పాల్గొనడమే మేలు.

# రాజ్యాంగాన్ని ఎందుకు సమీక్షించాలి?

3 ఫిబ్రవరి 2000, ఆంధ్రప్రభ

'**భా**వాలు చాలా వేగంగా మారిపోతున్నాయి' అనేది మామూలుగా మంచిని సూచించే మాట. సంస్కరణను కోరుకోవడం మామూలుగా అభ్యుదయ భావాలు గల వాళ్ల లక్షణం. కానీ ఇప్పుడది మారిపోయింది. స్వేచ్ఛావిపణికి ఆటంకంగా ఉన్న అవరోధాలన్నిటినీ తొలగించి పెట్టుబడికి పూర్తి స్వాతంత్ర్యాన్ని ఇచ్చే ప్రక్రియకు ఇప్పుడు 'సంస్కరణలు' అని పేరు. స్వేచ్ఛావిపణినీ, దాని సకల అవాంఛనీయ పరిణామాలనూ ఆహ్వానించే వాళ్లు ఇప్పుడు 'సంస్కర్తలు', 'సంస్కరణవాదులు'. అది అవాంఛనీయమనే వాళ్లు యథాస్థితివాదులు.

రాజ్యాంగ సమీక్ష విషయం కూడ అంతే. ప్రగతిశీల భావాలు గల వాళ్లు యథాస్థితివాదులుగాను, హిందుత్వవాదులు మార్పును ఆహ్వానించే సంస్కర్తలుగాను కనిపిస్తున్నారు. కానీ నిజానికి రాజ్యాంగాన్ని సవరించి పనిహక్కును ప్రాథమిక హక్కుల జాబితాలో చేరుద్దామంటే కె.ఆర్.నారాయణన్‌తో సహా ఈ రోజు 'రాజ్యాంగ సమీక్ష అనవసరం' అంటున్న వాళ్లెవరూ కాదనరు. 'ఆ చేర్పు రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మారుస్తుంది కాబట్టి సుప్రీంకోర్టు ఒప్పుకోదేమో' అంటే సుప్రీంకోర్టు తన అభిప్రాయాన్ని మార్చుకోవాలనే అంటారు.

మరి సమస్య ఎక్కడ వచ్చింది? రాజ్యాంగాన్ని సమీక్షించాలని హిందుత్వవాదులు ఎందుకు ఉవ్విళ్లూరుతున్నారు? అభ్యుదయాన్ని కాంక్షించేవాళ్లు ఎందుకు భయపడుతున్నారు?

హిందుత్వవాదులు రాజ్యాంగాన్ని సమీక్షిద్దామంటున్నది పనిహక్కును ప్రాథమిక హక్కుల జాబితాలో చేర్చడానికి కాదు. దేశ పరిపాలన ఆదేశిక సూత్రాల వెలుగులో జరగాలన్న నియమాన్ని చట్టరీత్యా ప్రభుత్వానికి శిరోధార్యం చేయడం కోసం కాదు.

సాంఘిక న్యాయానికి ఒక సాధనంగా ఉన్న రిజర్వేషన్లు ప్రజల హక్కా లేక ప్రభుత్వం దయా అన్న (అస్పష్టంగా ఉండిపోయిన) విషయానికి స్పష్టతనిచ్చి అవి ప్రజల హక్కేనని రాజ్యాంగంలో రాయడం కోసం కాదు. నిజానికి రాజ్యాంగంలో ఇటువంటి మార్పులు రావాలని ప్రజాతంత్ర ఉద్యమాలు చాలాకాలంగా కోరుకుంటున్నాయి. కానీ ఇప్పుడు రాజ్యాంగ సమీక్ష గురించి బి.జె.పి. ప్రభుత్వం పెడుతున్న ప్రతిపాదనలను ప్రజాతంత్ర భావాలు గల వాళ్లు ఎక్కువ భాగం వ్యతిరేకిస్తున్నారు. 'దాని పాటికి దానిని ఉండనివ్వండి' అంటున్నారు.

ఎందుకంటే, హిందుత్వవాదులు మొదటి నుండి కోరుకుంటున్న సవరణలు వేరే ఉన్నాయి. అవేవీ ప్రజల హక్కులకు సంబధించినవి కావు. రాజ్యాంగం నుండి మైనారిటీ అనే భావనను తొలగించాలి, ఆర్టికల్ 25లోని మతప్రచార స్వేచ్ఛను తొలగించాలి, జమ్మూ-కాశ్మీర్ రాష్ట్రానికి ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 ని తొలగించాలి- ఇవీ బి.జె.పి.కి జనసంఘ్‌గా ఉన్న రోజుల నుండి ఉన్న కోరికలు. ఈ మధ్య కాలంలో వచ్చి చేరినది పార్లమెంటరీ ప్రజాస్వామ్యం స్థానంలో అధ్యక్షతరహా పాలనను ప్రవేశపెట్టాలన్న కోరిక. సంక్షేమరాజ్య భావనను రాజ్యాంగం నుండి పూర్తిగా తొలగించి, పెట్టుబడిదారీ వ్యవస్థకు పూర్తి స్వేచ్ఛ నివ్వాలన్న అభిప్రాయం కూడ జనసంఘ్‌గా ఉన్న రోజుల నుండి బి.జె.పి.కి ఉంది. ఈ విషయంలో ఈ రోజు కాంగ్రెస్, తెలుగుదేశం, జనతాదళ్ మొదలయిన పార్టీలకు కూడ వేరే అభిప్రాయమేం లేదు. నిజానికి ఇది ఈ రోజు అన్ని ప్రధాన పార్లమెంటరీ పార్టీలకు ఏకాభిప్రాయం ఉన్న విషయం. అయితే దీనికి రాజ్యాంగ సవరణ ఆవశ్యకత ఏమంత లేకపోవచ్చు. మన రాజ్యాంగంలోని సంక్షేమ రాజ్య లక్షణాలు (కొద్ది మినహాయింపులతో) ఆదేశిక సూత్రాల జాబితాలో ఉన్నాయి. ఆదేశిక సూత్రాలను ఉల్లంఘించే ప్రభుత్వ చర్యలను, విధానాలను రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించవచ్చునా లేదా అన్న విషయంలో భారత సుప్రీంకోర్టు ఒక కచ్చితమైన వైఖరి అవలంబించలేదు. ఒక్కొక్కసారి అవునని, ఒక్కొక్కసారి కాదని అంటూ వచ్చింది. ఇప్పుడొక దశాబ్దకాలంగా అమలవుతున్న ఆర్థిక పునర్వ్యవస్థీకరణను సుప్రీంకోర్టు ఆదేశిక సూత్రాల పేరు మీద అడ్డుకోదలచుకోలేదని ఇప్పటికే కొన్ని కేసులలో స్పష్టమయింది. కాబట్టి సంక్షేమ రాజ్యం ఛాయలు సహితం లేకుండా చేయడానికి రాజ్యాంగ సవరణ అవసరం కాకపోవచ్చు. అయినప్పటికీ ఎందుకయినా మంచిదని ఆ కోణం నుండి కూడ సవరణలు చేపట్టే ఉద్దేశం బి.జె.పి.కి ఉండవచ్చు.

'సమీక్షించినంత మాత్రాన నష్టమేముంది? ఇప్పుడే తమ బుద్ధికి తోచినట్టు తిరగరాసేంత బలం బి.జె.పి.కి లేదు కదా?' అనవచ్చు. కానీ హిందుత్వవాదుల అజెండాను సరిగ్గా అర్థం చేసుకోవడం అవసరం. వాళ్లు ఒకటి రెండేళ్లలో ఏదో చేసేయాలనుకోవడం లేదు. తమ ఆలోచనారీతిని నెమ్మదిగానయినా సరే సామాజిక ఆలోచనలో పెంపొందించ గలిగినంత కాలం వారికి సంతృప్తిగానే ఉంటుంది. 'ఊరికే సమీక్షిస్తున్నాం. మాట్లాడుకుందామంటున్నాం. తప్పా?' అని అమాయకంగా అడుగుతూ తమ ఆలోచనారీతిని సమాజానికి క్రమంగా అలవాటు చేస్తారు. క్రైస్తవులపైన ఒక పక్క ప్రాణాంతకంగా దాడులు చేస్తూ, 'మతమార్పిడుల గురించి చర్చ అవసరం' అని ప్రధానమంత్రి చేతనే అనిపించలేదా? ఆ తరువాత దేశంలో అందరూ ఆ చర్చలో భాగం కాలేదా? ఒక పక్క భజరంగ్‌దళ్ వంటి సంస్థలు బైబిల్ ప్రతులను తగలబెడుతూ చర్చిలపైన దాడులు చేస్తూ క్రైస్తవులను హింసకు గురి చేస్తుండగా, మరొక పక్క వారితో విభేదించే వారు సహితం ఎవరో తమను శాసిస్తున్నట్టు మతమార్పిడుల వల్ల జరిగే కష్టనష్టాల గురించి వ్యాసాలు రాయలేదా? క్రైస్తవులు మతమార్పిడులు చేయడం మానుకుంటేనే మంచిదని హితోపదేశం చేయలేదా?

రాజ్యాంగ సమీక్ష పేరిట ఒక కమిటీని వేసి తమ మనసుకు నచ్చిన మార్పులను సమాజంలో చర్చకు పెట్టి వాటిని ప్రజలకు అలవాటు చేయడం వారి సమీప లక్ష్యం. ప్రస్తుతానికది చాలు. 'మైనారిటీ' అనే భావన రాజ్యాంగంలో ఉండాలా అంటూ చర్చకు పెట్టడం మైనారిటీల పట్ల వ్యతిరేకతను పెంచడానికి ఉపయోగపడుతుంది. అధ్యక్షతరహా పాలన గురించి చర్చ పెడుతుంటే, పార్లమెంటరీ వ్యవస్థ సంక్షోభంలో పడినప్పుడల్లా 'ఛీ! దీనికంటే ఒక్కసారి ఎన్నుకుని అయిదేళ్లు పరిపాలించే అధ్యక్షుడి పాలన మేలు కదా' అనిపిస్తుంది. సమత, సంక్షేమం అనేవి జాతిని చీల్చి బలహీనపరుస్తున్నాయంటూ చర్చ పెడుతుంటే బలహీనవర్గాల హక్కుల పట్ల సమాజంలో వ్యతిరేకత నెమ్మదిగా పెంచవచ్చు. ఈ మార్పుల వల్ల హిందుత్వవాదుల సామాజిక, రాజకీయ అజెండాకు తక్షణ లాభం చేకూరుతుంది. వారు రాజ్యాంగంలో ఎప్పటికైనా తేదలచుకున్న మార్పులు సమాజానికి అలవాటవుతాయి. తద్వారా మరింత సులభతరమవుతాయి. దీర్ఘకాల దృష్టి ఉన్న హిందుత్వవాదులకిది చాలు.

అయినప్పటికీ ప్రజాస్వామ్యం బలపడాలే తప్ప బలహీనపడకూడదని కోరుకునే వాళ్లు బి.జె.పి. ప్రతిపాదించే సమీక్షను వ్యతిరేకించి యథాస్థితివాదులుగాను, మార్పుకు

భయపడేవారుగాను, రాజ్యాంగాన్ని మార్పుకు అతీతమైన పవిత్ర గ్రంథంగా పరిగణించేవారిగాను కనిపించడం అనవసరం. రాజ్యాంగంలో ఉన్న ప్రజాస్వామ్య విలువలు గాలి సోకితే ఆరిపోయే దీపమయితే వాటిని కాపాడడం ఎవరి తరం కాదు. ఆ ప్రజాస్వామ్య విలువలను బలహీనసరిచే దురుద్దేశంతో చర్చ పెడుతున్నప్పుడు, వాటిని మరింత పెంపొందించే వైఖరితో ఆ చర్చలో పాల్గొనడమే ఉత్తమం. ఉదాహరణకు అధ్యక్షతరహా పాలన ప్రభుత్వానికి ప్రజల పట్ల ఉండే జవాబుదారీతనాన్ని మరింత బలహీనపరిచే ప్రతిపాదన. ఇప్పుడు కావలసింది జవాబుదారీతనాన్ని పెంచే ప్రతిపాదనలు, తగ్గించేవి కావు. కాబట్టి రాజ్యాంగాన్ని ఈ విషయంలో సవరించదలచుకుంటే పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని మరింతగా ప్రజలకు దగ్గరకు తీసుకొచ్చే అధికార వికేంద్రీకరణ, సహేతుకమైన 'రీకాల్ హక్కు' లాంటివి ప్రవేశపెట్టాలి తప్ప అధ్యక్షతరహా పాలన కాదని వాదించవచ్చు. అధ్యక్షతరహా పాలన అనేది సుస్థిరత పేరిట పరిపాలనకు ఉండవలసిన ప్రజాస్వామ్య లక్షణాలను బలహీనపరిచే ప్రతిపాదన అని విమర్శించవచ్చు.

అయితే ఎంత వాదించినా, ఎంత నిశితంగా చర్చపెట్టినా ఇప్పుడు రాజ్యాంగాన్ని తిరగరాయడం అంటూ జరిగితే దాని కోసం ఒక కొత్త రాజ్యాంగ పరిషత్‌ను ఎన్నుకున్నా, ఇప్పుడున్న దాని కంటే అప్రజాస్వామికమైన రాజ్యాంగమే తయారవుతుందన్న భయం చాలామందిలో ఉంది. దీనికొక తప్పుడు కారణముంది, ఒక సహేతుకమైన కారణమూ ఉంది. తప్పుడు కారణమేమిటంటే అప్పట్లో రాజ్యాంగ పరిషత్‌లో ఉన్నవారిలో చాలామంది ఇంగ్లండ్‌లో ఉన్నత విద్య చదువుకున్నవారు, సామాజికంగా 'బాధ్యత గల' వర్గాలకు చెందినవారు, పెద్ద పుట్టుక పుట్టి, పెద్ద ఆలోచనలు చేయగల పెద్దమనుషులు. ఇప్పుడు నానారకాల అలగాజనం రాజకీయాలలోకొచ్చి ఎన్నికలు గెలిచేస్తున్నారు. వీళ్లు పెద్ద పుట్టుక పుట్టలేదు. పెద్దపెద్ద చదువులు చదవలేదు. పెద్దమనుషులు ఎంత మాత్రం కారు. వీళ్లు తిరగరాసే రాజ్యాంగం ఏ విధంగా ఉంటుంది? అని భయపడుతున్న వారున్నారు. ఈ అభ్యంతరాన్ని గుర్తించడం అవసరం. వ్యతిరేకించడం అవసరం. నిజానికి ఆనాటికీ ఈనాటికీ ఇదే ప్రధానమైన తేడా. అయితే దీని వల్ల మేలే జరగగలదు. ఇప్పటి సగటు ప్రజాప్రతినిధులకు అప్పటి కంటే ప్రజాజీవితంతో సంబంధాలు ఎక్కువ, పరిచయం ఎక్కువ, అవగాహన ఎక్కువ.

కానీ రాజ్యాంగాన్ని తిరగరాయడం అంటూ జరిగితే దాని స్వరూపాన్ని నిర్ణయించేది పై ఒక్క తేడాయే కాదు. మొత్తంగా ఆనాటి రాజకీయ వాతావరణానికీ ఈనాటి రాజకీయ

వాతావరణానికీ ఉన్న తేడాను లెక్కలోకి తీసుకుంటే తప్ప రాజ్యాంగ సమీక్ష ఎటువైపు తీసుకుపోగలదో ఊహించలేము. ఆనాటి రాజకీయ వాతావరణంపైన జాతీయ ఉద్యమ ప్రభావం, జాతీయ ఉద్యమంలో భాగంగా సాగిన సాంఘిక, ఆర్థిక పోరాటాలు, సంస్కరణల ప్రభావం బలంగా ఉండింది. కేవలం తెల్లవాడిని తరిమేయడమే మన లక్ష్యం కాదు. ఒక కొత్త సమాజాన్ని నిర్మించాలన్న ఆకాంక్ష సమాజంలో ఉండింది. ఆ ప్రభావం రాజ్యాంగ పరిషత్ మీద బలంగా ఉండింది కాబట్టే రాజ్యాంగంలో ప్రజాస్వామ్య విలువలు, హక్కులు, సాంఘిక న్యాయం, సమత మొదలయినవి కనిపిస్తాయి.

ఈనాటి పరిస్థితి? మన సమాజం నిజానికి అప్పటితో పోలిస్తే చాలా విషయాలలో ప్రజాస్వామికం చెందింది. సామాజిక సంబంధాలలో ఉన్న అసమానత, అణచివేతల పట్ల వ్యతిరేకత, ప్రతిఘటన చాలా పెరిగింది. దీని ప్రభావం శాసనసభల పైన, ఎన్నికల రాజకీయాలపైన బలంగానే ఉన్నప్పటికీ ఈ మార్పుల కంటే, ఈ మార్పుల పట్ల పెత్తందారీ వర్గాలలో నెలకొన్న నిరసన ప్రభావమే ఈ రోజు ఆ రంగాలపైన ఎక్కువ ఉంది. సామాజిక ప్రజాస్వామీకరణ కంటే దాని వల్ల పెత్తనం కోల్పోయిన వర్గాల నిరసనే మన దేశ ప్రధాన రాజకీయ స్రవంతిని శాసిస్తున్నదనడంలో అతిశయోక్తి లేదు. దానికి అవినీతి, ఆస్తిదాహం తోడయ్యాయి. 'గ్లోబలైజేషన్' ఒత్తిడి కూడ తోడయింది. ఈ వాతావరణంలో ఒక కొత్త రాజ్యాంగ పరిషత్ ఏర్పడినా లేక ఈ చట్టసభలే రాజ్యాంగాన్ని తిరగరాసినా అది ఇప్పుడున్న దాని కంటే అప్రజాస్వామికంగా ఉంటుందనడంలో సందేహం లేదు.

అయితే దీనికి జవాబు 'రాజ్యాంగాన్ని ముట్టుకోవద్దు' అనే హెచ్చరిక కాదు. రాజ్యాంగంలో సమతా, సాంఘిక న్యాయాల అంశాన్ని పెంచే మార్గాన్ని అన్వేషించాలన్న డిమాండ్‌తో నిర్దిష్టమైన ప్రతిపాదనలు పెట్టినప్పుడే హిందుత్వవాదుల ప్రతిపాదనలు రాజ్యాంగ సవరణను ఎటువైపు తీసుకు పోతున్నాయో ప్రజలకు అర్థం అవుతుంది. సంవాదం మొత్తం మార్పును కోరుకునే వారికీ, యథాస్థితివాదులకూ మధ్య చర్చగా కాకుండా రాజ్యాంగాన్ని వెనక్కి తీసుకుపోజూస్తున్న వారికీ, ముందుకు తీసుకుపోవాలని కోరుకుంటున్న వారికీ మధ్య చర్చగా సాగాలి. హిందుత్వవాదుల ప్రయత్నాన్ని ఎదుర్కోవడానికి అదే సరయిన మార్గం.

# రాజ్యాంగ సమీక్ష అవసరమే కాని...ఎవరికోసం? ఎందుకోసం?

12 మార్చి 2000; మానవహక్కుల వేదిక కరపత్రం

**రా**జ్యాంగాన్ని సమీక్షిద్దామని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ప్రతిపాదించడం దేశంలో పెద్ద దుమారం లేవదీసింది.

రాజ్యాంగాన్ని తమదిగా భావించేవారు ఇద్దరు కనిపిస్తున్నారు మన దేశంలో. ఒకరు నెహ్రూ సంప్రదాయానికి చెందిన కాంగ్రెస్‌వాదులు, మేధావులు. వీరిలో ఒకరైన రాష్ట్రపతి కె.ఆర్. నారాయణన్ ఒక సూటి ప్రశ్నవేశారు.

సమీక్షించవలసింది రాజ్యాంగాన్నా? లేక రాజ్యాంగం అమలునా? అన్నది ఆయన ప్రశ్న.

రెండవ వర్గం అంబేద్కర్ అనుయాయులైన దళితవాదులు. వీరు ఇంకొక సూటి ప్రశ్న వేశారు.

రాజ్యాంగాన్ని సమీక్షించాలనడంలో బిజెపి ఉద్దేశ్యం ఏమిటి? మనుధర్మానికి అనుకూలమైన రాజ్యాంగాన్ని రాసుకోవడమా? అన్నది వారి ప్రశ్న.

రాష్ట్రపతి ప్రశ్నను రెండు రకాలుగా అర్థం చేసుకోవచ్చు. రాజ్యాంగం చాలా బాగుంది గానీ దాని అమలులోనే లోపాలున్నాయని అర్థం చేసుకోవచ్చు. లేదా రాజ్యాంగం అంటే కేవలం ఒక పుస్తకం కాదనీ, రాజ్యాంగ సూత్రాలు దేశపాలనలో తీసుకున్న నిర్దిష్ట రూపమే 'రాజ్యాంగమ'నీ అర్థం చేసుకోవచ్చు. అప్పుడు చర్చించవలసింది రాజ్యాంగంలోని ఈ అధికరణాన్నో ఆ అధికరణాన్నో కాదు; దేశపాలనా వ్యవస్థ, శాసన వ్యవస్థ, న్యాయవ్యవస్థ, దేశ రాజకీయాలు కలిసి ప్రజలకందించిన 'రాజ్యాంగాన్ని'.

ఈ రకంగా చూసినప్పుడు కేంద్ర ప్రభుత్వం నియమించిన 11 మంది పెద్దమనుషుల కమిటీ దేనిని సమీక్షిస్తుందన్న ప్రశ్న వస్తుంది. ఈ 11 మందీ పాలనా వ్యవస్థ, శాసన వ్యవస్థ, న్యాయవ్యవస్థ, రాజకీయాలు – వీటిలో దేనిలో ఒకదానిలో ప్రముఖపాత్ర నిర్వహించిన వారే. ఇప్పుడు సమీక్షించబోతున్న 'రాజ్యాంగాన్ని' రూపొందించిన యాభై ఏళ్ల చరిత్రలో భాగస్వాములే. ఇప్పుడు వాళ్లు జరపవలసింది రాజ్యాంగ సమీక్షా లేక ఆత్మ సమీక్షా?

వెంకటాచలయ్య, జీవన్‌రెడ్డి, సర్కారియా, పున్నయ్య గార్లు న్యాయమూర్తులుగా పనిచేశారు. న్యాయవ్యవస్థ ప్రజలకు అందించిన రాజ్యాంగం రూపకల్పనలో వారు భాగస్వాములు. అణగారిన ప్రజల మేలు కోసం (రాజ్యాంగం కల్పించిన అవకాశాన్ని వాడుకొని) ప్రభుత్వం చట్టాలు చేస్తే, వాటిని బలవంతులు సవాలు చేస్తూ కోర్టుకెక్కడం, కోర్టులు చివరికి వాటిని కొట్టేసినా కొట్టేయకున్నా ఏళ్లతరబడి 'స్టే' ఇవ్వడం మన న్యాయవ్యవస్థ వ్యవహార శైలికి సంబంధించిన ఒక వికారమైన వాస్తవం. అటువంటి కేసులకు ప్రత్యేకమైన ప్రాధాన్యం ఇచ్చి, త్వరగా విని నిర్ణయం చేయాలన్న నియమాన్ని సహితం మన న్యాయవ్యవస్థ ఈ యాభై ఏళ్లలో రూపొందించుకోలేకపోయింది. అందులో భాగమైన ఈ నలుగురూ ఇవ్వాళ రాజ్యాంగాన్ని సమీక్షిస్తారా? లేక తమను తాము సమీక్షించుకుంటారా? రాజ్యాంగ సమీక్షా కమిటీలోని తక్కిన ఎనిమిది మంది కూడ పాలనా వ్యవస్థలోనో శాసనవ్యవస్థలోనో ప్రముఖస్థానం నిర్వహించినవారే. కాబట్టి వాళ్ల గురించి కూడ ఇటువంటి ప్రశ్నలే వేయవచ్చు. రాజ్యాంగం ప్రజలకు హామీ ఇచ్చిన హక్కుల పట్ల మన దేశ పాలనా వ్యవస్థ ఏ రోజైనా ఏ మాత్రం గౌరవం ప్రదర్శించింది? రాజ్యాంగ ఆదేశిక సూత్రాల వెలుగులో విధాన నిర్ణయాలు చేయడానికి శాసనసభలు ఏ రోజైనా ఏ మాత్రం ప్రయత్నం చేశాయి? ఈ వ్యవస్థలలో ప్రముఖపాత్ర నిర్వహించిన పెద్దమనుషులు ఇప్పుడు రాజ్యాంగాన్ని సమీక్షిస్తారా, లేక తమను తాము సమీక్షించుకుంటారా?

కె.ఆర్.నారాయణన్ అడిగిన ప్రశ్నను ఈ రకంగా వ్యాఖ్యానించుకోవచ్చు.

దళితవాదుల ప్రశ్న కూడ లోతయినదే. మన హిందుత్వవాద పాలకులు రాజ్యాంగ సమీక్ష కోసం 11 మంది పెద్దమనుషుల కమిటీ వేసి ఊరుకోలేదు. వారి అనుచరగణాలు వీధులలో 'రాజ్యాంగ సమీక్ష' జరుపుతున్నారు. ఉదాహరణకు భావప్రకటనా స్వేచ్ఛకు ఇప్పుడు రాజ్యాంగంలో ఉన్న పరిమితులు సరిపోతాయా లేదా అన్న 'చర్చ'ను కర్రలతో,

రాళ్లతో కాశీనగర వీధులలో ఈ మధ్య జరిపారు. రాజ్యాంగంలో ఉన్న పరిమితులన్నీ సహేతుకమైనవని అనలేము గానీ, కాశీ బ్రాహ్మణులకు మనస్తాపం కలిగించడానికి వీలు లేదన్న పరిమితి ఇప్పటిదాకా రాజ్యాంగంలో లేదు. దానిని కొత్తగా ఈమధ్యనే కల్పించారు. రేపు దానిని రాజ్యాంగంలో – ఇంత పచ్చిగా కాకున్నా – రాయరన్న నమ్మకమేముంది? ఈ అనుమానం సహేతుకమైనదే.

దీనిని మరికొంచెం వెనక్కి తీసుకుపోయి తర్కించవచ్చు. మన రాజ్యాంగంలోని అప్రజాస్వామిక లక్షణాలు బ్రిటిష్ వలస పాలనా వ్యవస్థ నుండి రాగా, ప్రజాస్వామిక లక్షణాలు జాతీయ ఉద్యమం నుండి, దానితోబాటు (ఒక్కొక్కసారి దానిలో భాగంగా, ఒక్కొక్కసారి స్వతంత్రంగా) సాగిన సాంఘిక ఆర్థిక సంస్కరణోద్యమాల నుండి, ప్రజాపోరాటాల నుండి వచ్చాయి. వీటిలో ఏ ఒక్క దానితోనూ సంఘ్‌పరివార్‌కు ఎటువంటి సంబంధం లేదు. వారు జాతీయోద్యమ రాజకీయ పోరాటంలోనూ భాగం కాదు, సాంఘిక ఆర్థిక సంస్కరణలలోనూ పోరాటాలలోనూ భాగం కాదు. కాకపోగా వాటికి వ్యతిరేకులు. నిజానికి గాంధీ హత్యను మినహాయిస్తే వారికి జాతీయోద్యమంలో ఏ పాత్రా లేదు!

వారు రాజ్యాంగంలో ఉన్న ప్రజాస్వామిక పార్శ్వానికి తొలి నుండి శత్రువులే. ఇవ్వాళ అధికారంలోకి వచ్చారు కాబట్టి దానిని సమీక్షిద్దామంటున్నారు గానీ వాళ్లకు రాజ్యాంగంలోని హక్కుల పార్శ్వం పట్ల ఏ రకమైన ఆపేక్షా ఏ రోజూ లేదు.

అందువల్లనే వాళ్లు రాజ్యాంగాన్ని సమీక్షిద్దాం అనగానే అందరూ కీడు శంకిస్తున్నారు. రాజ్యాంగ సమీక్ష అక్కర లేదంటున్నారు. సంఘ్ పరివార్ దృక్కోణం నుంచి రాజ్యాంగాన్ని తిరగరాస్తే అదెంత దుర్భరంగా ఉంటుందో ఊహించుకోగలం కాబట్టి ఈ ఆందోళన సహేతుకమైనదే.

కానీ ప్రజాస్వామికవాదులు చెప్పేది ఇంతే అయితే రాజ్యాంగాన్ని ఒక అద్భుతమైన పత్రంగా, ప్రజలకు కావలసిన బలమంతా ఇచ్చే పత్రంగా చూపించడం అవుతుంది. ఇప్పటి పరిస్థితులలో రాజ్యాంగం నుండి కొత్తగా కోరుకునేదేమీ లేదని ప్రకటించడమవుతుంది. అది వాస్తవికమైన వైఖరి కాదు.

రాజ్యాంగాన్ని సమీక్షించవచ్చునా లేదా అన్న వివాదంలో చిక్కుకోకుండా, సమీక్ష ఏ కోణం నుండి చేయాలని ప్రశ్నించుకోవడం అవసరం. రాజ్యాంగాన్ని మాత్రమే కాదు, రాజ్యాంగం అమలును కూడ సమీక్షించుకోవాలని చెప్పడం అవసరం.

సమీక్షాకోణం గురించి ప్రశ్న వేసుకోగానే బిజెపి పాలకుల ప్రతిపాదనలోని అసంబద్ధత స్పష్టమవుతుంది. 'అభివృద్ధి'కీ, 'స్థిరత్వాని'కీ రాజ్యాంగం ఉపయోగపడిందా లేదా అని చర్చించాలని వారి ప్రతిపాదన అంటుంది. ఆ లక్ష్యాలు రాజ్యాంగంలో రాసుకొని ఉంటే ఆ ప్రాతిపదికన సమీక్షించడంలో అర్థం ఉంటుంది. కానీ భారత రాజ్యాంగం ప్రకటించుకున్న లక్ష్యం 'అభివృద్ధి' కాదు, 'స్థిరత్వం' కాదు. ఇప్పుడు ఎక్కువగా అందరూ మాట్లాడుతున్న 'స్థిరత్వం' అనే మాట రాజ్యాంగంలో ఎక్కడా లేదు. 'అభివృద్ధి' అనే మాట కూడ రాజ్యాంగ లక్ష్యాలలో లేదు. రాజ్యాంగ లక్ష్యాలయిన సామాజిక ఆర్థిక న్యాయానికి 'అభివృద్ధి' అడ్డం రాకూడదన్న హెచ్చరిక మాత్రమే (ఆర్టికల్ 39 లో) ఉంది.

రాజ్యాంగ లక్ష్యాలలో భాగం కాని వాటి సాధనకు రాజ్యాంగం పనికొచ్చిందా అని సమీక్షించడంలో అర్థం లేదు. ఈ మాట రాజ్యాంగ సమీక్షా సంఘంలోని 11 మంది పెద్దమనుషులలో ఏ ఒక్కరూ ప్రభుత్వంతో అనలేకపోయారంటే – నువ్వు చేయమంటున్న సమీక్షకూ రాజ్యాంగ లక్ష్యాలకూ ఏమీ సంబంధం లేదని వాజ్‌పేయితో అనలేకపోయారంటే – 'అభివృద్ధి' అనే ఆకర్షణ విజ్ఞులనుకునే వారిపైన సహితం ఎంత బలంగా పనిచేస్తున్నదో అర్థం అవుతుంది.

సమీక్ష అంటూ జరిపితే రాజ్యాంగం ప్రకటించుకున్న లక్ష్యాలయిన సామాజిక ఆర్థిక రాజకీయ న్యాయం అనే ఆదర్శాన్ని ప్రమాణంగా తీసుకొని జరగాలి. అప్పుడు ఆ లక్ష్యానికి కావలసిన అవకాశాలూ హక్కులూ రాజ్యాంగం ప్రజలకు సంపూర్ణంగా ఇచ్చిందా అని చర్చించుకోవచ్చు. రాజ్యాంగంలో ఉన్న బ్రిటిష్ వలసపాలకుల వారసత్వమైన పాలనా వ్యవస్థకూ, రాజ్యాంగం భరోసా ఇచ్చిన ఆస్తిహక్కు, వ్యాపారస్వేచ్ఛలకూ, అదే రాజ్యాంగం ప్రకటించుకున్న సమతా న్యాయాల లక్ష్యాలకూ మధ్యనున్న వైరుధ్యాన్ని సమీక్షించుకోవచ్చు. అయితే ముఖ్యంగా, రాజ్యాంగం అవకాశం కల్పించిన మేరకు కూడ సామాజిక ఆర్థిక రాజకీయ న్యాయాన్ని నిలబెట్టడానికి కృషిచేయని పాలనా వ్యవస్థ తీరునూ, శాసన వ్యవస్థ తీరునూ, రాజకీయాల తీరునూ సమీక్షించుకోవచ్చు. ఈ యాభై ఏళ్లలో ముందుకొచ్చిన ఆదర్శాలలో ఎన్నిటిని రాజ్యాంగంలో చేర్చారని రాజకీయ వ్యవస్థను ప్రశ్నించవచ్చు. రాజ్యాంగ చట్టాన్ని రాజ్యాంగ ఆదర్శాల వెలుగులో వ్యాఖ్యానించి ఆ ఆదర్శాలకు వాస్తవ రూపం ఇవ్వడానికి తోడ్పడే ప్రయత్నం అరకొరగా తప్ప చేయని న్యాయవ్యవస్థను సమీక్షించుకోవచ్చు.

ఇదంతా కేవలం కాలక్షేపం కోసం కాదు. గ్లోబలైజేషన్, హిందుత్వవాద ఫాసిజం అనే జంట ప్రమాదాలు ప్రజాస్వామ్యాన్నీ ప్రజల హక్కులనూ బలి తీసుకుంటున్న ఈ తరుణంలో ప్రజలు ఏ మేరకు రాజ్యాంగం నుండి శక్తి పొందగలిగితే ఆ మేరకు పొందాలి. ఈ కర్తవ్యానికి కావలసిన సంపూర్ణమైన శక్తి రాజ్యాంగం ఇస్తుందంటే అతిశయోక్తి అవుతుంది గానీ అందుకు తోడ్పడేదేమీ రాజ్యాంగంలో అసలే లేదంటే అది అతిశయోక్తి కాదు, జాతీయ ఉద్యమవారసత్వంగా మన రాజ్యాంగంలోకి వచ్చిన ప్రజాస్వామిక విలువలను తిరస్కరించడం అవుతుంది. గ్లోబలైజేషన్ నుండి, సంఘ్‌పరివార్ ఫాసిజం నుండి ప్రజల హక్కులనూ, జీవితాన్నీ రక్షించుకోవడానికి కావలసిన బలమంతా రాజ్యాంగం నుండే రాదు, రానవసరం లేదు. కానీ రాజ్యాంగ హక్కులనూ, సమానతా ఆదర్శాలనూ ఏ మేరకు బలపరచుకోగలిగితే ఆ మేరకు పై కర్తవ్యం సులభతరం అవుతుంది.

ఇందుకు కావలసింది రాజ్యాంగంలో మొదటి నుండీ ఉన్న అంతర్గత వైరుధ్యాల పైన చర్చ; రాజ్యాంగ ఆదర్శాలను అవకాశమున్న మేరకు కూడ అమలుచేయడానికి పెద్దగా ఉత్సాహం చూపని రాజ్యయంత్రాంగం పైన, రాజకీయాల పైన, న్యాయవ్యవస్థ పైన చర్చ. రాజ్యాంగ ఆదర్శాలతో ఏమీ సంబంధం లేని సామాజిక రాజకీయ లక్ష్యాలు గల సంఘ్ పరివార్ చేపడుతున్న సమీక్షకు ఇదే సరయిన జవాబు కాగలదు.

భారతదేశాన్ని ఆర్థికంగా, రాజకీయంగా కండబలం గల పెత్తందారీ రాజ్యంగా మార్చాలన్నది సంఘ్‌పరివార్ లక్ష్యం. దేశ సామాజిక రాజకీయ వ్యవస్థలో ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం వంటి ఆదర్శాలుండడం దీనికి ఆటంకమని వారి అభిప్రాయం. అవి 'దేశాన్ని' బలహీనపరుస్తాయి. అందువల్ల ఈ లక్ష్యాలు గల రాజ్యాంగం వారికి అవరోధంగా కనిపిస్తున్నది. అందుకోసమే ఈ సమీక్ష. ఈ సమీక్ష స్వభావాన్ని ఎండగడుతూ ప్రజాస్వామ్యం, సామాజికన్యాయం అనే లక్ష్యాల సాధనకు రాజ్యాంగంలో ఇప్పటికే ఉన్న అవరోధాల గురించి, రాజ్యాంగం అమలులో జరిగిన వైఫల్యాల గురించి ప్రజల వైపు నుండి చర్చ జరపడం అవసరం. గ్లోబలైజేషన్, సంఘ్‌పరివార్ ఫాసిజం అనే రెండు ప్రమాదాలు ఈ లక్ష్యాలను మరింత దూరం చేస్తున్న తరుణంలో ఈ చర్చ మరీ అవసరం.

ఈ కోణం నుండి రాజ్యాంగాన్నీ రాజ్యాంగ యంత్రాన్నీ – న్యాయ, శాసన, పరిపాలనా వ్యవస్థలనూ, దేశ రాజకీయాలనూ – సమీక్షిద్దాం రమ్మని ఆహ్వానిస్తూ ...

# రాజ్యాంగం–సామాజిక ఉద్యమాలు

జనవరి–డిసెంబర్ 2001; Indian Journal of Human Rights

ఇక్కడ నేను 'సామాజిక ఉద్యమాలు' అనే పదాన్ని రాజకీయ, ఆర్థిక ఉద్యమాలతో సంబంధం లేని ఉద్యమాలనే అర్థంలో కాకుండా – పీడితవర్గాలవారు, దోపిడీకి గురవుతున్నవారు, వెనుకబడినవారు మెరుగైన జీవనం కోసం చేసే అన్ని పోరాటాలను కలిపి – విశాలమైన అర్థంలో ఉపయోగిస్తున్నాను. వారి దృష్టి నుండి, అంటే సామాజిక ఉద్యమాల దృష్టికోణం నుండి పరిశీలించినపుడు భారత రాజ్యాంగం ఎలా కనిపిస్తుంది?

మొదటగా, రాజ్యాంగాన్ని ఎవరైనా ఎలా చూడాలి? రాజ్యాంగం ఒక చారిత్రక పత్రం. చరిత్రను విమర్శించినట్లే రాజ్యాంగాన్ని కూడ విమర్శించవచ్చు. "మనకు ఇంతకంటే మంచి చరిత్ర ఉండాల్సింది" అనుకున్నట్టే, "మనకు ఇంతకంటే మంచి రాజ్యాంగం ఉండాల్సింది" అని ఎవరైనా అనవచ్చు. ఈ వైఖరికి మంచి, చెడు అని ప్రత్యేకంగా ఏమీ ఉండదు; అది నిర్మాణాత్మక విమర్శకు దోహదం చేసే వైఖరా కాదా అనేది మనం ఏ దిశలో దాన్ని ముందుకు తీసుకువెళతామనే దానిపై ఆధారపడి ఉంటుంది. ఒక ఫిర్యాదుగా మాత్రమే ఆ మాట అనేటట్లయితే దాని వల్ల పెద్ద ఉపయోగం లేదు. చరిత్రతో తగాదా పడడానికి అది ఏ మాత్రం సరైన మార్గం కాదు; ఎలా తగాదా పడకూడదో చెప్పడానికి ఒక మంచి ఉదాహరణ మాత్రమే అవుతుంది. అలా కాకుండా మన ఫిర్యాదు ఆనాటి పరిస్థితులను విశ్లేషించడానికి దారితీస్తే; ప్రస్తుత పరిస్థితులనూ, భవిష్యత్తు అవకాశాలనూ కూడ అర్థం చేసుకోవడానికి దోహదపడితే అది ఉపయోగకర విషయమవుతుంది.

మనకు ఇంతకంటే మంచి రాజ్యాంగం ఉండాల్సింది అని అంటున్నామంటే దాని అర్థం మనం ఈ కింది రెండు అభిప్రాయాలలో ఏదో ఒకటి కలిగి ఉన్నామని అనుకోవాలి. ఒకటి, రాజ్యాంగ నిర్మాణానికి దారితీసిన రాజకీయ శక్తులు, పరిస్థితులు పూర్తిగా వేరే రకంగా ఉండాల్సింది అనే అభిప్రాయం. రెండు, ఉన్న పరిస్థితుల్లోనే మరింత మెరుగైన రాజ్యాంగం రాసుకుని ఉండాల్సింది అనే అభిప్రాయం. మొదటి అభిప్రాయం మన చరిత్ర

వాస్తవిక విశ్లేషణపై ఏర్పరచుకున్నదైతే అది మన సమాజం గురించి చాలా విషయాలు చెప్పగలదు కాని మన రాజ్యాంగం గురించి, రాజ్యాంగ సంస్థలతో మనకు ఉండాల్సిన సంబంధాల గురించి మాత్రం అది ఎక్కువ చెప్పలేదు. రెండో అభిప్రాయం ఆ పని చేయగలదు.

నేను ఇది ఎందుకు చెబుతున్నానంటే రాజ్యాంగాన్ని ఎలా చూడాలనే విషయమై ఒక నిర్దిష్ట భావజాల చట్రంలో సైతం ఒకే పద్ధతి లేదు. దేని కోసం మీరు రాజ్యాంగాన్ని చూస్తున్నారనే దానిపై అది ఆధారపడి ఉంటుంది. ఇక్కడ నేను రాజ్యాంగాన్ని మన దేశ మానవహక్కుల ఉద్యమ లక్ష్యాల దృష్ట్యా పరిశీలిస్తాను.

భారత రాజ్యాంగం విశాల ప్రజానీకం ఆశలు, ఆకాంక్షల నేపథ్యంలో రూపొందింది. 'స్వపరిపాలన'కు అవకాశం లభించడం అంటేనే తమ జీవితాలను, అన్ని విధాలుగా కాకపోయినా, చాలా విధాలుగా మెరుగుపరుచుకోగల మార్గాలు తెరుచుకోవడమని ఆ నాడు ప్రజలు నమ్మారు. బహుళ ప్రజాదరణ పొందిన తన 'ఫ్రేమింగ్ ఆఫ్ ది కాన్స్టిట్యూషన్' పుస్తకంలో[1] బి.శివరావు కూడ "స్వాతంత్ర్య పోరాటం మొదటి నుండి ప్రజల యొక్క, ప్రజల చేత, ప్రజల కోసం ప్రభుత్వాన్ని స్థాపించడమే తన మౌలిక లక్ష్యంగా పెట్టుకుంది" అని రాశారు. స్వాతంత్రానికి పూర్వమే మెరుగైన జీవితానికి సంబంధించిన ఆలోచనలు భారతీయ ప్రజా జీవితంలో చర్చకు వచ్చాయి. శతాబ్దానికి పైగా సాగిన సామాజిక ఉద్యమాలు, సంస్కరణ ఉద్యమాలు వీటిని ముందుకు తెచ్చాయి. కొన్ని పోరాటాలను రాజకీయ పార్టీలు, ఉద్యమాలు నడిపిస్తే, కొన్ని పోరాటాలను ప్రజలు లేదా వారి మధ్య జీవిస్తున్న మనుషుల్లో ఎవరో ఒకరు చొరవ తీసుకుని తమంతటతామే నడిపించారు. అన్నీ ఒక స్థాయిలో జరగలేదు. కొన్ని మిగతా వాటి కంటే ఎక్కువ మిలిటెంట్‌గా, రాడికల్‌గా జరిగాయి. అలాగే కొన్ని సంస్కరణలు ఉన్నత వర్గాలకు/సమూహాలకు చెందిన సహృదయుల కారణంగా అమలులోకి వస్తే, కొన్ని అణగారిన వర్గాల వారి స్వంత ప్రయత్నాల ఫలితంగా వచ్చాయి. పాశ్చాత్య దేశాల ఉదారవాద భావాలు, తూర్పు దేశాల సోషలిస్టు భావాల ప్రభావం కూడ ఈ ఆలోచనలపై ఉంది.

ప్రజల ఈ ఆశలు, ఆకాంక్షల గురించి రాజ్యాంగ రచనా సభలోని సభ్యులందరికీ బాగానే ఎరుక ఉంది. కాకపోతే అందరికీ ఈ ఆకాంక్షల మూలాలపై పూర్తి అవగాహన లేకపోయి ఉండొచ్చు, వాటి పట్ల సానుభూతి కూడ ఒకేలా లేకపోయి ఉండవచ్చు. స్వాతంత్రోద్యమ సమయంలోనే ప్రజలు తమ ఆకాంక్షలను మరింత మిలిటెంట్‌గా,

రాడికల్‌గా వ్యక్తం చేసి ఉంటే – అప్పుడు కూడ ఈ వ్యక్తులే రాజ్యాంగ సభలో సభ్యులుగా ఉండి ఉండేవారా, వేరే వాళ్ళు సభ్యులై ఉంటే ఇప్పుడు వచ్చిన అభిప్రాయాలకే వాళ్ళు వచ్చి ఉండేవారా అనే ప్రశ్నలు రాజ్యాంగాన్ని రాజకీయంగా విశ్లేషించడానికి చాలా ముఖ్యమైనవే కాని వాటి వల్ల మానవ హక్కుల ఉద్యమానికి కలిగే ప్రయోజనం ఏమీ లేదు.

రాజ్యాంగం అమలులోకి వచ్చిన వెంటనే విప్లవాత్మక మార్పులు వచ్చేసి అప్పటికప్పుడు కొత్త సమాజం రూపు దిద్దుకుంటుందని రాజ్యాంగకర్తలు కూడ అనుకోలేదు. అయితే తగిన సమయంలో అలాంటి మార్పులు రావడానికి వారు ఒక మార్గం తెరిచి ఉంచాలనుకున్నారు. దాన్ని వారు రెండు విధాలుగా చేశారు. ఒకటి వెస్ట్ మినిస్టర్ (బ్రిటిష్) – గాంధేయ పద్ధతుల మిశ్రమ రూపంలో (పార్లమెంట్, గ్రామ పంచాయతీలు రెండూ ఉండేలా) ప్రాతినిధ్య ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పడం, ప్రాతినిధ్య ప్రజాస్వామ్య వ్యవస్థల వెలుపల కూడ ప్రజలకు కొన్ని రాజకీయ స్వేచ్ఛలను ఇవ్వడం. రెండోది రాజ్యాన్ని సంక్షేమ–ఆధారిత విధాన చట్రంలో రూపొందించడం. ఈ విధానాన్ని సామాజిక ఉద్యమాలు ఎలా అర్థం చేసుకోవాల్సి ఉంటుంది?

ఎందుకంటే రాజ్యాంగం అమలులోకి వచ్చిందని సామాజిక ఉద్యమాలు ఏవీ ఆగిపోలేదు. వాటిని ఆపు చేయడానికి కారణం కూడ ఏమీ లేదు. కొందరు సామాజిక ఉద్యమ నాయకులు నిజాయితీగానో లేదా వేరే కారణాల వల్లనో కాంగ్రెస్ అధికారంలో ఉంది కాబట్టి ఉద్యమాలు ఇక అవసరం లేదని, కాంగ్రెస్ ఉదార పాలన (benign rule) ప్రజలకు అన్ని ప్రయోజనాలను అందిస్తుందని భావించి ఉండవచ్చేమో కాని అందరూ ఏమీ దాన్ని నమ్మలేదు. స్వాతంత్ర్యం వచ్చి ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం నెలకొన్నాక ఉద్యమాల అవసరం ఉండదు అనే ఆలోచనే నిజానికి సామాజిక ఉద్యమకారులకు ఎంతమాత్రం ఆమోదయోగ్యమై ఉండేది కాదు. అలాంటిది ఎవరైనా భావించినా దాన్ని వారు పెద్ద అడ్డంకిగా అనుకునేవారు. సామాజిక ఉద్యమాలు ఉండాలా అక్కరలేదా అనే చర్చ అలా ఉంచితే మెరుగైన *జీవితం కోసం పోరాడే స్పష్టమైన హక్కు గురించి మాత్రం రాజ్యాంగంలో దాదాపు ఏమీ లేదని చెప్పక తప్పదు.*

రాజ్యాంగ సంస్థల సాధారణ పనితీరు ద్వారానే రాజ్యాంగ లక్ష్యాలు సాధించబడతాయని రాజ్యాంగకర్తలు నమ్మి ఉంటే అందులో మనం పెద్దగా ఆశ్చర్యపడాల్సిందేమీ లేదు. అలా నమ్మకపోయి ఉంటే రాజ్యాంగంలో ఆ లక్ష్యాలను

రాయడంలో వారి నిజాయితీనే శంకించాల్సి వచ్చేది. కాని నిజమైన ప్రజాస్వామిక రాజ్యాంగం ఈ రెండిట్లో ఏదో ఒక పని చేసి ఉండాల్సింది. మొదటిది – రాజ్యాంగంలో పొందుపరిచిన సమానత్వ లక్ష్యాలను సాధించడానికి ప్రజలు ఇప్పుడున్న దోపిడీ వ్యవస్థలకు వ్యతిరేకంగా పోరాడాల్సి రావొచ్చనే ఎరుకతో వారికి ఆ అవకాశాన్ని కల్పించాల్సింది. రెండోది – కొత్తగా ముందుకొస్తున్న ప్రజల ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకుని రాజ్యాంగ లక్ష్యాలను భవిష్యత్తులో మరింత మెరుగుపరుచుకునే అవకాశం కల్పించి ఉండాల్సింది. నిజానికి మన రాజ్యాంగం ఈ ఆలోచనలకు పూర్తి వ్యతిరేకమేమీ కాదు. కాని రాజ్యాంగంలో మాత్రం దానికి స్పష్టమైన గుర్తింపు గాని, ఏర్పాటు (provision) గాని చేయలేదు. పైగా ఆ ఆలోచనలను వ్యతిరేకించే విషయాలు రాజ్యాంగంలో అనేకం ఉన్నాయి.

## లక్ష్యాలు నిర్దేశించింది కాని వాటి సాధనకు హక్కులు ఇవ్వలేదు

మానవ హక్కుల దృష్టితో చూసినపుడు మన రాజ్యాంగంలో  కనిపించే ఒక వైరుధ్యం ఏమిటంటే పాశ్చాత్య దేశాల ఉదార భావాలను, తూర్పు దేశాల సోషలిస్టు భావాలను, భారతదేశ తిరుగుబాటు సంప్రదాయాలను సమపాళ్ళలో మేళవించిన అత్యున్నత లక్ష్యాలను అది దేశానికి నిర్దేశిస్తుంది కాని ఆ లక్ష్యాలను సాధించడానికి ప్రజల చేతికి బలమైన సాధనాలను మాత్రం ఇవ్వదు. పైపెచ్చు ప్రజల పోరాటాలను తప్పనిసరిగా వ్యతిరేకించే అధికార యంత్రాంగానికి అందుకు అవసరమైన అధికారాలను కట్టబెట్టింది. రాజ్యాంగ లక్ష్యాల సాధనకు అడ్డంకిగా ఉన్నది అసమానతలే అయినపుడు ఆ అసమానతలకు వ్యతిరేకంగా ఉద్యమించే ప్రజలకు అది సమకూర్చగల అత్యంత శక్తివంతమైన సాధనం – పోరాడేందుకు అవసరమైన స్వేచ్ఛలు. నిత్య పోరాటాల పట్ల రాడికల్ మేధావులలో చాలా సాధారణంగాను, ప్రజల్లో మాత్రం అత్యంత అరుదుగాను కనిపించే రొమాంటిసిజం నాకేమీ లేదు. వ్యవస్థీకృత అసమానతలు అణగారిన వర్గాల సంఘటిత పోరాటాల ద్వారా మాత్రమే రద్దవుతాయన్న వాస్తవిక దృష్టికోణం నుంచి మాత్రమే చెబుతున్నాను. ఈ విషయంలో చట్టమూ, ప్రజాస్వామ్య ప్రాతినిధ్య సంస్థలు కొంత పాత్ర పోషించగలవు – నిజానికి వాటి అవసరం కూడ చాలా ఉంటుంది – కాని పర్వతాల్లా మేట వేసిన అణచివేతలను కదిలించడానికి కావాల్సిన బలం వాటికి చాలా అరుదుగానే ఉంటుంది.

మరైతే ఈ విషయంలో భారత రాజ్యాంగం మనకు ఏమిచ్చింది? రాజ్యాంగం హామీ ఇచ్చిన రాజకీయ సమానత్వం సామాజిక, ఆర్థిక సమానత్వానికి సాధనంగా ఉద్దేశించబడిందని, అది సాకారం కాని పక్షంలో ప్రజలు రాజ్యాంగాన్నే తిరస్కరిస్తారని అంబేద్కర్ చెప్పినట్లు తరచుగా ఉటంకిస్తారు. ఆయన మాటల్లోని నిజాయితీని

సందేహించాల్సిన అవసరం లేదు కాని రాజ్యాంగం హామీ ఇచ్చిన రాజకీయ స్వేచ్ఛ ఒక్కటే సామాజిక, ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని సాధించడానికి సరిపోతుందా? ఓటు హక్కు ఒక్కటే చాలదు కదా! దాంతో పాటు ఆందోళన చేసే హక్కు కూడ ఇచ్చి ఉండాల్సింది. మనకు కొన్ని ప్రాథమిక హక్కులు – అంటే సంఘాలు పెట్టుకోవడానికి, సమావేశాలు జరుపుకోవడానికి, విశ్వాసాలను కలిగి ఉండడానికి, స్వేచ్ఛగా మాట్లాడడానికి ఉన్నాయి. ఇది మంచి విషయమే – ఎందుకంటే చాలా దేశాలలో ఈ హక్కులకు ఎలాంటి భరోసా లేదు. కాని ఈ హక్కులకు ఉన్న పరిమితులలోనే ఉంది సమస్య అంతా. నేరుగా చట్టంలో పెట్టిన పరిమితులే కాదు, అనధికారిక పరిమితులను ఉపేక్షించే ధోరణి – అంతర్జాతీయ మానవ హక్కుల చట్టంలో దీనిని 'ఇంప్యూనిటీ' (శిక్ష పడుతుందనే భయం లేనితనం) అని పిలుస్తారు – కూడ ఉంది. నిరసన తెలిపే స్వేచ్ఛ గురించి ఏ రాజకీయ కార్యకర్తనైనా అడిగి చూడండి దానికి కొలబద్ద స్థానిక పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఇష్టాయిష్టాలే అని జవాబు చెపుతాడు. రాజ్యాంగంలో అలా ఏమీ లేదు కాని దేశ పరిపాలనా వ్యవస్థలో తరచూ కనిపించే ఈ 'ఇంప్యూనిటీ'ని నియంత్రించే యంత్రాంగాన్ని మాత్రం అది ఏర్పాటు చేయలేదు.

'ఇంప్యూనిటీ' గురించి తర్వాత మాట్లాడుకుందాం. ప్రస్తుతం కొన్ని హక్కుల గురించిన ఎరుక మనకు ఎలా వచ్చిందో గుర్తు చేసుకుందాం. ఏ ప్రజాస్వామిక ఆందోళనలోనైనా ప్రాథమిక కార్యక్రమాలు నిరసన ప్రదర్శనలు, ఊరేగింపులు, ధర్నాలు కదా! వాటిని చేసే హక్కు ప్రజలకు ఉన్నదని, రాజ్యాంగమే ఆ హక్కుకు భరోసా ఇచ్చిందనేది మొదట్లో స్పష్టంగా లేదు. ఊరేగింపు తీసే హక్కు రాజ్యాంగ ప్రాథమిక హక్కుల్లోనే అంతర్గతంగా ఉందని, అలాగే సభలు, సమావేశాలను ఏకపక్షంగా నిషేధించడం లేదా నిరోధించడం కుదరదని కోర్టులు చెప్పేదాకా తెలియలేదు. సుప్రీంకోర్టు చాలా సృజనాత్మకమైన తెలివితేటలను ఉపయోగించి ఇలా చెప్పింది:[2] ప్రజలకు శాంతియుతంగా సమావేశం కావడానికీ, అలాగే దేశంలో ఎక్కడైనా సంచరించడానికీ హక్కులు ఉన్నాయంటే – ఆ రెండిట్నీ కలుపుకుని వారికి ఊరేగింపు తీసే హక్కు ఉందని భావించాలి; ఎందుకంటే ఊరేగింపు అంటే కదిలే సమావేశమే కదా అంది. ఇది 1973 లో వచ్చిన తీర్పు. రాజ్యాంగ ధర్మాసనం 30 ఏళ్ళ క్రితం ఈ అభిప్రాయం వెలిబుచ్చింది కాబట్టి సరిపోయింది కాని ఈ రోజు అయితే కోర్టులు ఇంత విశాలమైన వైఖరిని తీసుకుని ఉండేవా అంటే సందేహమే. అదే సమయంలో మన కోర్టు తీర్పులు సమావేశాలు, ప్రదర్శనల విషయంలో కోర్టు అనుమతి పొందాక కూడ జోక్యం చేసుకోవడానికి పోలీసులకు చాలానే స్వేచ్ఛను

ఇచ్చాయి. ఆ స్వేచ్ఛను అధికార యంత్రాంగం ఇప్పటిదాకా ఎక్కువ ఉపయోగించలేదంటే దానికి కారణం కోర్టు ఆదేశాలను ఏ మేరకు ఉల్లంఘించవచ్చో వారికి స్పష్టంగా తెలియకపోవడం వల్లనే. అయినా సభలు జరుపుకోవడానికి అనుమతి కోసం అందరూ కోర్టుకు వెళ్లలేరు కాబట్టి, ఆ హక్కు ఇప్పటికీ ఎక్కువగా పోలీసుల ఇష్టాయిష్టాల మీదనే ఆధారపడి ఉంది.

ఏ రాజ్యాంగమూ ప్రజలకు ఆందోళన చేసే హక్కును బేషరతుగా ఇవ్వలేదని, అంటే శాంతి భద్రతలకు భంగం కలగడానికి అంగీకరించలేదని ఎవరైనా అనొచ్చు. భారత స్వాతంత్ర్య సమరం కంటే ఎంతో ఎక్కువ రాడికల్ ఉద్యమాల ద్వారా అధికారంలోకి వచ్చిన దేశాలలోని రాజ్యాంగాలు కూడ భారత రాజ్యాంగం ఇచ్చిన పరిమిత హక్కును సైతం ఇవ్వలేదు కాబట్టి, నేను రాజకీయ వాస్తవాలకు సంబంధం లేని హక్కు కోసం వాదిస్తున్నానని అనిపించవచ్చు. దీని గురించి నేను స్పష్టత ఇవ్వడం అవసరం.

మనం మొదట సామాజిక క్రమానికి, ప్రజా భద్రతకు (Social Order and Public Order) మధ్యనున్న తేడాను తెలుసుకోవాలి. మొదటిది సామాజిక సంబంధాల సంక్లిష్ట సమాహారమైతే రెండోది ప్రజలందరికీ శాంతియుత, క్రమబద్ధమైన జీవితాన్ని ఇచ్చేది. చరిత్రలో మనకు తెలిసిన ప్రతి రాజ్యాంగమూ కూడ ప్రజా భద్రత పునాదిపైనే ఏర్పడింది. రాజ్యానికి ఉపకరణంగా చట్టానికుండే ఒక ప్రధాన లక్ష్యం ప్రజాభద్రతను కాపాడటమే. ఇది రాడికల్ విమర్శకులు భావించినట్టు ఎల్లప్పుడూ చెడ్డ విషయమేం కాదు. ఇతర విషయాలు సమానంగా ఉంటే, చట్టబద్ధ పాలన ఇచ్చే రక్షణ బలవంతుల కంటే బలహీనులకే ఎక్కువ అవసరం. బలవంతులు తమను తాము ఎలాగైనా రక్షించుకోగలరు, అవసరమైతే బలహీనులను బలి పెట్టి అయినా సరే. కాని రాజ్యాంగం, చట్టం క్రమబద్ధమైన ప్రజా జీవనాన్ని మాత్రమే కాక, ఆస్తి, హెూదా, సామాజిక స్థాయిలతో వచ్చే అన్ని సదుపాయాలను కూడ – అవి సంప్రదాయంగా వచ్చినవైనా, ఒప్పందం ప్రకారం వచ్చినవైనా – రక్షిస్తాయి. ఇది సామాజికంగా బలహీనులైనవారి ప్రయోజనాలకు నష్టం చేస్తుంది. రాజ్యాంగం కనుక సాంఘిక సంబంధాల విషయంలో సమానత్వ దిశగా సాగే క్రమబద్ధమైన మార్పును అనుమతిస్తే – పేదలు, బలహీనులకు సంబంధించినంత వరకు సామాజిక క్రమానికి, ప్రజా భద్రతకు మధ్య ఘర్షణ ఉండదు. రాజ్యాంగం ఇలాంటి మార్పును అనుమతిస్తుందని అంబేద్కర్ వంటి నిజమైన ప్రజాస్వామికవాదులు ఆశించి ఉండవచ్చు. కాని అలా జరగదనేది రాజకీయ వాస్తవం. దానికి కారణం బలవంతులు రాజ్యాంగాన్ని తమకు వ్యతిరేకంగా పనిచేయనివ్వకపోవడమే కాదు, అసమానతలను శక్తివంతంగా ఎదుర్కొనేందుకు

బలహీనులకు అవసరమైన సాధనాలు రాజ్యాంగంలో పూర్తి స్థాయిలో లేకపోవడం వల్ల కూడ బలహీనులు సామాజిక వ్యవస్థను మార్చడానికి శాంతి భద్రతలను అతిక్రమించాల్సి రావచ్చు. అలా జరిగినప్పుడు అసలు ఈ శాంతి భద్రతల వ్యవస్థే మంచిది కాదన్నట్టు వారికి మద్దతుగా మాట్లాడే కొందరు రాడికల్ విమర్శకులు అంటుంటారు. ఈ వాదన బలహీనులకు ప్రయోజనకరం కాదు. దాని బదులుగా ఆ అలజడి మూలాలను, స్వభావాన్ని అర్థం చేసుకుని వాటి పట్ల సున్నితంగా స్పందించలేని వ్యవస్థ లోపాలను ఎత్తిచూపి విమర్శించడం ముఖ్యం. ఆందోళన చేసే హక్కు ఇలాంటి సందర్భాలలో ఎంత అవసరమో చెప్పడం ముఖ్యం.

ఆందోళన చేసే హక్కును ఎలా నిర్వచించాలో, దాన్ని (చట్టం పరిభాషలో) ఏ విధంగా రూపొందించాలో నాకూ పూర్తిగా తెలియదు, కాని దాని అవసరం ఉందనేది మాత్రం నిస్సందేహం. తక్కువ ఖర్చు పుస్తకాల ప్రచురణ ద్వారా, బహిరంగ ప్రదేశాలలో నాటక ప్రదర్శనలు, సభలు, నిరసనలు (కేవలం హాళ్లలో కాదు) జరుపుకోవడం ద్వారా ప్రజలు తమ ఆలోచనలను ప్రచారం చేసుకునే హక్కు; తమ నిరసనలకు అనుమతి నిరాకరిస్తున్న వ్యక్తి/సమూహం/సంస్థలకు ఆ విషయం స్పష్టంగా తెలిసే పద్ధతిలో జనం తమ మూకుమ్మడి ఆగ్రహాన్ని (పోలీసులు నిర్ణయించిన స్థలంలో కాకుండా; ఎందుకంటే మన నగరాలలో ఎక్కువసార్లు అదే జరుగుతుంటుంది.) వ్యక్తపరచగల హక్కు; ఒక సమస్య గురించి అవసరమైన సమాచారాన్ని ప్రైవేటు వ్యక్తుల నుండైనా, ప్రభుత్వాధికారుల నుండైనా తీసుకునే హక్కు, దానిపై ప్రజా విచారణ, ప్రభుత్వ స్పందన కోరే హక్కు, ఆ సమాచారం కోసం ప్రభుత్వ కార్యాలయంలోకో, ప్రైవేటు సంస్థలోకో ప్రవేశించినందుకు లేదా ఆ సమస్యను అధికారుల దృష్టికి తీసుకురావడం కోసం సందర్శనకో, సమావేశానికో వచ్చిన ప్రజాప్రతినిధినో, ప్రభుత్వాధికారినో అడ్డుకున్నందుకు నేరపూరిత దురుద్దేశాలు అంటకట్టకుండా (ఇది సాధారణంగా జరుగుతూ ఉంటుంది. విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వోద్యోగిని అడ్డుకున్నారని క్రిమినల్ నేరారోపణ చేస్తుంటారు) రక్షణ పొందే హక్కు – ఇవన్నీ కచ్చితంగా ఆందోళన చేసే హక్కులో భాగంగా ఉండాలి. ఈ హక్కులు ఇప్పుడు పూర్తిగా లేవని కాదు, కానీ అవి ఎక్కువగా కోర్టులు రాజ్యాంగ ప్రాథమిక హక్కులపై ఇచ్చిన వ్యాఖ్యానాలపై ఆధారపడి ఉన్నాయి. ఊరేగింపు హక్కు రాజ్యాంగంలోనే ఉందని సుప్రీంకోర్టు చెప్పిన విధానం గురించి నేను ఇప్పటికే చెప్పాను. ప్రచురణ హక్కు కూడ అలాంటి ఒక సుప్రీంకోర్టు తీర్పు ఫలితమే. అది రాజ్యాంగ ప్రాథమిక హక్కుల్లో ఒకటైన భావ ప్రకటనా స్వేచ్ఛలో భాగమని వాళ్ళు తీర్పు[3] చెప్పడం వల్ల వచ్చిందే. లేకపోతే ఈ హక్కులన్నీ పోలీసులకున్న సాధారణ అధికారాలకు లోబడి ఉండేవే.

వలస పాలన వారసత్వంగా మన ప్రభుత్వానికి వచ్చిన ఈ అధికారాలన్నిటినీ రాజ్యాంగంలో ఏ మాత్రం మార్పు లేకుండా యథాతథంగా ఉంచేశారు. పోలీసింగ్ అధికారాలు, అవి పోలీసులకు ఇచ్చే విచక్షణాధికారాలు పూర్తిగా అనవసరమని నేను చెప్పడం లేదు. అవసరమైనపుడు బలహీన వర్గాలపై జరిగే దాడులను, మత కలహాలను నివారించడానికి పోలీసులు తక్షణమే ఈ అధికారాలను ఉపయోగించకపోతే మనమే ఫిర్యాదు చేస్తాం. కానీ విచక్షణారహితంగా నిరసనకు అనుమతి నిరాకరించడంపై మాత్రం స్పష్టమైన పరిమితులు విధించాల్సిన అవసరం ఉంది. స్వాతంత్ర్యానికి ముందున్న పోలీసు చట్టాలనే రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత కూడ కొనసాగించడాన్ని అందరి కంటే ఎక్కువ ప్రశ్నించిన ఘనత రామ్ మనోహర్ లోహియా, ఆయన సహచరులకు దక్కుతుంది[4]. అలాగే సుప్రీంకోర్టును కూడ ఈ విషయంలో అభినందించాలి. వారి వాదనతో ఏకీభవించకపోయినా, మొత్తం పోలీసు చట్టాలను తిరగరాయమని పాలకులను ఆదేశించగల అవకాశాన్ని చేజార్చుకున్నా ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుని, విషయాన్ని లోతుగా పరిశీలించడానికి విస్తృత బెంచ్‌లను ఏర్పాటు చేసి సుప్రీంకోర్టు పౌరహక్కుల పట్ల తన సహృదయతను చాటుకుంది. కాని ఇప్పుడు సుప్రీంకోర్టులో ఆ సహృదయత కొరవడింది.

## ఇచ్చిన హక్కులు కూడ సులభంగా అమలవడం లేదు

నిరసన హక్కు రాజ్యాంగం వాగ్దానం చేసిన సమానత్వాన్ని సాధించడానికి మాత్రమే కాక, ఇప్పటికే ఇచ్చిన హక్కులను రక్షించడానికి కూడ చాలా అవసరం. ఎందుకంటే ధనవంతుల కోసం చేసిన చట్టాలు సులభంగా అమలయినట్టు పేదలు, వెనుకబడినవారి కోసం చేసిన చట్టాలు అమలు కావు. ప్రతి దశలో అడ్డంకులను ఎదుర్కొంటాయి. ఎస్.సి, ఎస్.టి (అత్యాచారాల నివారణ) చట్టాన్ని అమలు చేయించుకోవడంలో దళిత కార్యకర్తలు; వరకట్నం, గృహ హింస, సమాన వేతన చట్టాలను చేయించుకోవడంలో మహిళా కార్యకర్తలు ఈ ఇబ్బందులను అనుభవించారు. ప్రతి దశలోనూ బాధితులు ఆందోళన చేయాల్సిందే; చేయకపోతే చట్టాలను అమలు చేయించడానికి అధికారులు ఒక్క అడుగు కూడ ముందుకు వేయరు. అమెరికాలో జాతి, లింగ వివక్షలను నిషేధించడానికి ఎంత సుదీర్ఘ పోరాటం చేయవలసి వచ్చిందో గుర్తు చేసుకుంటే మన రాజ్యాంగం కుల, లింగ వివక్షలను, అస్పృశ్యతను ముందుగానే 14, 15, 16, 17 అధికరణాలలో నిషేధించడమనేది ఒక ఘనతగానే చెప్పుకోవాలి. అంతమాత్రాన ఒకప్పటి అస్పృశ్యులు, మహిళలు ఈ నిషేధాల ప్రయోజనాలను సులభంగా ఏమీ అనుభవించడం లేదు. నిజం చెప్పాలంటే ప్రతి గ్రామంలోను, మొహల్లాలోను, కళాశాలలోను, ఫ్యాక్టరీలోను, కార్యాలయంలోను

అడుగడుగునా పోరాడుతూ వారు ఈ వివక్షలను అధిగమించవలసి వచ్చింది. వారి పోరాటం ఇప్పటికీ పూర్తి కాలేదు. గమ్యానికి చాలా దూరంగానే ఉంది. అయినా ఈ సామాజిక-చట్టపరమైన వాస్తవాన్ని గుర్తించకుండా, దాన్ని అధిగమించేందుకు అవసరమైన నిబంధనలు రూపొందించని రాజ్యాంగం గురించి మనం ఏమనుకోవాలి? రాజ్యాంగంలో తేటతెల్లంగా రాసి ఉన్న హక్కులను అనుభవించడానికి ఆయా వర్గాలు చేసే అన్ని ప్రయత్నాలను శాంతిభద్రతలకు భంగపరిచే ధోరణులుగా చూసే సమాజంతో, పరిపాలనా యంత్రాంగంతో మళ్ళీ కూడ వారే తలపడాల్సి రావాల్సిన పరిస్థితి కల్పించిన రాజ్యాంగం గురించి ఏమనుకోవాలి?

కోర్టులు తమ ఉదార స్వభావాన్ని కోల్పోయే కొద్దీ, ప్రభుత్వ విధానాలు సంక్షేమానికి దూరం జరిగే కొద్దీ రాజ్యాంగం ప్రజలపై బలవంతంగా రుద్దిన ఈ బలహీనత మరింత కొట్టొచ్చినట్టు కనబడుతోంది. పైపెచ్చు రాజద్రోహం, టెర్రరిజం, దేశ సమగ్రతకు, ఐక్యతకు హానికరమైన కార్యకలాపాల పేరుతో ప్రభుత్వం చేస్తున్న అసాధారణ చట్టాలు అనేక రాజకీయ అభిప్రాయాలను, రాజకీయ సానుభూతులను, రాజకీయ కార్యకలాపాలను నేరాల పరిధిలోకి తీసుకొస్తున్నాయి. ఈ విషయాలనేం పట్టించుకోకుండా సుప్రీంకోర్టు ఇలాంటి చట్టాలన్నీ రాజ్యాంగబద్ధమైనవేనని తనను తాను నమ్మించుకుంటూ తీర్పులు ఇస్తోంది. ఆ చట్టాలలో ఏ అంశమైనా రాజద్రోహం, టెర్రరిజం అని నిర్వచించబడితే చాలు దాని మీద శాంతియుత కార్యకలాపంతో సహా ఏ రకమైన రాజకీయ కార్యకలాపాన్నీ అనుమతించడం లేదు. పోటా దీనికి తాజా ఉదాహరణ. నిషేధిత సంస్థలు లేదా కార్యక్రమాల పట్ల రాజకీయ సానుభూతి కలిగి ఉండడాన్ని ఈ చట్టాలు కఠినంగా శిక్షిస్తాయి. టెర్రరిజాన్ని, దేశ ఐక్యత, సమగ్రతలకు హాని కలిగించే కార్యకలాపాలను అదుపు చేసే పేరు మీద ఈ చట్టాలు సుప్రీంకోర్టు ఆమోదం పొందినందువలన రాజకీయ వ్యక్తీకరణలో అధిక భాగం రాజ్యాంగం ప్రకారం ఇప్పుడు చట్టవిరుద్ధమై పోయాయి. అభిప్రాయ వ్యక్తీకరణే చట్టవిరుద్ధమైనపుడు దాని ప్రచారం కోసం, సాధన కోసం చేసే ఏ ఆందోళననూ చట్టం సహించదు. ఈ పరిస్థితికి రాజ్యాంగాన్ని నిందించాలా, కోర్టులను నిందించాలా అనేది పరిశోధనకు ఆసక్తికర విషయం కావొచ్చు కాని కోర్టులు చెప్పిందే రాజ్యాంగం (అలాగే కోర్టులు చెప్పిందే చట్టం) కాబట్టి, ఆ రెండిట్లో ఏ దృష్టికోణం నిజమనుకున్నా మనకు ఒరిగేదేమీ లేదు.

కోర్టులు వ్యాఖ్యానించిందే రాజ్యాంగం కాబట్టి, రాజ్యాంగానికి - సామాజిక ఉద్యమాలకు మధ్యనున్న సంబంధాల చర్చలో కోర్టులు ఉద్యమాలతో ఎలా వ్యవహరిస్తాయనే

అంశం కూడ భాగమే అవుతుంది. కోర్టులు సామాజిక ఉద్యమాల పట్ల ఎప్పుడూ పెద్దగా సానుభూతి చూపలేదు, కాని ఇప్పుడు ఆ ధోరణి మరింత పెరిగింది. బలవంతంగా అమలు చేయించకపోయినా సరే, బంద్‌కు పిలుపు ఇవ్వడమే రాజ్యాంగ విరుద్ధమని కేరళ హైకోర్టు ఫుల్ బెంచ్ 'తీర్పు'[5] చెప్పడం ఒక పక్షపాత రాజకీయ దృష్టికోణాన్ని న్యాయ నిర్ణయంగా ఎలా చెల్లుబాటు చేయిస్తున్నారనే దానికి మంచి ఉదాహరణ. ఈ తీర్పు అపీల్‌కు సుప్రీంకోర్టుకు[6] వెళ్ళినపుడు దాన్ని లోతుగా పరిశీలించకుండా, కేరళ హైకోర్టు తీర్పు నుంచి రెండు పేరాలను మాత్రమే ఉటంకించి, అందులో తప్పు లేదని చెప్పింది. బాబులాల్ పరాతే, మధు లిమాయే, హిమ్మత్ లాల్ కేసుల్లో ఇదే కోర్టు వారి వాదనలతో ఏకీభవించకపోయినా, విషయాన్ని కనీసం లోతుగా పరిశీలించేందుకు చేసిన ప్రయత్నంతో పోల్చితే – పౌరహక్కుల పట్ల అత్యున్నత కోర్టు అభిప్రాయంలో ఎంత తీవ్రమైన మార్పు వచ్చిందో అర్థమవుతుంది. ఈ మొత్తం వివాదంలో జాతీయ ఉద్యమం ఆవిష్కరించిన ఒక అతి పెద్ద నిరసన పద్ధతిని, స్వాతంత్ర పోరాటంలో తరచూ వలస పాలకులకు వ్యతిరేకంగా ఉపయోగించిన పోరాట రూపాన్ని అత్యంత నిర్లక్ష్యంగా, స్వాతంత్ర్యం తర్వాత మన కోసం మనమే రాసుకున్న రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులను ఉల్లంఘించే చర్యగా ప్రకటించారు. హైకోర్టుకు గాని, సుప్రీంకోర్టుకు గాని ఇందులోని విరోధాభాసే అర్థం కాలేదు. రాజ్యాంగ స్వభావమూ, దాని చారిత్రక మూలాల గురించి న్యాయవ్యవస్థలో పని చేసే చాలామందికి ఎంత అజ్ఞానం ఉందో తెలియడానికి ఇదో ఉదాహరణ. అయితే దేశ ప్రజలు మాత్రం ఈ 'తీర్పుల'ను ఏ మాత్రం ఖాతరు చేయకుండా – చేయాల్సిన అవసరం లేదని గ్రహించి – యథావిధిగా బంద్‌లు జరుపుకుంటూ పోతున్నారనేది వేరే సంగతి.

నిరసన హక్కు విషయంలో రాజ్యాంగంలోని ఈ లోపం భవిష్యత్తులో మనకు తీవ్ర నష్టం కలగజేయబోతోంది. ఎందుకంటే భారతదేశం సంక్షేమ దేశంగా ఉండాలనే రాజ్యాంగ ఆదేశిక సూత్రం నుంచి రాజ్యం క్రమక్రమంగా వైదొలగుతోంది. ఒకప్పుడు రాజ్యాంగం మనది సంక్షేమ రాజ్యం అని చెప్పినట్లు వ్యాఖ్యానించిన సుప్రీంకోర్టు[7] ఇప్పుడేమో, రాజ్యం విధానపరంగా ఆ ఆదేశిక సూత్రం నుండి పక్కదారి పడితే కోర్టులు చేయగలిగేది ఏమీ లేదంటోంది. చూడబోతే సుప్రీంకోర్టు స్వాతంత్రోద్యమ ఆకాంక్షలను వారసత్వంగా పొందిన ఇప్పటి రాజకీయ పాలనా యంత్రాంగం ఆ వారసత్వాన్ని ఒక్కొక్కటిగా రద్దు చేసుకుంటూ పోతుంటే కోర్టులు చేయగలిగింది ఏమీ లేదని అది భావిస్తున్నట్టుంది. ఈ విషయంలో తాము జోక్యం చేసుకోవాలంటే తమకు సహాయపడగల ఒక వ్యవస్థ ఏదీ లేదని కూడ

అది భావిస్తున్నట్టు కనబడుతోంది.[8] అయితే రాజ్యం తన సంక్షేమ బాధ్యతలను నిరాకరించకుండా చూడాల్సిన సుప్రీంకోర్టు ఆ పని చేయకుండా ఊరుకోవడానికి కారణం కేవలం న్యాయపరమైన వినయం అంటే నమ్మడం కష్టం. ఎందుకంటే ఆ వినయం సుప్రీంకోర్టుకు మొదటినుండీ బాగా తక్కువే. అసలు నిజం ఏమిటంటే న్యాయవ్యవస్థ కూడ ఈ దేశ శిష్ట వర్గాలతో సమానంగా సంక్షేమం, సామాజిక న్యాయం దేశాభివృద్ధికి భారంగా మారాయని నమ్ముతోంది, వాటిని వదిలించుకోవాల్సిన సమయం వచ్చిందని భావిస్తోంది. ఈ భావనలో న్యాయపరమైన అంశం ఏమీ లేదు, ఇది పూర్తిగా రాజకీయ విశ్వాసమే.

పోరాడే హక్కుకు, నిరసన తెలిపే హక్కుకు రాజ్యాంగ భరోసా లేకపోవడమనేది ఎంత లోటో ఇప్పుడు మనకు ఇంకా బాగా తెలిసొస్తుంది. అయినా రాజకీయంగా రాజ్యాంగాన్ని సవరించో, తిరగరాసో ఆ హక్కును చేర్చే అవకాశం లేని అత్యంత బలహీన స్థితిలో మనం ఉన్నాం. కొత్త హక్కు సంగతలా ఉంచి, ప్రజాస్వామ్యం పట్ల ఏ మాత్రం గౌరవం లేని సంఘ్ పరివార్ వీధి సైన్యాలు రాజ్యాంగంలో ఇంకా మిగిలి ఉన్న ఆ పరిమిత హక్కులను సైతం కబళించకుండా కాపాడుకోవాల్సిన స్థితిలో ఉన్నాం. అయిష్టంగానైనా సరే మనం ఆ పనిలో నిమగ్నమై ఉంటూనే రాజ్యాంగాన్ని మరింత శక్తివంతమైన సాధనంగా మలిచేందుకు అవసరమైన సానుకూల మార్పులపై కూడ దృష్టి పెట్టడం మంచిది.

1. ఫ్రేమింగ్ ఆఫ్ ఇండియన్ కానిస్టిట్యూషన్: ఏ స్టడీ, బి. శివరావు, ఐ.ఐ.పి.ఏ,పే. 835
2. హిమ్మత్ లాల్ వర్సస్ పోలీస్ కమిషనర్, అహ్మదాబాద్, AIR 1973 SC 87
3. రొమేష్ థాపర్ వర్సస్ స్టేట్ ఆఫ్ మద్రాస్, (1950) S.C.R. 594.
4. మధు లిమాయే వర్సస్ ఎస్.డి.ఎమ్, మొంఘైర్ AIR 1971 SC 1762, మరియు బాబులాల్ పరాతే వర్సస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర, AIR 1961 SC 884. ఇవి రెండూ సెక్షన్ 144 సిఆర్.పి.సి గురించి మంచి ఉదాహరణలు.
5. భరత్ కుమార్ కె పలిచా వర్సస్ స్టేట్ ఆఫ్ కేరళ, AIR 1997 కేరళ 291
6. కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) వర్సస్ భరత్ కుమార్,1998 (1) (1) SCC 201
7. జస్టిస్ ఏ.పి. సేన్ ఇన్ భీమ్ సింగ్ వర్సస్ యూనియన్ ఆఫ్ ఇండియా, AIR 1981 SC 234
8. బాల్కో ఎంప్లాయిస్ వర్సస్ యూనియన్ ఆఫ్ ఇండియా, AIR 2002 SC 350

*Orginal title in English: The Constitution and Social Movements*

అనువాదం : వేమన వసంతలక్ష్మి

# ప్రపంచీకరణ – రాజ్యాంగం – కోర్టులు

జనవరి 2004; Forum Against Globalisation

ప్రపంచీకరణ ఒక విధానం మాత్రమే కాదు. అది ఒక ఆలోచనా సరళి. దానిని ఒక విధానంగా చూసినపుడు మనకు దాని వెనక ఉన్న శక్తులు, అంటే ప్రపంచ బ్యాంకు, ప్రపంచ వాణిజ్య సంస్థ, అమెరికా, బలమైన బహుళజాతి సంస్థలు, వాటితో కుమ్మక్కైన భారత పెట్టుబడిదారులు కనిపిస్తారు. కాని మనం దానిని ఒక ఆలోచనా సరళిగా చూసినప్పుడు సమానత్వాన్నీ, సంక్షేమాన్నీ, అణగారిన సమూహాల హక్కులనూ, సామాజిక బృందాల హక్కులనూ వ్యతిరేకించే ధోరణులు మన సమాజాలలో ఎలా పెరుగుతూ వస్తున్నాయో విశ్లేషించుకోవాల్సి ఉంటుంది. సామ్రాజ్యవాదానికి లేదా నయా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా గొంతెత్తి నినాదాలు ఇవ్వడంలో తలమునకలై ఉంటూ, మనం మన సమాజపు అంతఃపొరల్లో నానాటికీ పెరుగుతున్న క్రూరమైన కులీనతత్వాన్ని విస్మరించకూడదు. సామ్రాజ్యవాదం మనకు ప్రధానంగా ఒక బాహ్య శక్తిగా, మహా అయితే కొద్దిమంది స్థానికుల మద్దతు, సహకారం ఉన్న శక్తిగా కనిపిస్తుంది. అందువల్ల ఆ బాహ్య శత్రువును, తీవ్రస్థాయిలో వ్యతిరేకిస్తున్నప్పుడు తాత్కాలికంగా మన మనస్సులకు సౌఖ్యాన్నిచ్చే ఒక ఐక్యతా భావన కలుగుతుంది. అసలు కష్టం మన మధ్యన మనం చేసుకోవాల్సిన పోరాటంలోనే ఉంది.

అందుకనే హిందుత్వకు వ్యతిరేకంగా మనం చేస్తున్న పోరాటానికి మైనారిటీల హక్కుల పరిరక్షణకు మించిన ప్రాధాన్యం ఉంది. ఇవ్వాళ భారతదేశంలో పెరుగుతున్న తిరోగామి ఆలోచనలకు దృఢమైన తాత్విక పునాది వేసింది సంఘ్ పరివారపు హిందుత్వ భావజాలమే. ఆ భావజాలమే ఈ రోజు దేశ సామాజిక చైతన్యంలోకి వేగంగా ఇంకిపోయి ప్రపంచ బ్యాంకు, అమెరికా నిర్దేశిస్తున్న విధానాలను ఉత్సాహంగా స్వీకరించేలా చేస్తోంది. సులభంగా దేశంలోకి రావడానికి ఆ ప్రపంచ దోపిడీదార్లకు మార్గం సుగమం చేస్తోంది.

కర్కశమైన కార్పొరేట్ పెట్టుబడిదారీ విధానం ఇక్కడి అంతే కర్కశమైన ఆలోచనా విధానంతో చేతులు కలుపుతోంది. ప్రపంచీకరణ తీసుకొస్తున్న 'రాజకీయ ఆర్థిక మార్పుల' పైన మాత్రమే కేంద్రీకరించి చర్చించడం కాకుండా ఆ రెండింటి కలయిక రూపురేఖలు ఎలా ఉండబోతాయో, ఏమేం పరిణామాలను తీసుకురాగలదో వివరంగా పరిశీలించాల్సి ఉంటుంది.

మన దేశంలో చట్టమూ, కోర్టులూ చెప్పే మాటలకు ప్రజారంగంలో చాలా విలువ ఉంది. వారి అభిప్రాయాలు న్యాయబద్ధమైనవని ప్రజలు నమ్ముతారు. ఈ గౌరవం రీత్యా కోర్టులు తలుచుకుని ఉండి వుంటే, తిరోగామి ఆలోచనలకు వ్యతిరేకంగా సామాజిక చైతన్యాన్ని ఎంతగానో పెంచగలిగేవి. ఆ విధంగా సామాజిక, రాజకీయ విధాన నిర్ణయాలలో తిరోగామి ఆలోచనలది పైచేయి కాకుండా అడ్డుకోగలిగేవి. దీని అర్థం కోర్టులు తమ పరిధిని అతిక్రమించి ఆ పని చేయమని అనడం కాదు. ఇతరత్రా సరిగ్గా ఆలోచించగలిగిన వాళ్ళు కూడ కొన్నిసార్లు అనాలోచితంగా ఇలాంటి డిమాండ్లు చేస్తూ వుంటారు; అది చాలా ప్రమాదకరం. మనకున్న ఆధునిక వ్యవస్థలలో ప్రజాభిప్రాయానికి అతి తక్కువ జవాబుదారీతనం వహించే సంస్థలు కోర్టులే కాబట్టి వాటి విచక్షణకు ఎంత తక్కువ వదిలిపెడితే అంత మంచిది. ఇక్కడ చెప్పదలచిందేమిటంటే భారత రాజ్యాంగానికి తగిన రీతిలో కోర్టులు కనుక ఒక సమగ్రమైన వ్యాఖ్యాన చట్రాన్ని అభివృద్ధి చేసి ఉంటే, పాలకులు ఎవరైనప్పటికీ, వారిని సమానత్వం, సంక్షేమం విలువల మీద ఆధారపడి పరిపాలించేలా కట్టడి చేయగలిగేవి. ఆ దిశగా ఒక సామాజిక ఆర్థిక విధానాన్ని రూపొందించడానికి అవసరమైన పాజిటివ్ విలువలు రాజ్యాంగంలో ఉన్నాయి కాబట్టి కోర్టులు ఆ పని చేయగలిగేవి. ప్రజలు తిరోగామి భావజాలాలను తిరస్కరించడానికి సహాయపడి ఒక ప్రయోజనకరమైన పాత్రను నిర్వహించడంతో పాటు, ప్రపంచీకరణను దేశానికి ఒక విధాన ప్రత్యామ్నాయంగా చాలా సులువుగా చలామణీ చేస్తున్న మన ప్రభుత్వ విధానాలను అడ్డుకోగలిగి కూడ ఉండేవి.

కాని కోర్టులు అటువంటి పాత్రను నిర్వహించలేదు. అందుకు భిన్నంగా తిరోగామి విధానాలకు న్యాయబద్ధతను కల్పించడంలో అవి తరచుగా ముందుండడం చూస్తున్నాం. ఇదేం యాదృచ్ఛికం కాదు. కోర్టులు కూడ ఈ సమాజంలో భాగమే, దానికి అతీతమైనవేమీ కాదు. అయితే ఈమాట చెప్పి ఆగిపోకూడదు. రాడికల్ విశ్లేషణలు తరచుగా ఆ పని చేస్తాయి. రాజ్యాంగంలోని పాజిటివ్ విలువలను నిలబెట్టడానికి కోర్టులు తమ వంతు

పాత్రను నిర్వహించాలని మనం కోరుతున్నామంటే దయాధర్మంగా మన కోసం ఏదో చేయమని అడుగుతున్నామని కాదు. గతకాలపు పోరాటాలు, సంస్కరణలు సాధించిన సత్ఫలితాలను కాపాడమని మాత్రమే మనం కోర్టులను కోరుతున్నాము. అది సమాజాన్ని తీర్చిదిద్దడానికి, దిశా నిర్దేశం చేయడానికి అధికారం లభించిన వారి నైతిక బాధ్యత. వారు గత విజయాలను కాపాడాల్సిన సమాజ ధర్మకర్తలు. చిత్తశుద్ధితో వాటిని కాపాడి భవిష్యత్తుకు అందించాల్సిన బాధ్యత వారిదే. తమ ఇష్టానుసారం చేయడానికి ఇది వాళ్ళ వ్యక్తిగత వ్యవహారం కాదు. దురదృష్టవశాత్తూ రాడికల్, ప్రగతిశీల ఆలోచనాధారలో నైతికతకి ప్రాధాన్యత లేకపోవడం వలన (నైతికతని రాడికల్, ప్రగతిశీల ఆలోచనాధార నయా కాంటియన్ దాడిగా కొట్టిపడేస్తుంది) ఈ నైతిక ద్రోహాన్ని ప్రశ్నించే వారే లేకుండా పోయారు. పైపెచ్చు ఈ బాధ్యతారాహిత్యాన్ని అనుల్లంఘనీయమైన వర్గ ప్రయోజనాలకు అనివార్యంగా లోబడిపోవడంగా కుదించి ఊరుకుంటారు.

భారతదేశంలో కోర్టులు ప్రగతిశీల దృక్పథంతో వ్యవహరించిన సందర్భాలలో సైతం రాజ్యాంగ రచనలో ఇమిడి ఉన్న ఆకాంక్షలకు అనుగుణమైన న్యాయసిద్ధాంతాన్ని (జ్యూరిస్ ప్రుడెన్స్) రూపొందించకుండానే ఆ పని చేశారు. ఉదాహరణకు భూసంస్కరణలకు సుప్రీంకోర్టు ఆమోదం తెలిపినపుడు, భారత రాజ్యాంగపు ఆదేశిక సూత్రాలలోని ఆర్టికల్ 39 (బి) ఆధారంగా వాటిని సమర్థించడానికి అవకాశం ఉన్నా దాని బదులు ఎమినెంట్ డొమైన్ అనే మధ్యయుగాల ఇంగ్లీషు భావన మీద ఆధారపడి సమర్థించింది. ప్రైవేటు వ్యక్తుల భూమిపైన కూడ ప్రభుత్వానికి అధికారం ఉంటుందని, ప్రజాప్రయోజనాల పేరు మీద సర్వసత్తాక ప్రభుత్వం ఎవరి భూమినైనా స్వాధీనం చేసుకోవచ్చని చెప్పే సూత్రం 39(బి). అందరి శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని దేశంలోని వనరుల యాజమాన్యమూ, నిర్వహణా సాగాలని చెబుతుంది. కాని సుప్రీంకోర్టు దీని ప్రకారం తీర్పు చెప్పలేదు. ఎమినెంట్ డొమైన్ అన్న భావన ఇప్పటికే ఆదివాసుల జీవనోపాధి హక్కును కాలరాసింది. సర్వసత్తాక ప్రభుత్వం నిర్ణయించిన 'ప్రజా' ప్రయోజనాల కోసం వారు నివసించే ప్రాంతాలను ఇతరుల కోసం 'రిజర్వు' ప్రాంతాలుగా ప్రకటించింది. మరో సందర్భంలో కూడ సుప్రీంకోర్టు అలాంటి పనే ఒకటి చేసింది. ప్రజలకు జీవనాధారంగా ఉన్న కొన్ని సహజ వనరులను ప్రభుత్వం ప్రైవేటు వారికి అప్పగించకుండా నిరోధించడం కోసం సుప్రీంకోర్టు అంతే పురాతనమైన ఒక భావన మీద ఆధారపడింది. అది 'పబ్లిక్ ట్రస్ట్ డాక్ట్రిన్ ఆఫ్ రోమన్ లా' అనే సిద్ధాంతం. ఆదేశిక సూత్రాలలోని 'తగినంత జీవనాధారాన్ని కలిగి ఉండే' హక్కు (ఆర్టికల్ 39 ఎ) వెలుగులో జీవించే హక్కు (ఆర్టికల్ 21) ను వర్తింపజేయకుండా

రోమన్ న్యాయ సిద్ధాంతం మీద ఆధారపడి తీర్పు చెప్పింది. (కమల్ నాథ్ మోటెల్ కేసులో న్యాయమూర్తి కుల్దీప్ సింగ్ ఇచ్చిన తీర్పు. మోటెల్ నిర్మాణానికి వీలుగా బియాస్ నది దిశను మళ్లించాలని ప్రయత్నించిన మంత్రి అతను. ఆ ప్రయత్నాలను ఈ తీర్పు అడ్డుకుంది).[1]

ఇక్కడ, రెండు విషయాలలో నన్ను పొరపాటుగా అర్థం చేసుకోకూడదని కోరుకుంటున్నాను. అన్ని విదేశీ న్యాయ సూత్రాలు చెడ్డవని నేననడం లేదు. రాజ్యాంగ ప్రవేశికని గానీ, రాజ్యాంగంలోని (ఆదేశిక సూత్రాలను పొందుపరచిన) నాలుగో భాగాన్ని గానీ కోర్టులు ఎన్నడూ పరిగణనలోకి తీసుకోలేదని నేననడం లేదు. మొదటి విషయానికి సంబంధించి – అందరికీ వర్తించే మానవ నాగరికత అనేది ఒకటి ఉందనీ, అది ఆయా ప్రత్యేక నాగరికతలకు మించినదనీ, అది తన విలువలను వివిధ మూలాల నుంచి గ్రహిస్తుందనీ నేను నమ్ముతాను. వినూత్న సందర్భాలకు తగినట్లుగా ఈ విలువలను మనం వ్యాఖ్యానించుకోవడమే కాదు, విభిన్న సందర్భాలకు అన్వయించే క్రమంలో వాటిని పునర్వ్యాఖ్యానిస్తూ కూడ ఉంటాము. ఆ క్రమంలో అవి మరింత పరిపుష్టమౌతాయి. 'విదేశీ', 'భారతీయం' అనే పేర్లతో వాటిని విభజించడమనేది అచారిత్రకమే కాక నాగరికత భావనకే తీవ్ర నష్టదాయకం. న్యాయానికి మూలాధారాలుగా మన కోర్టులు అర్థం చేసుకున్న వాటి వెనక ఉన్న భావనలను మాత్రమే నేను వ్యతిరేకిస్తున్నాను. ప్రాచీన రోమన్ న్యాయ వ్యవస్థలను న్యాయానికి ఆధారాలుగా స్వీకరించగలిగినపుడు, సమకాలీన ఆదివాసీ సముదాయాల ఆచారాలను కూడ న్యాయానికి ఆధారాలుగా ఎందుకు స్వీకరించకూడదు? మన అన్వయ, వ్యాఖ్యానాలకు ఆంగ్లో– శాక్సన్ న్యాయసూత్రాలను ఆధారాలుగా స్వీకరించగలిగినపుడు, భారత స్వాతంత్ర్య పోరాటం, దానికి సమాంతరంగా నడిచిన సామాజిక పోరాటాలు/ సంస్కరణోద్యమాల నుండి పుట్టిన ఆకాంక్షలతో రూపొందిన విలువల చట్రాన్ని మాత్రం ఎందుకు ఆధారంగా తీసుకోకూడదు? రాజ్యాంగ ప్రవేశికలోనూ, ఆదేశిక సూత్రాలలోనూ ఈ విలువలే కొంతవరకూ ప్రతిఫలించాయి.

రెండవ అంశానికి వస్తే, కాస్త ఆలస్యంగానే అయినా రాజ్యాంగ ప్రవేశికనీ, ఆదేశిక సూత్రాలనూ కూడ న్యాయ వ్యాఖ్యానాలకు ఆధారంగా తీసుకోవచ్చుననే అభిప్రాయానికి భారతీయ న్యాయస్థానాలు వచ్చిన మాట వాస్తవమే. అయితే ఆ విషయాన్ని వాళ్ళు ఎక్కడా స్పష్టంగా చెప్పలేదు. అంతే కాదు, ఈ సూత్రాల అన్వయింపును వారు ఒక క్రమంలో కూడ అభివృద్ధి చేయలేదు. భారతీయ న్యాయ శాస్త్ర సిద్ధాంత (Jurisprudence)

ప్రధాన స్రవంతిలోని మితవాద విభాగం ఇప్పటికే చాలా బలపడింది. ఈ మాట అనొచ్చో లేదో కాని ప్రస్తుతం కోర్టు గదులలో నుంచి పొంగి పొర్లుతున్న తీర్పులతో అది రోజురోజుకీ మరింత బలపడుతూ కూడ ఉంది. కాస్త అప్రమత్తంగా మెలుగుతూ వామపక్ష ఉదారవాద విభాగం కూడ అంతే అభివృద్ధి చెందింది. మితవాద స్రవంతితో కొంత ఘర్షణ పడుతున్నా దానితో సమాంతరంగా కొనసాగుతోంది. గజేంద్ర గడ్కర్ ఈ వామపక్ష ఉదారవాద స్రవంతికి అత్యుత్తమమైన ప్రతినిధి. వి. ఆర్. కృష్ణయ్యర్, పి. ఎన్. భగవతి వంటివారు గత శతాబ్దపు 70, 80 దశకాలలో విప్లవాత్మక వ్యాఖ్యానాలు చేయాలని ప్రయత్నించారు కాని అవన్నీ అడపా, దడపా జరిగిన (hit and run) ప్రయత్నాలుగా మిగిలాయి తప్ప న్యాయశాస్త్ర సిద్ధాంత ప్రధాన స్రవంతిలోకి ఎన్నడూ చొచ్చుకుపోలేకపోయాయి. ఆ ప్రయత్నాలు కొద్దికాలం పాటు మాత్రమే జరగడం ఒక కారణమైతే, అతి కొద్దిమంది న్యాయమూర్తులు మాత్రమే అందుకు ప్రయత్నించడం మరొక కారణం. కానీ క్షమార్హం కాని మూడో కారణం మాత్రం వాటిలో తాత్విక గాఢత లోపించడం.

వి.ఆర్. కృష్ణయ్యర్ ఈ విప్లవాత్మక వ్యాఖ్యాన కృషిలో బాగా గుర్తింపు పొందిన న్యాయమూర్తి. భారతదేశంలో చట్టాన్ని మరింత మానవీయమైనదిగా (ప్రత్యేకించి శ్రామిక చట్టాలు, కారాగార చట్టాలు) రూపొందించడానికి కృషి చేసిన వాడిగా ఆయనను ఎంతో గౌరవిస్తారు. ఆ గౌరవం న్యాయమైంది కూడ. ఆయన గురించి న్యాయశాస్త్ర వాద, వివాదాలలో మునిగితేలే మనిషి అని గానీ, అధ్యయనం లేని వ్యక్తి అని గానీ పొరపాటున కూడ ఎవ్వరూ అనలేరు. అయినా, ఆయన తీర్పుల నుంచి, రచనల నుంచి ఒక న్యాయ సిద్ధాంతాన్ని లేదా తాత్వికతను మనం రాబట్టుకోలేము. కనీసం ప్రస్తుత న్యాయవ్యవస్థ పరిధులలో ఎటువంటి న్యాయశాస్త్ర సిద్ధాంతాన్నీ లేదా తాత్వికతనూ రూపొందించడం సాధ్యం కాదనే దృక్పథం కూడ ఆయన రచనలలో కనిపించదు. రాడికల్ ఆలోచనాపరులెవరైనా అటువంటి వైఖరిని తీసుకునే అవకాశం ఉంది.

ఆ ప్రయత్నాలు జరిగిన స్వల్ప కాలంలో చట్టానికి వాళ్ళు ఇచ్చిన కొద్దిపాటి విప్లవాత్మక వ్యాఖ్యానాలను కూడ కోర్టులు గత పది సంవత్సరాలలో మెల్ల మెల్లగా తొలగిస్తూ వస్తున్నాయి. ఇప్పటి తరం న్యాయమూర్తులకు వామపక్ష ఉదారవాద స్రవంతికి చెందిన కొందరు వ్యక్తులపై ఉన్న గౌరవం సడలిపోయాక, వామపక్ష ఉదారవాద వ్యాఖ్యానానికి కూడ కాలం చెల్లిపోవచ్చు. మనం తరచూ ప్రజల ప్రయోజనాలకు ప్రధాన శత్రువులు రాజకీయ నాయకులేనని నిందిస్తూ ఉంటాము. కాని చట్ట సభలలో కూర్చుని చట్టాలు రూపొందించే

అధికారం ఉన్నప్పటికీ గత దశాబ్ద కాలంలో ప్రపంచ పెట్టుబడి ప్రయోజనాల కోసం రాజకీయ నాయకులు మార్చిన చట్టాలు మాత్రం చాలా తక్కువే. అదెలా ఉన్నా రాజకీయ నాయకులకు ఓట్లు అవసరం, మీడియాలో ఎప్పుడూ కనిపిస్తుంటారు కాబట్టి ప్రజల కళ్లెప్పుడూ వాళ్ళ మీద ఉంటాయి. పైగా రాజకీయ నాయకులకూ, వాళ్ళు చేసే చట్టాలకూ వ్యతిరేకంగా ధర్నా చేయడానికి ఎవరూ ఒక్క క్షణం కూడ తటపటాయించరు. ఈ మూడు విషయాలలోనూ పూర్తి రక్షణ ఉన్న న్యాయస్థానాలే నిజానికి చట్టాలను వెనక్కి తీసుకోవడంలో ముందు ఉంటున్నాయి. చట్టం అంటే కేవలం చట్ట సభలలో రూపొందించేదే కాదు, కోర్టులు దాన్ని వ్యాఖ్యానించే తీరు కూడ చట్టమే అనే విషయం చాలామంది గ్రహించరు. మొదటి దాని కంటే రెండవదే ఇవ్వాళ చట్టాన్ని వేగంగా వెనక్కి తీసుకెళుతోంది. ఈ ధోరణిని వ్యతిరేకిస్తున్న గొంతులు లేనే లేవని గానీ, ఈ తిరోగమనం అంతటా ఒకే రీతిలో జరుగుతోందని గానీ దీనర్థం కాదు. ఇది అంత సరళమైన విషయం కాదు. అయితే, తిరోగమనం ఒక ధోరణిగా మొదలయింది. రాబోయే రోజులలో అది మరింత వేగాన్ని పుంజుకోవచ్చు.

నిర్దేశిత రంగాలలో కాంట్రాక్టు కార్మికులను నియమించడాన్ని నిషేధించే అధికారం ప్రభుత్వానికి ఎప్పటినుంచో ఉంది. కాంట్రాక్టు లేబర్ చట్టం (నియంత్రణ మరియు రద్దు) లోని సెక్షన్ 10(1) ప్రభుత్వానికి ఆ అధికారాన్ని కల్పించింది. ఇప్పుడు ఈ అధికారాన్ని ఎత్తివేయాలని రెండవ లేబర్ కమిషన్ ప్రతిపాదించడంతో కార్మిక సంఘాలు దానిపై ఆందోళన చేస్తున్నాయి. పార్లమెంటు ఇంకా దానిని ఎత్తివేయలేదు కాని ఒక రాష్ట్ర శాసనసభ మాత్రం రాష్ట్రస్థాయి సవరణను తీసుకొచ్చి ఆ పని చేసింది. అది మరెవరో కాదు, ప్రపంచబ్యాంకుకు అత్యంత ప్రీతిపాత్రురాలైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం. కాని ఐదుగురు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఏకగ్రీవంగా ఆ చట్టంలోని అంశాలను ఎలా వ్యాఖ్యానించారంటే[2] అందులోని సెక్షన్ 10(1) ని ఇప్పుడు దాదాపు ఎత్తివేసినట్లే. ఈ పనిని వాళ్ళు రెండు విధాలుగా చేశారు. మొదటిది కాంట్రాక్టు కార్మికుల నియామకాన్ని నిషేధించేందుకు అనుసరించాల్సిన పద్ధతిపై వాళ్ళు చేసిన వ్యాఖ్యానం ద్వారా. దాని వల్ల నిషేధించడం అన్నది ఆచరణలో సాధ్యం కాకుండా చేశారు. రెండవది, నిషేధం కొనసాగడం వల్ల కార్మికులకు ఎలాంటి ప్రయోజనమూ లేకుండా చేయడం ద్వారా. కాంట్రాక్టు కార్మికుల నియామకంపై నిషేధం ఉన్నప్పటికీ, ఒకవేళ కాంట్రాక్టరు కాంట్రాక్టు కార్మికులతో పని చేయించుకుంటూ ఉంటే, వాళ్ళని రెగ్యులర్ ఉద్యోగులుగా మార్చడం కుదరదని కోర్టు ప్రకటించింది. దాంతో నిషేధాన్ని కొనసాగిస్తే వారి పరిస్థితి మరింత హీనంగా

తయారవుతుంది. నిషేధించడం వలన వాళ్ళు కాంట్రాక్టు కార్మికులూ కాకుండా పోతారు, రెగ్యులర్ ఉద్యోగులు కారని సుప్రీంకోర్టు చెప్పింది గనక వాళ్ళను రెగ్యులర్ ఉద్యోగులుగా పేర్కొనడమూ కుదరదు.

సమాన పనికి సమాన వేతనం అనే సూత్రాన్ని చట్టం ముందు అందరూ సమానులే అనే ప్రాథమిక హక్కులో భాగంగా చూడాలని జస్టిస్ ఒ. చిన్నప్పరెడ్డి[3] గతంలో తీర్పు చెప్పారు. ప్రాథమిక హక్కులనూ, ఆదేశిక సూత్రాలనూ కలిపి చూడాలనే విశాల దృక్పథం ఉన్న కాలంలో చెప్పిన తీర్పు అది. పోలీసు శాఖలో డ్రైవరుగా పనిచేస్తున్న ఉద్యోగి ఒకరు తనకు కానిస్టేబుల్ జీతానికి బదులు ప్రభుత్వ సర్వీసులోని డ్రైవర్లకు ఇచ్చే స్కేలు ప్రకారం జీతం చెల్లించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశాడు. అతను డ్రైవరుగా పని చేస్తున్నప్పటికీ, అతని నియామకం పోలీసు కానిస్టేబుల్‌గా జరిగింది గనక కానిస్టేబుల్‌గానే పరిగణించి వేతనం చెల్లిస్తామని ప్రభుత్వం వాదించింది. అతని ఉద్యోగానికి ఏ పేరు పెట్టినప్పటికీ అతను పని చేస్తున్నది డ్రైవరుగా కాబట్టి అతనికి ఇతర ప్రభుత్వ శాఖలలో డ్రైవర్లకు చెల్లిస్తున్న స్కేలు ప్రకారమే వేతనం చెల్లించాలని చిన్నప్పరెడ్డి తీర్పు చెప్పారు. ఆదేశిక సూత్రాలలోని 39 (డి) ఆర్టికల్ వెలుగులో ఆర్టికల్ 14 (ప్రాథమిక హక్కులు) ను అర్థం చేసుకున్నపుడు సమాన పనికి సమాన వేతనం అన్నది ప్రాథమిక హక్కు అవుతుందని చిన్నప్పరెడ్డి వ్యాఖ్యానించారు. చట్టసవరణ ద్వారా దానిని ఎత్తివేయాలని పార్లమెంట్ ఎన్నడూ ప్రయత్నించలేదు కాని సుప్రీంకోర్టే దానిని నీరుగార్చింది. చిన్నప్పరెడ్డి తీర్పును తోసిరాజనకుండానే ఇంచుమించు తీసిపడేసింది. ఆ తర్వాత న్యాయమూర్తి వి.సుజాతా మనోహర్ ఇచ్చిన తీర్పుతో[4] అది చావుదెబ్బ తింది. (సుజాతా మనోహర్ ఆ తర్వాత జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలిగా కూడ ఎంపికయ్యారు). సమాన పనికి సమాన వేతనం అన్నది ఒక హక్కే అయినప్పటికీ, 'వేర్వేరు సంస్థలలో వేర్వేరు వ్యక్తులు చేసే పనిని పోల్చి చూడడంలో అనేక సమస్యలు ఉన్నాయి కాబట్టి ఆ సూత్రాన్ని అన్వయించడం అంత తేలిక కాద'ని సుజాతా మనోహర్ తన తీర్పులో వ్యాఖ్యానించారు. ఉద్యోగార్హతలలో తేడాలు ఉండవచ్చు, పని స్వభావంలో తేడాలు ఉండవచ్చు, 'సమర్థవంతంగా ఉద్యోగ విధుల్ని నిర్వహించడం మీద ప్రభావం చూపే మరెన్నో అంశాలు' ఉండవచ్చు. అందుకని ఆ పనిని 'అంచనా వేసి, నిర్ధారించే బాధ్యతను ఒక నిపుణుల బృందానికి వదిలివేయడమే ఉత్తమం' అని చెప్పారామె. ఆ నిపుణుల బృందాన్ని సహజంగా యాజమాన్యమే ఏర్పాటు చేస్తుంది. దీని అర్థం సమాన పనికి సమాన వేతనం కోరుతూ ఒక కేసు కోర్టుకు వెళితే, ఇవాళ్టి న్యాయం ప్రకారం, ఆ కేసు గెలిచే అవకాశాలు అతి

తక్కువ. కానీ, ఆ సూత్రం మాత్రం కాగితం మీద అలానే వుంది. ఒక పోలీసు ఇన్‌స్పెక్టర్ జీపు డ్రైవరు చేసే పనీ, ఒక తహశీల్దార్ జీపు డ్రైవర్ చేసే పనీ ఖచ్చితంగా ఒకటి కాదు గనక ఒ. చిన్నప్పరెడ్డి ప్రకటించిన అభిప్రాయం తప్పు అని సూటిగా చెప్పి వుంటే మరింత నిజాయితీగా ఉండేది. అదెలా ఉన్నా, వారిద్దరి పని ఒకటేనో కాదో కోర్టు అయితే తేల్చలేదు కదా! అలాంటపుడు అందరు ప్రభుత్వ జీపు డ్రైవర్లకూ ఒకే రకమైన వేతనం ఎందుకు చెల్లించాలి?

ఎ. ఎస్. ఆనంద్ ప్రస్తుతం జాతీయ మానవ హక్కుల సంఘానికి అధ్యక్షుడు. మరొక గణనీయమైన తిరోగామి తీర్పుకు ఆయనే కర్త. ఈసారి వి.ఆర్. కృష్ణయ్యర్ రిజర్వేషన్ల అంశంపైన ఇచ్చిన తీర్పుకు ఆ గతి పట్టింది. సామాజికంగానూ, విద్యాపరంగానూ వెనకబడి ఉన్నట్టు ఒక బృందం లేదా సముదాయం నిరూపించగలిగితే, ఆ సముదాయం రిజర్వేషన్లను ఒక హక్కుగా కోరవచ్చునని కృష్ణయ్యర్ తీర్పు[5] ఇచ్చారు. ఈ తీర్పు కోసం – ప్రజా ప్రయోజనాల కోసం ఒక అధికారాన్ని అప్పగిస్తే, ఆ అధికారం వెంట ఒక బాధ్యత కూడ ఉంటుందని అడ్మినిస్ట్రేటివ్ లా లో ఎప్పటినుండో అమలులో ఉన్న ఒక న్యాయసూత్రం మీద కృష్ణయ్యర్ ఆధారపడ్డారు. రిజర్వేషన్లు అనేవి ప్రజాప్రయోజనం కోసం ఉద్దేశించినవి కాబట్టి ఒక ప్రజా సముదాయం సామాజికంగానూ, విద్యాపరంగానూ వెనుకబడి ఉందని నిరూపణ అయితే రిజర్వేషన్ కల్పించే అధికారం ఉన్నవాళ్ళు ఆ బాధ్యతను నెరవేర్చాల్సి ఉంటుందని కృష్ణయ్యర్ తీర్పు చెప్పారు. కాని ఆ తర్వాత ఈ అంశంపై ఏర్పడ్డ విస్తృత ధర్మాసనంలో ముఖ్య న్యాయమూర్తిగా ఉన్న ఎ.ఎస్. ఆనంద్[6] ఈ సూత్రం గురించి ఒక్క ముక్క మాట్లాడలేదు, మాట్లాడలేదు కూడ. రిజర్వేషన్లను ఒక హక్కుగా కోరవచ్చునని కృష్ణయ్యర్ చెప్పడం తప్పని మాత్రం ప్రకటించేశారు. ఒక సముదాయం ఎంతగా వెనుకబడి ఉన్నప్పటికీ, ఆ విషయం అందరికీ స్పష్టంగా తెలుస్తూ ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఇవ్వాలనుకున్నపుడు మాత్రమే దానికి ఆ ప్రత్యేక సౌకర్యం లభిస్తుందనీ, దాన్ని ఒక హక్కుగా వాళ్ళు కోరడానికి వీల్లేదనీ ఆనంద్ తీర్పు చెప్పారు.

కోర్టులు 1990 దాకా ఒక న్యాయాన్ని పాటించాయి. ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తికి లేదా వ్యక్తులకు ఇచ్చేటపుడు, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు మేలు చేకూర్చే సందర్భాలలో తప్ప, మిగతా అన్ని సందర్భాలలోనూ ప్రభుత్వం వాటిని వీలైనంత ఎక్కువ ధరకు అమ్మాలని కోర్టులు భావించాయి. ప్రభుత్వ ఆస్తులను అమ్మేటప్పుడు బహిరంగ వేలమే తగిన పద్ధతని కోర్టులు భావించాయి. ఆసక్తి వున్న వారందరికీ వేలంలో పాల్గొనే అవకాశం లభించాలని మాత్రమే కాక, వేలం ద్వారానే ప్రభుత్వానికి మంచి ధర లభిస్తుందని

కోర్టులు భావించాయి. ప్రజల ఆస్తులను చవకగా కొనుక్కుని ప్రైవేటు వ్యక్తులు లాభపడకూడదన్నది దీని వెనుక ఉన్న ఆలోచన.

బాల్కో ప్రైవేటీకరణ కేసు[7]లో బాల్కో ఉద్యోగుల సంఘం సరిగ్గా ఈ విషయంపైనే తన అభ్యంతరాన్ని వ్యక్తం చేసింది. కంపెనీ ఆస్తులను సరిగ్గా లెక్కగట్టలేదనీ, ప్రైవేటు సంస్థలకు చవకగా అప్పగించేస్తున్నారనీ వారు కోర్టుకు వెళ్ళారు. బాల్కో ఆస్తులను బహిరంగంగానే వేలం వేసి, అందులో ఎక్కువ ధర పేర్కొన్నవారికే దానిని అప్పగించారు కాని, మూల ధరని అతి తక్కువగా నిర్ణయించారు. వెల కట్టేటపుడు చట్ట ప్రకారం వ్యవహరించారా లేదా అన్నదాన్ని తప్ప, వెల కరెక్టుగా కట్టారా లేదా అన్న అంశాన్ని తాము పరిశీలించబోమని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. వేలం చట్టప్రకారం జరిగి ఉంటే, ప్రభుత్వ రంగ ఆస్తులను ప్రైవేటు సంస్థలకు కారుచవకగా కట్టబెడుతున్నారనే ఫిర్యాదులను కోర్టులు స్వీకరించవని ఆనాటి భారత ప్రధాన న్యాయమూర్తి బి.ఎన్. కిర్పాల్ పేర్కొన్నారు. బాల్కోను అత్యంత చవకగా అమ్మేశారనేది బహిరంగ సత్యం. కంపెనీ విలువను లెక్కగట్టడానికి వారు ఉపయోగించిన పద్ధతి (బుక్ వాల్యూ మెథడ్) రేపు ఇతర సంస్థలను కూడ అంతే కారుచవకగా అమ్మేయడానికి దారితీస్తుంది. (ఒక సంస్థ విలువను లెక్కగట్టడానికి దాని ఆస్తుల విలువను తీసుకుని, అందులోంచి అప్పులను తీసేసే పద్ధతినే బుక్ వాల్యూ మెథడ్ అంటారు. సాధారణంగా మార్కెట్ విలువ దీని కంటే ఎక్కువగా ఉంటుంది. సంస్థ భవిష్యత్తులో సాధించే అభివృద్ధి, దాని మేధో సంపత్తి, మానవ వనరులు ఇలాంటి అంశాలను బుక్ వాల్యూ మెథడ్ పరిగణనలోకి తీసుకోదు – అను). బాల్కో కేసు విషయంలో ఇచ్చిన ఈ తీర్పు, ప్రభుత్వరంగ సంస్థలలో పెట్టుబడుల ఉపసంహరణ విషయంలో ముందుముందు రాబోయే కేసులన్నిటిలోనూ న్యాయపరమైన జోక్యానికి అవకాశాలను మూసివేసింది. భారత ప్రభుత్వం ఈ తీర్పును చూసి హాయిగా ఊపిరి పీల్చుకుని ఉండాలి. ప్రభుత్వరంగ సంస్థలను వీలైనంత త్వరగా వదిలించుకోవాలనేది దాని ఆలోచన. ఎంత చవకగా అయినా అమ్మేయడానికి వాళ్ళు సిద్ధంగా ఉన్నారు. కొనుక్కున్న వాళ్ళు ఆ సంస్థల స్థలాన్ని రియల్ ఎస్టేట్ గానూ, మిగిలిన సామాగ్రిని తుక్కుగానూ అమ్మి బాగానే లాభపడుతున్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు ఈ విషయం తెలియదని నమ్మడం కష్టం. వారికి తెలుసు, అయినా వాళ్ళకేం బాధ లేదు. ఎందుకంటే ప్రభుత్వ రంగ సంస్థలను వీలయినంత త్వరగా చెత్తబుట్టలోకి విసిరేయాలనే ఆలోచనా ధోరణికి వాళ్ళూ క్రమక్రమంగా దగ్గరవుతున్నారు కదా!

వాస్తవంలో నయా ఉదారవాదం, ప్రపంచీకరణ క్రమాన్ని కోర్టులు రాజ్యాంగం సూచించిన ఆదేశిక సూత్రాల వెలుగులో నిలువరించగలుగుతాయనే ఆశలను ఈ తీర్పులు వమ్ముచేశాయి. బాల్కో, నర్మదా బచావో ఆందోళన్[8] రెండు కేసులలోను సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులు ఇదే విషయాన్ని స్పష్టం చేశాయి. (రెండిట్లోనూ తీర్పు చెప్పిన న్యాయమూర్తి ఒక్కరే – బి.ఎన్. కిర్పాల్.) దేశం అనుసరించాల్సిన విధానాలను కోర్టులు నిర్ణయించాలనేమీ అనడం లేదన్న విషయం మరోసారి గుర్తు చేస్తున్నాను. ఎలాంటి ఎన్నికల ప్రక్రియలోనూ ఎన్నిక కాకుండా నియమితులయ్యే జడ్జిల వంటి కులీన శ్రేణి చేతికి విధాన నిర్ణయాధికారాన్ని కట్టబెట్టడం కంటే ప్రమాదకరమైన విషయం మరొకటి లేదు. మనం వాళ్ళను అడుగుతుందల్లా రాజ్యాంగానికి అనుగుణంగా తమ విధులను నిర్వర్తించమని మాత్రమే; ఎందుకంటే కొన్ని భాగాలలోనైనా ప్రజాస్వామిక ఆకాంక్షలను ప్రతిఫలించే రాజ్యాంగం మనకు ఉంది కాబట్టి.

ఎవరో ఒకరి చట్టబద్ధ హక్కులు లేదా రాజ్యాంగబద్ధ హక్కుల ఉల్లంఘన జరగనట్లయితే, ప్రభుత్వ విధానాల మంచిచెడులను కోర్టులు పరిశీలించబోవని న్యాయమూర్తులు ప్రకటించడం విచిత్రంగా ఉంది. బాల్కో కేసు విషయంలో వాళ్ళు ఇదే మాట అన్నారు. రాజ్యాంగంలో హక్కులు, అధికారం గురించి తప్ప ప్రభుత్వ విధానాల గురించి ఏమీ లేదన్నట్టు ఈ న్యాయమూర్తులు మాట్లాడుతున్నారు. రాజ్యాంగంలోని నాలుగవ భాగంలో పేర్కొన్న ఆదేశిక సూత్రాలు 'దేశ పరిపాలనకు ఆధారభూతమైనవ'ని ఆర్టికల్ 37 స్పష్టంగా చెబుతున్నది. అంటే దేశ పరిపాలనకు అనుసరించవలసిన రాజ్యాంగ విధాన చట్రాన్ని ఆదేశిక సూత్రాల నుండి తీసుకోవాలని చెప్పడమే దీనర్థం. అయితే ఆదేశిక సూత్రాలు కోర్టుకెళ్ళి అమలు చేయించుకునేవి కావని అదే ఆర్టికల్ 37 చెబుతుంది. దానర్థం ఆదేశిక సూత్రాలను అమలు చేయాలని కోర్టులు ప్రభుత్వాన్ని ఆదేశించలేవని మాత్రమే; ఆదేశిక సూత్రాలకు విరుద్ధమైన దిశలో ప్రభుత్వం నడుస్తుంటే కోర్టులు దానిని నిలువరించలేవని కాదు. ఈ దృష్టి నుండి చూసి ఉంటే భారత రాజ్యాంగానికి అనుగుణమైన న్యాయ సిద్ధాంతాన్ని రూపొందించే ఒక దృక్పథాన్ని వారు అందించగలిగేవారు. రాజ్యాంగ ప్రవేశికలోనూ, నాలుగో భాగంలోనూ పేర్కొన్న లక్ష్యాలు, ఆదర్శాలను సాధించే దిశలో ప్రభుత్వాన్ని నడిపించగలిగేవారు. దాని వ్యతిరేక దిశలో ప్రయాణాన్ని అడ్డుకునే విధంగా వారు ఒక న్యాయ సిద్ధాంతాన్ని అభివృద్ధి చేయగలిగేవారు. దానికి పై వైఖరి ఒక కేంద్ర బిందువుగా పనిచేసేది. ఆ పని చేయడానికి బదులు, వారు బలహీనమైన ప్రత్యామ్నాయాన్ని ఎంచుకున్నారు. ఆదేశిక సూత్రాల వెలుగులో ప్రాథమిక హక్కులను వ్యాఖ్యానించడం ఎంచుకున్నారు. దాన్ని కూడ చాలా తొందరలోనే వదిలేశారు.

బాల్కో కేసులో సుప్రీంకోర్టు ఏం చెప్పిందంటే రాజ్యాంగాన్నో, చట్టాన్నో దేన్నో ఒకదాన్ని ఉల్లంఘించనపుడు కోర్టులు ప్రభుత్వ ఆర్థిక విధాన నిర్ణయాలను కొట్టివేయలేవని అంది; ప్రభుత్వం అనుసరించిన విధానమే రాజ్యాంగానికి విరుద్ధంగా ఉందన్న ఫిర్యాదును అది పట్టించుకోలేదు. నర్మదా బచావో ఆందోళన కేసు[8] విషయంలోనూ అదే చెప్పింది. రెండు కేసుల్లోనూ తీర్పు చెప్పిన న్యాయమూర్తి బి. ఎన్. కిర్పాల్ చట్టబద్ధమైన హక్కుల ఉల్లంఘన ఏదీ జరగనంత కాలం విధాన నిర్ణయాలలో కోర్టులు జోక్యం చేసుకోబోవని స్పష్టం చేశారు. ఇది రాజ్యాంగం పట్ల కోర్టులకు ఉన్న బాధ్యతను పూర్తిగా వదిలివేయడమే. విధాన నిర్ణయాలు రాజ్యాంగం నిర్దేశించిన పరిపాలనా లక్ష్యాల చట్రానికి లోబడి ఉండేలా చూడడం కోర్టుల బాధ్యత. తన వ్యాఖ్యానం ద్వారా సుప్రీంకోర్టు ఆ బాధ్యతను పూర్తిగా ఎప్పుడూ విశదీకరించలేదు. గత శతాబ్దపు 70, 80 దశాబ్దాలలో ఆ దిశలో ఒక ప్రయత్నం – ఆదేశిక సూత్రాల వెలుగులో ప్రాథమిక హక్కులను వ్యాఖ్యానించాలన్న ప్రయత్నం మొదలైంది. అన్నారు కాని 21 శతాబ్దం వచ్చేసరికి ఆ వివేకానికి తిలోదకాలు ఇచ్చారు. కొనుగోలు శక్తి వున్న వాళ్లను ఊరిస్తున్న 'అభివృద్ధి' స్వర్గాన్ని అందుకోవాలని కులీన వర్గాలతో సమంగా న్యాయమూర్తులు కూడ ఆరాటపడుతూ ఉన్నారు.

న్యాయస్థానాలలో ప్రజల సమస్యలకు పరిష్కారం పొందేందు కోసం ఎనభై దశకంలో కనుగొన్న ప్రజా ప్రయోజన వ్యాజ్యం అనే సాధనాన్ని గత కొద్ది సంవత్సరాలలో సుప్రీంకోర్టు చాలా బలహీనం చేసింది. ప్రజా ప్రయోజన వ్యాజ్యం అన్నది 'ప్రభుత్వం తన పరిపాలనాధికారాన్ని నిర్వర్తించే క్రమంలో తీసుకునే ఆర్థిక నిర్ణయాలను సవాలు చేసే సాధనం కానే కాదని' బాల్కో కేసులో ప్రకటించారు. ప్రభుత్వరంగ సంస్థలలో 'పెట్టుబడుల ఉపసంహరణ నిర్ణయం, దాని అమలు అనేవి ఆర్థిక విధానానికి సంబంధించిన పరిపాలనా నిర్ణయాలు మాత్రమే. ఆ విధాన నిర్ణయాలతో సంబంధం లేని వారెవరూ వాటిని సవాలు చేయదానికి వీల్లేదు. అది ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం పరిధిలోకి రాదు' అని ప్రకటించారు. ఇంకో సందర్భంలో 'తమ ప్రయోజనాలను పరిరక్షించుకోలేని పేదలు, బలహీన వర్గాలకు న్యాయాన్ని సాధించేందుకు ఉద్దేశించిన సాధనమే ప్రజా ప్రయోజన వ్యాజ్యం' అని కూడ వారే సెలవిచ్చారు. ప్రజా ప్రయోజన వ్యాజ్యాలలో అత్యంత ప్రసిద్ధి చెందిన కేసు 'న్యాయమూర్తుల బదిలీ' కేసు[9] అనే విషయం కోర్టు వారు బహుశా మర్చిపోయినట్లున్నారు. ఒక హైకోర్టు నుంచి మరొక హైకోర్టుకు న్యాయమూర్తులను బదిలీ చేసే విధానాన్ని సవాలు చేస్తూ కొందరు న్యాయవాదులు ఆ కేసు వేశారు. న్యాయమూర్తులు తమ

ప్రయోజనాలను కాపాడుకోలేనంత అశక్తులూ కారు,  వారు 'పేదలు, బలహీన వర్గాల వారు' అంతకన్నా కారు. న్యాయమూర్తుల బదిలీ 'ప్రభుత్వ విధానానికి సంబంధించిన పరిపాలనా నిర్ణయం మాత్రమే.' అయినా ఆ కేసును ప్రజా ప్రయోజన వ్యాజ్యంగా స్వీకరించారు. న్యాయమూర్తుల బదిలీకి సంబంధించి కార్యనిర్వాహక అధికారానికి పరిమితులు విధిస్తూ వివరమైన తీర్పును కూడ ఇచ్చేశారు.

ప్రభుత్వం లేదా ప్రభుత్వ విభాగాల చర్యతో ప్రత్యక్ష బాధితులు కానప్పటికీ, ఆ వ్యక్తులు రెండు సందర్భాలలో ప్రజా ప్రయోజనాల రీత్యా కోర్టు తలుపు తట్టవచ్చునని మొదటినుంచీ భావిస్తూ వస్తున్నారు. ఒకటి, కోర్టు ముందుకు వచ్చి గొంతెత్తి మాట్లాడలేని ప్రజలను ఒక ఆ చర్య బాధించినప్పుడు. రెండవది, ఎవరో ఒక ప్రత్యేక వ్యక్తినో, ఒక ప్రత్యేక బృందాన్నో కాక ఆ చర్యవల్ల మొత్తం సమాజానికే, ప్రాథమిక పరిపాలనా సూత్రాలకే నష్టం వాటిల్లినప్పుడు, ప్రత్యక్ష బాధితులు కానివారు కూడ ప్రజా ప్రయోజన వ్యాజ్యంతో కోర్టు మెట్లు ఎక్కవచ్చు. మధుర చమురు శుద్ధి కేంద్రం కాలుష్యం తాజ్ మహల్‌కు నష్టం కలిగించడాన్ని కోర్టు దృష్టికి తెస్తూ పర్యావరణవాదులు కేసు వేస్తే కోర్టు దానిని స్వీకరించింది. తన మోటెల్ నిర్మాణం కోసం బియాస్ నదిని మళ్లించడంలో కేంద్ర మంత్రి కమల్ నాథ్‌కి  అనుమతి నివ్వడంలో అధికార దుర్వినియోగాన్ని సవాలు చేస్తూ ప్రజాప్రయోజన వ్యాజ్యం వేస్తే స్వీకరించింది. ఈ రెండు సందర్భాలలోనూ కోర్టు ప్రజా ప్రయోజన వ్యాజ్యానికి అనుమతించాయి. రెండవ కారణం రీత్యానే కోర్టు వీటిని స్వీకరించింది. అదేవిధంగా ఉపాధి కల్పిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థను అనవసరంగా అమ్మడాన్ని, అది కూడ కారు చౌకగా ప్రయివేటు వ్యక్తులకు అమ్మడాన్ని కోర్టు అడ్డుకోవాలని బాల్కో ఉద్యోగులు కూడ న్యాయస్థానాన్ని కోరారు. మరి హఠాత్తుగా బాల్కో ఉద్యోగులు ప్రభుత్వ విధాన నిర్ణయాలతో ప్రత్యక్ష సంబంధం లేని పరాయి వ్యక్తులు ఎలా అయ్యారు? ఇదే సూత్రాన్ని వారు అన్వయిస్తూ పోతే లాయర్ కార్యకర్త అయిన ఎం.సి. మెహతా తనకు ఎంతో మంచి పేరు సంపాదించి పెట్టిన పర్యావరణ అంశాలపై ఇకముందు ఎటువంటి కేసులనూ వేయలేడు. ఎందుకంటే ఆయన ఏ కేసులోనూ ప్రత్యక్ష బాధితుడు కాదు.

బాల్కో కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రజా ప్రయోజన వ్యాజ్యాలకు మరొక ప్రమాదకరమైన పరిమితిని విధిస్తున్నది. ప్రజా ప్రయోజన వ్యాజ్యం కింద ప్రభుత్వ ప్రాజెక్టులను లేదా పథకాలను సవాలు చేస్తున్నపుడు ఒక షరతు మీద మాత్రమే ఎక్స్ పార్టీ స్టే లేదా ఇంజంక్షన్ ఉత్తర్వులు ఇవ్వడం వీలవుతుందని పేర్కొంది. అదేమిటంటే

తర్వాత ఆ కేసును గనక కొట్టివేస్తే, ఏ ప్రాజెక్టును అడ్డుకోవడానికి కేసు వేశారో ఆ ప్రాజెక్టుల మొత్తం వ్యయాన్ని ఫిర్యాదుదారు చెల్లించాలని చెప్పారు. అడగగానే ప్రాజెక్టులపై స్టే ఇవ్వాలని ఎవరూ అనడం లేదు. కాని కేసును కొట్టివేస్తే ఫిర్యాదుదారే ప్రాజెక్టు వ్యయాన్ని చెల్లించాలన్న షరతు విధిస్తే, అది ఏ వ్యక్తికి గానీ, బృందానికి గానీ సాధ్యమయ్యే పని కాదు. పైగా అత్యంత అవాంఛనీయమైన, అహేతుకమైన ప్రాజెక్టులను సైతం ప్రజా ప్రయోజన వ్యాజ్యం ద్వారా అడ్డుకోకుండా చేస్తుంది ఈ షరతు. స్టే కోరకుండా ప్రాజెక్టులను సవాలు చేయడంలో అర్థం ఉండదు. ఎందుకంటే, ప్రాజెక్టు పూర్తయిన తర్వాత ఏ కోర్టు కూడ దానిని కూల్చివేయమని తీర్పు చెప్పబోదు. కోర్టు కేసులలో గెలుపు అనేక అనిశ్చితాలతో కూడుకున్న విషయం కాబట్టి ఎవరూ ముందే ఊహించలేరు. సారాంశంలో, ప్రభుత్వం పెద్దఎత్తున పెట్టుబడి పెట్టి నిర్మించే ఏ ప్రాజెక్టు విషయంలోనూ న్యాయస్థానాల జోక్యం ఉండబోదని సుప్రీంకోర్టు చెప్పినట్టే అయింది. ఆర్థిక సంస్కరణలు మొదలయినప్పటి నుండీ వాటిలో న్యాయపరమైన జోక్యం ఉండకూడదనే పాలకులు కోరుకుంటూ వచ్చారు. అది ఇప్పుడు నెరవేరింది. నిజానికి, కోర్టులు ప్రజా ప్రయోజన వ్యాజ్యాలను చాలా ఉత్సాహంగా స్వీకరిస్తున్న రోజులలో వాటిని నిషేధించడమో, నియంత్రించడమో చేయాలని రాజకీయ వర్గాలలో చర్చ నడుస్తూ ఉండేది. కానీ వాళ్లకి అప్పుడు ఆ పని చేయడానికి ధైర్యం చాలలేదు. ఆ తర్వాత సుప్రీంకోర్టే వాళ్లకి ఆ సహాయం చేసి పెట్టింది.

పౌర, ప్రజాస్వామిక హక్కుల విషయంలో కూడ కోర్టుల వైఖరి చాలా మారింది. 'సంస్కరణ'లను బలంగా సమర్థించే సామాజిక, రాజకీయ కులీన వర్గాలలో ప్రజాస్వామిక హక్కుల పట్ల రోజురోజుకీ పెరుగుతున్న అసహనాన్ని తమ ఉదారవాద న్యాయ వివేకంతో (Liberal Judicial Wisdom) అదుపు చేసే బదులు వాళ్ళ కోరికనే అవి ఎక్కువగా మన్నిస్తున్నాయి. బంద్‌కు పిలుపు నివ్వడం, ఎటువంటి బలప్రయోగపు హెచ్చరికలు లేకుండా ఇచ్చినా సరే, రాజ్యాంగ విరుద్ధమని తీర్పు చెబుతూ కేరళ హైకోర్టు[10] ఏకంగా ఒక రాజకీయ సిద్ధాంత గ్రంథం లాంటి తీర్పే రాసింది. సిపిఐ(ఎం) ఈ తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించినపుడు న్యాయమూర్తి ఎం. బి. షా మొత్తం పౌరహక్కుల కేసుల చరిత్రలోనే అత్యంత క్లుప్తమైన తీర్పు[11] ఇచ్చాడు. కేరళ హైకోర్టు తీర్పులోని కొన్ని వాక్యాలను పేర్కొంటూ ఆ అంశాలతో తనకు ఏకాభిప్రాయం ఉన్నట్టు ప్రకటించాడు. బంద్ అమలు కోసం బలప్రయోగానికి పాల్పడిన సందర్భాలు లేవని ఎవరూ అనడం లేదు. అది శిక్షార్హమైన నేరమనీ తెలుసు. అలాంటపుడు దానిని నిషేధిస్తూ సుప్రీంకోర్టు ప్రత్యేకంగా ప్రకటన చేయనవసరం లేదు. బలప్రయోగంతో బంద్‌లు అమలు జరిపిన

ఉదాహరణలు ఉన్నట్టే, సామూహిక నిరసన లేదా సానుభూతి తెలియజేయడం కోసం ప్రజలు తమంత తాముగా బంద్ నిర్వహించిన దృష్టాంతాలు కూడ ఉన్నాయి. శాంతియుత సామూహిక నిరసన చర్య కూడ రాజ్యాంగ విరుద్ధమైనది ఎలా అవుతుంది?

న్యాయవాదుల సమ్మె కేసు సందర్భంలో న్యాయవాదులు ఎలాంటి పరిస్థితులలోనూ సమ్మె చేయకూడదని ఇదే న్యాయమూర్తి తీర్పు చెప్పారు. తమిళనాడు ఉద్యోగుల కేసు సందర్భంలో ఉద్యోగులను ఉక్కు పిడికిలితో అణచివేసినందుకు జయలలితను ప్రశంసిస్తూ తీర్పు రాసింది కూడ ఈయనే. ఉద్యోగులకు చట్టపరంగా గానీ, న్యాయపరంగా గానీ సమ్మె చేసే హక్కు లేనే లేదని ప్రకటించారు. ఈ తీర్పుల నుంచి మనకు అర్థమయ్యే విషయం ఒకటే – ఎం. బి. షా వ్యక్తిగతంగా సమ్మెలను సహించడని. ఆయన అభిప్రాయాలు ఆయనకు ఉండవచ్చు, ఉండే హక్కు ఆయనకు ఉంది. కాని ఈ దేశపు చట్టాలను నిర్దేశించే పదవిలో ఉన్నాడు కాబట్టి, పస లేని కారణాలను పేర్కొంటూ తన అభిప్రాయాలనే ఈ దేశపు చట్టంగా ప్రకటించే హక్కు మాత్రం, మనకెవరికీ లేనట్టే, ఆయనకీ లేదు. అయితే ఇక్కడ నేను చెప్పదలచుకుంది ఏమిటంటే – ప్రజల పౌరహక్కులు భవిష్యత్తులో ప్రభుత్వ ఆర్థిక సంస్కరణల కార్యక్రమానికి ఆటంకం కావొచ్చున్న అనుమానం కార్యనిర్వాహక యంత్రాంగానికి ఎప్పటినుండో ఉంది. అందుకోసం ప్రజాస్వామిక నిరసననే నిషేధించాలన్న ఆలోచన కూడ ఉంది. కాని వాళ్ళు ఆ పని చేయాలని ఇంకా గట్టిగా అనుకోక ముందే సుప్రీంకోర్టు ఆ పని మొదలుపెట్టి కొంచెం కొంచెంగా పౌర హక్కుల్ని నీరుగారుస్తూ పోవడం చూస్తున్నాం.

కార్మిక సంఘాలకు 'బయటి' నాయకత్వం ఉండడం పారిశ్రామిక యాజమాన్యాలకు సామాన్యంగా ఇష్టం ఉండదు. తమ సంస్థలో పనిచేసే కార్మికులు మాత్రమే ఉండే సంఘాలనైతే వాటితో వ్యవహరించడం వారికి చాలా సులువు అవుతుంది. అయితే ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలలో అనుభవం ఉన్న కార్మికేతరులు కార్మికసంఘాల కార్యనిర్వాహక వర్గంలో సభ్యులుగా ఉండడాన్ని చట్టం అనుమతిస్తుంది; పారిశ్రామిక వివాదాలు తలెత్తినప్పుడు వాళ్ళు కార్మికులకు తగిన నాయకత్వాన్ని అందించగలుగుతారన్న ఉద్దేశంతో. కార్యనిర్వాహక సంఘంలో సగానికి మించకుండా బయటి వారు కార్మికసంఘంలో ఉండడాన్ని పారిశ్రామిక వివాదాల చట్టమూ, కార్మిక సంఘాల చట్టమూ కూడ అనుమతిస్తాయి. ఈ చట్టాలను మార్చాలని సణుగుతూనే, ఇష్టం లేకున్నా, యాజమాన్యాలు వాటికి కట్టుబడి ఉంటున్నాయి. మన శాసనకర్తలు (మనం రోజూ తిట్టే రాజకీయ నాయకులు) ఈ డిమాండుకు స్పందించక ముందే సుప్రీంకోర్టు[12] మాత్రం

తన పరిధిని అతిక్రమించి మరీ – పారిశ్రామిక వివాదంలో కార్మికులకు కార్మికేతరులు ప్రాతినిధ్యం వహించడానికి వీలు లేదని ప్రకటించింది. చట్టానికి వ్యతిరేకంగా ఉత్తర్వులు జారీ చేసే అధికారం తమకు లేదని తెలిసి కూడ న్యాయమూర్తులు ఈ తీర్పు చెప్పారు. ఇరవయ్యో శతాబ్దంలో ఎంతో ఆదరణ పొందిన ఈ కాలం చెల్లిన, వెనుకబడిన సిద్ధాంతాలకు ఇవ్వాళ రాజ్యపాలనలోనే కాదు, రాజ్యాంగంలో సైతం చోటు ఉండకూడదని న్యాయమూర్తులు ఎంత గట్టిగా భావిస్తున్నారో, వాటి పట్ల ఎంత అసహనంతో ఉన్నారో ఈ తీర్పులు తెలియజేస్తున్నాయి.

'కఠినమైన' నేర శిక్షా స్మృతి రావాలన్నది నేటి కులీన వర్గాల మరో బలమైన కోరిక. తాము అనుసరిస్తున్న సామాజిక ఆర్థిక విధానాలు, మైనారిటీల పట్ల నిరంతరం కొనసాగుతున్న చిన్నచూపు సమాజంలో అశాంతికి దారితీస్తాయని వాళ్ళకి తెలుసు. నేర దర్యాప్తు, నిర్బంధం, న్యాయ విచారణ పద్ధతులలో ఉదారవాద సూత్రాలను వాళ్ళు ఓరిమితో సహించిన రోజులు పోయాయి. కానీ, ఇందులో కూడ, న్యాయమూర్తులే శాసనకర్తల కంటే కఠినమైన వైఖరులను ప్రదర్శిస్తున్నారు. ప్రభుత్వం టెర్రరిస్టు మరియు విచ్ఛిన్నకర కార్యకలాపాల (నిరోధక) చట్టం (టాడా) స్థానంలో టెర్రరిజం నిరోధక చట్టాన్ని (పోటా) తీసుకొచ్చిందన్న మాటే గాని అందులో కొత్తగా చేర్చిన కొన్ని నిబంధనలు మరింత కఠినంగా ఉన్నాయి. అయితే పాత నిబంధనలలో కొన్నిటిని కొద్దిగా సడలించారు. గమనించాల్సిన విషయం ఏమిటంటే అంతిమంగా ఆమోదించిన పోటా చట్టం కంటే లా కమిషన్ మధ్యలో ప్రతిపాదించిన నేర స్మృతి సవరణ బిల్లు మరింత కఠినంగా ఉంది. అప్పుడు లా కమిషన్ అధ్యక్షుడు ఎవరో కాదు, బి.పి జీవన్ రెడ్డి. ఈయన మితవాద శిబిరంలోని న్యాయమూర్తేమీ కాదు. వామపక్ష ఉదారవాద శిబిరంలో వ్యక్తిగానే పరిగణించవచ్చు.

బ్రిటిష్ వాళ్ళ ద్వారా మనకు సంక్రమించిన నేర శిక్షా స్మృతి స్థానంలో ప్రతి నేరస్తుడూ తప్పకుండా శిక్షించబడే సమగ్రమైన మరో నేర శిక్షా స్మృతి ప్రస్తుతం రూపొందించబడుతోంది. రిటైరైన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (కేరళ, కర్ణాటక), జాతీయ మానవ హక్కుల సంఘం మాజీ సభ్యుడూ అయిన వి.ఎస్. మాలిమత్ రూపొందించిన ముసాయిదా ప్రతిపాదనలు ఎంత ఘోరంగా ఉండాలో అంత ఘోరంగా ఉన్నాయి. నేర విచారణ క్రమంలో సాక్షులు పోలీసులకు ఇచ్చే మొదటి వాంగ్మూలానికే చివరిదాకా కట్టుబడి ఉండాలనేది ఆ ప్రతిపాదనలలోని అత్యంత అభ్యంతరకరమైన

ప్రతిపాదన. దీని ప్రకారం సాక్షులు తాము మొదట పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలానికి కట్టుబడి నిందితులను జైలుకు పంపాలి, ఒకవేళ ఆ తర్వాత భిన్నమైన ప్రకటన చేస్తే పోలీసులకు తప్పుడు వాంగ్మూలం ఇచ్చినందుకు తామైనా జైలుకు పోవాలి. ఈ ప్రతిపాదన పోలీసులకు అసాధారణమైన అధికారాన్ని కల్పిస్తుంది. దీనితో, ఏ న్యాయవిచారణనైనా పోలీసులు తాము అనుకున్న విధంగా నడిపించి శిక్షలు వేయించగలుగుతారు. కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ ఈ సలహాను స్వీకరించి, పార్లమెంటులో ఒక బిల్లును కూడ ప్రవేశపెట్టింది. నిజానికి న్యాయ మంత్రిత్వ శాఖ అధికారులు రూపొందించి, శాసనసభ్యులు ఆమోదించిన ఆ బిల్లు రిటైర్డు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, జాతీయ మానవ హక్కుల సంఘం మాజీ సభ్యుడు వి.ఎస్. మాలిమత్ రూపొందించిన ప్రతిపాదనల కంటే కాస్త మెరుగ్గానే ఉంది. సాక్షి పోలీసులకు ఇచ్చే వాంగ్మూలాన్ని ఒక న్యాయమూర్తి సమక్షంలో రికార్డు చేయాల్సి ఉంటుందని, అప్పుడు మాత్రమే ఆ వాంగ్మూలం నుండి వైదొలిగిన సాక్షిని ప్రాసిక్యూట్ చేయవచ్చని పేర్కొంది. ఇక్కడ కూడ ఆ నిబంధనలను సడలించి, సాక్షిని ప్రాసిక్యూట్ చేయాలా వద్దా అనే నిర్ణయాన్ని న్యాయవిచారణ జరుపుతున్న కోర్టు నిర్ణయానికి వదిలివేయాలని చెప్పారు. దీని ప్రకారం కూడ సాక్షులపై ఒత్తిడి పెట్టి తమకు కావాల్సిన శిక్షలు పడేలా చేయడానికి పోలీసులకు కొంత అవకాశం ఉండొచ్చు. అయినా, వి.ఎస్. మాలిమత్ చేసిన ప్రతిపాదనల కంటే మాత్రం మెరుగైనదే.

నేను ముందు మొదలు పెట్టిన అంశం దగ్గరకి మళ్ళీ వద్దాం. ఈ తిరోగమనం, ప్రజల హక్కులకు కోర్టులు కల్పించే రక్షణను దెబ్బతీయడం మాత్రమే కాక, ఆర్థిక సంస్కరణలను బలపరిచే భావాలకు న్యాయబద్ధతను కలిగించడం మొదలుపెడుతుంది. ఏదైనా విషయం నిజమని చెప్పడానికి 'కోర్టు తీర్పు'ని సాక్ష్యంగా పేర్కొనడమనేది మన దేశ ప్రజల ఆలోచనలలో ఎప్పటినుండో ఉంది. విధాన మార్పులలో జోక్యం చేసుకోవడానికి నిరాకరించడం వల్ల జరిగే ప్రత్యక్ష నష్టం కంటే ఆర్థిక సంస్కరణలను బలపరిచే భావాలకు న్యాయబద్ధతను కల్పించడం ద్వారా జరిగే నష్టంలోనే కపటత్వం ఎక్కువ. అయితే ఈ నష్టం కూడ తక్కువైనదేమీ కాదు.

రాజ్యాంగ ముసాయిదాను రాజ్యాంగ సభ ముందు చర్చకు, ఆమోదానికి ప్రవేశపెడుతూ అంబేద్కర్ ఆదేశిక సూత్రాల గురించి చాలా దూరదృష్టితో కొన్ని మాటలు చెప్పాడు. ఏ మాత్రం బలం లేని అలంకారప్రాయ సూత్రాలని తృణీకరించడం నుండి, ప్రజలను దగా చేయడమేనని విమర్శించడం దాకా రకరకాలుగా మాట్లాడారు. నిజానికి

రాజ్యాంగం ప్రజలకు కల్పించాల్సిన హక్కుల పట్ల అంబేద్కర్‌కు కొన్ని వ్యక్తిగత అభిప్రాయాలు ఉన్నప్పటికీ ఎన్నో పరిమితులతో రూపొందిన రాజ్యాంగ ముసాయిదాని ఆమోదిస్తూ, ఆయన ఇలా వివరించాడు.

> *ఒక వ్యవస్థ ప్రజాస్వామిక పరీక్షకు నిలబడాలంటే, అధికారంలో ఎవరు ఉండాలనేది ప్రజలే నిర్ణయించాలి. అదే సరైనది. అయితే, ఎవరు అధికారం చేజిక్కించుకున్నా వాళ్ళు తమ ఇష్టానుసారం వ్యవహరించలేరు. తమ అధికార విధులను నిర్వర్తించడంలో వాళ్ళు ఆదేశిక సూత్రాలు అనే ఈ సూచనలను విధిగా గౌరవించాల్సి ఉంటుంది. వాటిని విస్మరించడం కుదరదు. వాటిని పాటించనందుకు కోర్టులో జవాబు చెప్పనవసరం లేకపోవచ్చు కానీ, ప్రజలకు ఎన్నికల సమయంలో తప్పనిసరిగా సమాధానం చెప్పవలసి ఉంటుంది. మితవాద శక్తులు అధికారాన్ని చేజిక్కించుకున్నప్పుడు ఈ ఆదేశిక సూత్రాల విలువ ఏమిటో తెలిసి వస్తుంది.*[13]

దూరదృష్టితో భవిష్యత్తుని ఊహించి చెప్పిన మాటలు ఇవి. అయితే, అంబేద్కర్ చెప్పిన ఆ విలువ కార్యరూపం దాల్చడానికి కోర్టులు కూడ కొంత కృషి చేసి ఉండాల్సింది. తమ వ్యాఖ్యానాల ద్వారా, తీర్పుల ద్వారా వారు అంబేద్కర్ చెప్పిన పై మాటలను ఒక విషయంలో సవరించి ఉండాల్సింది. అధికారంలో ఉన్నవారిని – ఆదేశిక సూత్రాల ఉల్లంఘనకు కాకపోయినా, ఆదేశిక సూత్రాల అమలు దిశలో ముందుకు సాగనందుకు, ఎన్నికల సమయంలో ప్రజలకు మాత్రమే కాక కోర్టుల ముందు కూడ జవాబుదారీగా నిలబెట్టే అధికారాన్ని న్యాయమూర్తులు సంతరించుకోవలసింది. రాజ్యాంగానికి ఉన్న పరిమితులలోనే మనం జీవించాలి నిజమే, కాని రాజ్యాంగంలో అంతర్లీనంగా ఉన్న ఉత్తమ ఆకాంక్షలను ఇముడ్చుకోవడానికి దాని పరిధిని వీలైన మేరకు విస్తరించాల్సిన బాధ్యత కూడ మనపైనే వుంది. ఇది కోర్టులకూ వర్తిస్తుంది. వారికే కాదు, రాజ్యాంగబద్ధంగా పని చేయాల్సిన వారందరికీ వర్తిస్తుంది. ఆ దిశలో 25 సంవత్సరాల క్రితం ఒక బలహీనమైన ప్రయత్నం మొదలై చాలా కొద్దికాలంలోనే ఆగిపోయింది. ఈ రోజు 'మితవాద శక్తులు' 'ప్రయత్నపూర్వకంగా అధికారాన్ని చేజిక్కించుకున్నారు'. ఈ మాట నేను కేవలం బిజెపిని మాత్రమే ఉద్దేశించి అనడం లేదు. అంతే కాదు, వాళ్ళు కోర్టులను కూడ గణనీయంగానే తమ అధీనంలోకి తెచ్చుకున్నారు. అయితే పూర్తిగా కాదు, సుప్రీంకోర్టుతో

సహా అన్ని కోర్టుల నుంచి ఇంకా అప్పుడప్పుడూ భిన్న స్వరాలు వినిపిస్తూనే ఉన్నాయి. కాని అప్పుడప్పుడూ మాత్రమే. ఇతర రాజ్య విభాగాలపైన ఎంత తీవ్రమైన, రాజీలేని విమర్శ చేస్తున్నామో, కోర్టులను కూడ అలాగే నిరంతరం విమర్శనాత్మకంగా చూడడం తప్ప ఈ పరిస్థితిని చక్కదిద్దే వేరే పరిష్కారాలు ఏవీ మన దగ్గర లేవు. కోర్టులను విమర్శించాలంటే భయపడే వాళ్ళకి ఊరటగా ఒక మాట: కోర్టులపై చేసే విమర్శ అంతా కోర్టు ధిక్కరణ కాదు. ఒకవేళ కోర్టు ధిక్కారంగా పరిగణించినా, అందుకు గరిష్టంగా విధించే శిక్ష కేవలం ఆరు నెలల సాధారణ జైలు శిక్ష మాత్రమే.

1. ఎం.సి. మెహతా వర్సస్ కమల్ నాథ్ (1999), 1 సుప్రీంకోర్టు కేసులు 388
2. స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా వర్సస్ నేషనల్ వాటర్ ఫ్రంట్ వర్కర్స్ యూనియన్, (2001) 7 సుప్రీంకోర్టు కేసులు 1
3. రణధీర్‌సింగ్ వర్సస్ యూనియన్ ఆఫ్ ఇండియా (1982) I లేబర్ లా జర్నల్ 344
4. స్టేట్ ఆఫ్ హర్యానా వర్సస్ జస్మీర్ సింగ్ (1997) II లేబర్ లా జర్నల్ 667
5. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ వర్సస్ కె. ఎస్. జగన్నాథన్ (1986) 2 సుప్రీంకోర్టు కేసులు 679
6. అజిత్ సింగ్ వర్సస్ స్టేట్ ఆఫ్ పంజాబ్ (1999) 7 సుప్రీంకోర్టు కేసులు 209
7. బాల్కో ఎంప్లాయీస్ యూనియన్ వర్సస్ యూనియన్ ఆఫ్ ఇండియా, ఆల్ ఇండియా రిపోర్టర్ 2002 ఎస్ సి 350
8. నర్మదా బచావో ఆందోళన్ వర్సస్ యూనియన్ ఆఫ్ ఇండియా (2000) 10 సుప్రీంకోర్టు కేసులు 664
9. సుప్రీంకోర్టు అడ్వొకేట్స్ అసోసియేషన్ వర్సస్ యూనియన్ ఆఫ్ ఇండియా, (1993) 4 సుప్రీంకోర్టు కేసులు, 441
10. భరత్ కుమార్ కె. పలీచా వర్సస్ స్టేట్ ఆఫ్ కేరళ, ఆల్ ఇండియా రిపోర్టర్, కేరళ 291
11. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) వర్సస్ భరత్ కుమార్, (1998) 1 సుప్రీంకోర్టు కేసులు, 201
12. ఎస్.బి.ఐ. స్టాఫ్ అసోసియేషన్ వర్సస్ ఎస్.బి.ఐ, (1996) 4 సుప్రీంకోర్టు కేసులు 378
13. ది ఫ్రేమింగ్ ఆఫ్ ఇండియాస్ కాన్స్టిట్యూషన్: ఎ స్టడీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, 1968, పేజీ 329

*Orginal title in English: Globalisation and The Courts*

*అనువాదం : సుధాకిరణ్*

CONSTITUTION@75YEARS



“ మానవ హక్కుల దృష్టితో చూసినపుడు మన రాజ్యాంగంలో కనిపించే ఒక వైరుధ్యం ఏమిటంటే పాశ్చాత్య దేశాల ఉదార భావాలను, తూర్పు దేశాల సోషలిస్టు భావాలను, భారతదేశ తిరుగుబాటు సంప్రదాయాలను సమపాళ్ళలో మేళవించిన అత్యున్నత లక్ష్యాలను అది దేశానికి నిర్దేశిస్తుంది కాని ఆ లక్ష్యాలను సాధించడానికి ప్రజల చేతికి బలమైన సాధనాలను మాత్రం ఇవ్వదు. పైపెచ్చు ప్రజల పోరాటాలను తప్పనిసరిగా వ్యతిరేకించే అధికార యంత్రాంగానికి అందుకు అవసరమైన అధికారాలను కట్టబెట్టింది. రాజ్యాంగ లక్ష్యాల సాధనకు అడ్డంకిగా ఉన్నది అసమానతలే అయినపుడు ఆ అసమానతలకు వ్యతిరేకంగా ఉద్యమించే ప్రజలకు అది సమకూర్చగల అత్యంత శక్తివంతమైన సాధనం – పోరాడేందుకు అవసరమైన స్వేచ్ఛలు. నిత్య పోరాటాల పట్ల రాడికల్ మేధావులలో చాలా సాధారణంగాను, ప్రజల్లో మాత్రం అత్యంత అరుదుగాను కనిపించే రొమాంటిసిజం నాకేమీ లేదు. వ్యవస్థీకృత అసమానతలు అణగారిన వర్గాల సంఘటిత పోరాటాల ద్వారా మాత్రమే రద్దవుతాయన్న వాస్తవిక దృష్టికోణం నుంచి మాత్రమే చెబుతున్నాను. ఈ విషయంలో చట్టమూ, ప్రజాస్వామ్య ప్రాతినిధ్య సంస్థలు కొంత పాత్ర పోషించగలవు – నిజానికి వాటి అవసరం కూడ చాలా ఉంటుంది – కాని పర్వతాల్లా మేట వేసిన అణచివేతలను కదిలించడానికి కావాల్సిన బలం వాటికి చాలా అరుదుగానే ఉంటుంది. ”

₹. 50/-


**మానవహక్కుల వేదిక ప్రచురణ**

**Human Rights Forum**